శుక్రవారం 14 ఆగస్టు 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవ



## పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అధ్యయనం

ఇంధన శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

- వివరాలు 4 లో..



## దేశం మెచ్చేలా అమరావతి

- రాజధాని నిర్మాణంలో ఇది తొలిమెట్టు
- చివరి మెట్టు వరకు ఇక అన్‌స్టాపబుల్
- రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ 2028కి ప్రధాని చేతులమీదుగా ప్రారంభిస్తాం
- గ్రాఫిక్స్ అన్నవాళ్లు తలలు దించుకోవాలి
- భూములిచ్చిన రైతులందరికీ పాదాభివందనం
- రోడ్లను అడ్డుకోవాలని కుట్రలు చేశారు
- అలాంటి దుర్మార్గులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం
- జాతీయ జెండా ఎగురవేసి స్ఫూర్తి నింపుదాం
- జాతి నిర్మాణానికి నేను నా సంకల్పం తీసుకోవాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభం
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల పరిశీలన

2

అమరావతి యజ్ఞంలో మరో మైలు రాయి ఆవిష్కృతమైంది. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ - మంగళగిరి - గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జిని శిలాఫలకం ఆవిష్కరించి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయింది.. రాష్ట్రాభివృద్ధి, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు..చివరి మెట్టు వరకు అమరావతి ఇక అన్‌స్టాపబుల్ అని ఉద్ఘాటించారు. అమరావతిని డీప్‌టెక్ నగరంగా..దేశం మెచ్చిన రాజధానిగా తీర్చిదిద్దుతామని, 2028లో ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్క రించుకుని ప్రతిఒక్కరూ జాతీయ జెండా ఎగురవేసి జాతి నిర్మాణానికి నేను నా సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రాయపూడి వద్ద నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని పరిశీలించి జీఏడీకి అప్పగించారు.







### స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు

## అసెంబ్లీ, సచివాలయ భవనాలు జిగేల్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అసెంబ్లీ, సచివాలయ భవనాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంక రించారు. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ప్రతిబింబించేలా సచివాలయంలోని ఐదు భవనాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. అసెంబ్లీ భవనం విద్యుత్ దీపాలతో మిరుమిట్లు గొలుపుతోంది. విజయవాడ లోక్ భవన్, ఉండవల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, ప్రకాశం బ్యారేజ్, ప్రఖ్యాత ఉండవల్లి గుహలు, ఇతర చారిత్రక ప్రాముఖ్యత కలిగిన భవనాలు, ప్రముఖ కట్టడాలను సైతం విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.



### అర్హులకు అన్యాయం..

## అక్రమాల మాయాజాలం!

### గత ప్రభుత్వంలో గ్రూప్1లో అతిపెద్ద కుంభకోణం

వైసీపీ హయాంలో జరిగిన గ్రూప్ 1 పరీక్షల్లో అక్రమాల పుట్ట బద్దలైంది. హైకోర్టుకు సమర్పించిన ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఐదేళ్ల గొడ్డలిపార్టీ పాలనలో అత్యున్నత రాజ్యాంగ సంస్థ ఏపీపీఎస్సీని అడ్డాగా చేసుకుని గ్రూప్-1 ఉద్యోగాలను సంతలో పశువుల్లా ఎలా అమ్మేశారో దీనిని బట్టి తెలుస్తోంది.





8



### భారతదేశంలో అత్యంత నివాసయోగ్యమైన నగర నిర్మాణానికి ఒక వ్యక్తి సంకల్పం...

## ద మ్యాన్ ఆన్ మిషన్!

ఆధునిక భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అమరావతి నగర నిర్మాణ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్న ప్రాంతాన్నిఅమెరికాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ దినపత్రిక "న్యూయార్క్ టైమ్స్" జర్నలిస్టులు ముజీబ్ మాషల్, హరికుమార్ సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన కలల రాజధాని అమరావతిని క్వాంటమ్ వ్యాలీ టెక్ హబ్, వాటర్ వేస్, సైకిల్ వేస్ తో అత్యంత సుందరంగా నిర్మించడానికి 25వేలమంది కార్మికులను వినియోగిస్తున్నారని ఆ కథనంలో పేర్కొన్నారు. న్యూయార్క్ టైమ్స్ స్టోరీ సారాంశం యథాతథంగా చైతన్యరథం పాఠకుల కోసం...

6






# అమరావతి నిర్మాణంలో మొదటి మెట్టు

అమరావతి(చైతన్యరథం): సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభం తో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ - మంగళగిరి - గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని శిలాఫలకాన్ని ఆవిష్కరించి ఆయన ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా ప్రారంభించారు. సీఎంతో పాటు మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. రాయపూడి నుంచి వెంకటపాలెం- పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సీఆర్డీఏ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్లయింది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికి రూ.1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం చంద్రబాబు కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు.

- చివరి మెట్టు వరకు ఇక అన్‌స్టాపబుల్
- రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్
- దేశం మెచ్చిన రాజధానిగా తీర్చిదిద్దుతాం
- 2028కి ప్రధాని చేతులమీదుగా ప్రారంభిస్తాం
- గ్రాఫిక్స్ అన్నవాళ్లు తలలు దించుకోవాలి
- భూములిచ్చిన రైతులందరికీ పాదాభివందనం
- రోడ్లను అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేశారు
- అలాంటి దుర్మార్గులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం
- జాతీయ జెండా ఎగురవేసి స్ఫూర్తి నింపుదాం
- ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీలు జరగాలి
- జాతి నిర్మాణానికి నేను నా సంకల్పం తీసుకోవాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల పరిశీలన



## రాష్ట్రాభివృద్ధిలో మొట్టమొదటి సక్సెస్

రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్ట మొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభజన తర్వాత రాష్ట్రం నష్టపో యింది. రాజధాని కూడా లేకుండా పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో ఉన్న గుంటూరు జిల్లాలో రాజధాని పెట్టాలని ఆనాడు సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చి భూములు ఇచ్చారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి.

సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతి నిధులను కూడా వేధింపులకు గురిచేశారు. ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధానికి 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 2019-24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు.

## ఐదు కాన్సెప్టులతో రాజధాని నిర్మాణం

అమరావతి రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసింది. నగర నిర్మాణంలో ఇది ప్రారంభం మాత్రమే. మూడో దశలో ఇది తాడే పల్లి వద్ద జాతీయ రహదారికి కనెక్ట్ అవుతుంది. అమరావతి రాజధాని పూర్తి కాలుష్య రహిత నగరం గా మారుతుంది.డీప్‌టెక్ క్యాపిటల్‌గా దీనిని తయారు చేస్తున్నాం. ఐదు ముఖ్యమైన అంశాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. నో పోల్స్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం డీప్ టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోంది. ఏఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతుంది. టాప్ 5 నగరాల్లో ఒకటిగా తయారవుతుంది. అమరావతి, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లు రాజధాని పరిధిలోనే ఉంటాయి. 190 కిలోమీటర్ల ఔటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగు రోడ్డు మంజూరు చేసిన కేంద్రానికి ధన్యవాదాలు.

2028నాటికి భారత్‌మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. ఇక అమరావతి అన్ స్టాపబుల్. రాజధానిలో నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించారు. ఈ తరహా వ్యక్తులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం. రాష్ట్రాభివృద్ధి కోసం నిర్ది ష్టమైన లక్ష్యాలను పెట్టుకుంటున్నామని తెలిపారు.

## జాతీయ జెండా ఎగురవేద్దాం

2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. అనునిత్యం మీ సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యం అవుతుంది.మనకు స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందన్న అంశాన్ని అంతా మర్చిపోతున్నాం.జెండా వందనంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేలా ఆలోచనలు చేయటం ముఖ్యం. రైతులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు ఎవరైనా తమ తమ స్థాయిల్లో కృషి చేయాలి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థపైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి.వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలి. అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలని పేర్కొన్నారు. అనంతరం మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణలతో కలిసి రాయ పూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు.





## అత్యంత సుందరంగా

# ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు

- పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి

రాజధానిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కోసం నిర్మించిన గృహ సముదాయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ప్లాట్లలోకి వెళ్లి అందులోని మౌలికవసతులు, సౌకర్యాలను స్వయంగా చూశారు. రాయపూడి వద్ద 12 టవర్లుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదాయాల నిర్మాణాలు జరిగాయి. ఒకొక్కటీ 3500 చదరపు అడుగుల వైశాల్యంతో 288 ప్లాట్లను సీఆర్డీఏ నిర్మించింది.















# పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అధ్యయనం

- విద్యుత్ వినియోగానికి తగ్గట్లుగా ఉత్పత్తి పెంచాలి
- డిస్కామ్‌లపై రుణ భారం తగ్గేలా నిరంతర చర్యలు
- పనితీరు ఆధారంగా రేటింగ్ విధానం తీసుకురావాలి
- ఇంధన శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- డిజిటల్ ట్విన్, అసెట్ హెల్త్ ఇండెక్స్‌పై ప్రశంసలు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతోపాటు,తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చేలా సమగ్ర ప్రణాళికలను తయారుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో విద్యుత్‌శాఖపై సమీక్షించారు. రాష్ట్రంలోని 130 రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేయాలని సూచించారు. పోలవరం వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుపై వచ్చిన ప్రతిపాదన ప్రస్తావనకు వచ్చిన సందర్భంలో ఈ సూచన చేశారు. ఈ మేరకు అధ్యయనం చేయడంతోపాటు ఎకనమిక్ ఫీజిబిలి టీని పరిశీలించాలని తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నందున్న వివిధ రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తి కష్టసాధ్యం కావచ్చనే అంశాన్ని ప్రస్తావిస్తూ విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగం పుంజుకోవడంతోపాటు ప్రతి ఆరేళ్లకూ విద్యుత్ వినియోగం రెట్టింపు అవుతుందని... దానికి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అదే సమయంలో విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు.

### సోలార్ విద్యుత్‌పై మరింత దృష్టి

సౌర విద్యుత్ ఉత్పత్తిని వీలైనంత మేర పెంచాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ కింద 6 లక్షల సోలార్ కనెక్షన్లను సెప్టెంబరు నాటికి ఇన్‌స్టాల్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాన్ సూర్యఘర్ కిందమరో 3లక్షల కనెక్షన్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు మరో 10 లక్షల కనెక్షన్ల కోసం కేంద్రానికి దరఖాస్తు చేయాలని చెప్పారు. ఇక కుసుమ్ పథకం కింద లక్ష్యాన్ని పూర్తిచేస్తూనే అదనంగా 2,000 మెగా వాట్ల సామర్థ్యం కోసం కేంద్రాన్ని కోరాలని సూచించారు. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ వంటి వనరులను సమన్వయం చేసుకుని తక్కువ ధరకు, నిరంతర విద్యుత్ అందించే వ్యవస్థను రూపొందించాలని సూచించారు. దీంతోపాటు విద్యుత్ కొనుగోలు ధరను ఈ ఏడాది యూనిట్‌కు రూ.4.60కు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2029 నాటికి యూనిట్ విద్యుత్ కొనుగోలు ధరను రూ.4కు తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తక్కువ ధర విద్యుత్ కొనుగోలుతో పాటు పవర్ స్వాపింగ్, కుసుమ్, సూర్యఘర్, పునరుత్పాదక విద్యుత్, స్టోరేజ్ వంటి వివిధ మోడళ్లను ఇంటిగ్రేట్ చేయాలని స్పష్టం చేశారు.

### విద్యుత్ సంస్థలకు రేటింగ్... కార్పొరేట్లతో పోటీ

రాష్ట్రంలోని ఆరు విద్యుత్ సంస్థలకు పనితీరు ఆధారంగా రేటింగ్ విధానం తీసుకురావాలని సూచించారు. ప్రతి సంస్థ సమర్థంగా పనిచేసేలా లక్ష్యాలు నిర్దేశించి కార్పొరేట్ సంస్థలకు ధీటుగా విద్యుత్ సంస్థలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. సంస్థల పనితీరు, ఆర్థిక సామర్థ్యం, నిర్వహణ సామర్థ్యాలను నిరంతరం సమీక్షించాలని చెప్పారు. విద్యుత్ కొనుగోళ్లల్లో ఆప్టిమైజేషన్ ద్వారా రూ.234 కోట్లు, ప్రాంప్ట్ పేమెంట్ రిబేట్ కింద రూ.100 కోట్లను ఆదా చేసినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై సీఎం స్పందిస్తూ విద్యుత్‌సంస్థలపై రుణ భారాన్ని తగ్గించాలని సూచించారు. విద్యుత్ సంస్థల రుణాలపై నిరంతర సంప్రదింపులతో వడ్డీరేట్లను వీలైనంత మేర తగ్గించాలని ఆదేశించారు. సంస్థల పనితీరు మెరుగుపడుతున్న విషయాన్ని ఆర్థిక సంస్థల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ మేరకు ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరపాలని పేర్కొన్నారు. ఆస్తుల కల్పన, మూలధన పెట్టుబడుల కోసం మాత్రమే ఇకపై విద్యుత్ సంస్థలు అప్పులు తీసుకోవాలి తప్ప... ఇతర అవసరాలకు అప్పులు చేసే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. టారిఫ్ పెంచకుండా... కొనుగోలు వ్యయం, వడ్డీ భారం, పంపిణీ నష్టాలను తగ్గించడం ద్వారా సంస్థల ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని సూచించారు. విద్యుత్ సంస్థల్లో డిజిటల్ ట్విన్ వ్యవస్థ, అసెట్ హెల్త్ ఇండెక్స్ విధానాలను అమలు చేస్తున్న అధికారులను అభినందించారు. విద్యుత్ వ్యవస్థలోని ఆస్తుల పరిస్థితిని డిజిటల్‌గా పర్యవేక్షించడం, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర పరికరాల కండిషన్‌ను ముందుగానే అంచనా వేసి మరమ్మతులు, మార్పులకు చర్యలు తీసుకోవడం ద్వారా వ్యయాన్ని తగ్గించడంతోపాటు నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి కొత్త సర్వీసులు

## వర్చువల్‌గా ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు

విజయవాడ(చైతన్యరథం): గన్నవరం విమానాశ్రయం నుంచి కొత్త సర్వీసులు ప్రారంభమయ్యాయి. గురువారం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఢిల్లీ నుంచి వర్చువల్‌గా సర్వీసులను ప్రారంభించారు. దీంతో గన్నవరం నుంచి వారణాసి, కోల్‌కతాకు కొత్త సర్వీసులను ప్రముఖ విమానాయ సంస్థ ఇండిగో నడప నుంది. వారంలో 3 రోజులు గన్నవరం నుంచి ఈ సర్వీసులు నడవనున్నాయి. ప్రతి మంగళవారం, గురువారం, శనివారం రోజుల్లో గన్నవరం నుంచి వారణాసి, కోల్‌కతాకు విమానాలు అందుబాటులో ఉంటాయని ఇండిగో సంస్థ వెల్లడించింది.

### విమాన సమయాల వివరాలు:

- ఫ్లైట్ నెంబర్ 6ఈ 6501(వారణాసి-విజయవాడ సర్వీస్): మధ్యాహ్నం 3:55 గంటలకు వారణాసిలో బయలుదేరి సాయం త్రం 5:50 గంటలకు విజయవాడ చేరుకుంటుంది.



- ఫ్లైట్ నెంబర్ 6ఈ 6502(విజయవాడ-వారణాసి సర్వీస్): గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి సాయంత్రం 06:20 గంటలకు బయలుదేరి.. రాత్రి 08:15 గంటలకు వారణాసి చేరుకుంటుంది. అక్కడ నుంచి తిరిగి బయలుదేరి రాత్రి 10:15 గంటలకు కోల్‌కతా చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణం(6ఈ 6501): మధ్యాహ్నం 02:10 గంటలకు కోల్‌కతాలో బయలుదేరి, వారణాసి మీదుగా సాయంత్రం 05:50 గంటలకు గన్నవరం చేరుకుంటుంది.





# ఇంద్రకీలాద్రిపై భద్రతా నిబంధనలు

## ప్రాంగణంలో మొబైల్ ఫోన్లపై నిషేధం

## రద్దీ నియంత్రణకు దర్శన లైన్లలో మార్పులు

విజయవాడ(చైతన్యరథం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులకు కొత్త భద్రతా నిబంధనలను ఆలయ అధికారులు అమలులోకి తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్లపై పూర్తిస్థాయిలో నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. స్కానింగ్ పాయింట్ వద్ద కొత్త భద్రతా గేట్ ఏర్పాటు చేశారు. స్కానింగ్ తర్వాత మొబైల్ ఫోన్ లోపలికి వెళ్లకుండా కఠినంగా తనిఖీలు చేయనున్నారు. ఈ నిబంధనల ప్రకారం, క్యూ లైన్లలోకి వెళ్లే ముందే ఫోన్లను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.మొబైల్ ఫోన్ల కోసం ప్రత్యేక డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. భద్రతా తనిఖీలను కట్టుదిట్టం చేయాలని ఆలయ ఈవో శీనా నాయక్ ఆదేశాలు జారీ చేశారు. హోంగార్డులు, అజైల్ సెక్యూరిటీ సిబ్బందితో పటిష్ఠమైన భద్రతను కల్పించ నున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రద్దీ నియంత్రణకు దర్శన లైన్లలో మార్పులు చేపట్టారు. దర్శన టికెట్ల జారీ కౌంటర్ల స్థానాల్లో మార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఉచిత లడ్డూ ప్రసాదం కౌంటర్లను కూడా అధికారులు మార్చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా నేరుగా దర్శనానికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. కొత్త నిబంధనలకు భక్తులు సహకరించాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.





# అమరావతి అభివృద్ధిలో మరో మైలురాయి

- సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జిలను
- ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తరలివచ్చిన అమరావతి రైతులు, ప్రజలు
- డప్పులతో స్వాగతం పలికిన మహిళలు





అమరావతి(చైతన్యరథం): ప్రజా రాజధాని అమరావతిలో రెండో దశలో నిర్మాణం పూర్తి చేసుకున్న సీడ్ యాక్సెస్ ఇ-3 రోడ్డును ముఖ్యమంత్రి చంద్రబాబు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. దానితోపాటు స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించారు. అనంతరం కాలినడకన స్టీల్ బ్రిడ్జిని పరిశీలించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో రాజధాని అమరావతి మార్గంలో పూర్తిస్థాయిలో వాహన రాకపోకలకు మార్గం సుగమం కానుంది. స్టీల్ బ్రిడ్జిల నిర్మాణంతో రాజధాని నగరానికి మరింత మెరుగైన కనెక్టివిటీ ఏర్పడింది. మూడో దశలో మణిపాల్ వద్ద జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా నిర్మాణం జరగనుంది. అంతకుముందు డప్పులతో సీఎం చంద్రబాబుకు అమరావతి మహిళా రైతులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన బహిరంగసభలో అమరావతి రైతులతో పాటు పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, నాదెండ్ల మనోహర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.













చైతన్యరథం



ఆధునిక భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అమరావతి నగర నిర్మాణ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్న ప్రాంతాన్నిఅమెరికాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ దినపత్రిక "న్యూయార్క్ టైమ్స్" జర్నలిస్టులు ముజీబ్ మాషల్, హరికుమార్ సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన కలల రాజధాని అమరావతిని క్వాంటమ్ వ్యాలీ టెక్ హబ్, వాటర్ వేస్, సైకిల్ వేస్ తో అత్యంత సుందరంగా నిర్మించడానికి 25వేలమంది కార్మికులను వినియోగిస్తున్నారని ఆ కథనంలో పేర్కొన్నారు. న్యూయార్క్ టైమ్స్ స్టోరీ సారాంశం యథాతథంగా చైతన్యరథం పాఠకుల కోసం...



**భారతదేశంలో అత్యంత నివాసయోగ్యమైన నగర నిర్మాణానికి ఒక వ్యక్తి సంకల్పం...**

# ది మ్యాన్ ఆన్ మిషన్!

విశాలమైన నిర్మాణ ప్రదేశంలోని ఒక మూలన ఇంజినీర్లు...కొత్త నగర ప్రాంతం చుట్టూ రక్తనాళాల్లా విస్తరించిన మైళ్లకొద్దీ కాలువల్లోకి నీటిని మళ్లిస్తున్నారు. మరో వైపు, హార్డ్ హ్యాట్లు ధరించిన కార్మికులు త్వరలో భారతదేశంలోనే అతిపెద్ద క్వాంటం కంప్యూటర్‌ను కలిగి ఉండే అత్యాధునిక భవనానికి కాంక్రీట్ పోస్తున్నారు – ఇది "ది క్వాంటం వ్యాలీ" అనే విస్తృత ప్రాజెక్ట్‌లో భాగం. ఇక్కడ, పవిత్రమైన కృష్ణా నది ఒడ్డున గతంలో అరటి తోటలు, కూరగాయల పొలాలు ఉండేవి. భవిష్యత్తులో ఇక్కడ భారతదేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరాన్ని నిర్మించాలనే ఆశయం రూపుదిద్దుకుంటోంది. దక్షిణ భారతదేశంలో 5 కోట్ల జనాభా కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని కొత్త రాజధాని నగరంగా నిర్మించడం అనేది ఒక అతిపెద్ద బాధ్యత. స్వతంత్ర భారతదేశంలో ఇలాంటి పట్టణ ప్రణాళికలో ఇదే భారీ ప్రయత్నం. ఇలాంటి నగర నిర్మాణంపై భారత్ లోని గత రికార్డు పెద్దగా నమ్మకాన్ని కలిగించదు. సరిపడా మౌలిక సదుపాయాలు లేకపోవడం, పెరుగుతున్న కాలుష్యంతో దేశంలోని ప్రధాన నగరాలు, తమ భారీ జనాభా అవసరాలను తీర్చడంలో విఫలమై అప్రతిష్ట పాలయ్యాయి.

## మోడీజీ మద్దతుతో శరవేగంతో అమరావతి నిర్మాణం

ఈ పరిస్థితిని మార్చి, భారతదేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగర నిర్మాణ బాధ్యతను స్వయంగా భుజాన వేసుకున్న వ్యక్తి, 76 ఏళ్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రతి అంశాన్ని సూక్ష్మంగా పరిశీలించే స్వభావం ఉంది. ప్రతిష్టాత్మక పరివర్తనాత్మక స్థాయి ప్రాజెక్టులను పూర్తిచేసిన చరిత్ర కూడా ఆయనకు ఉంది. అయితే ఆయనకు ఎదురుదెబ్బలు కూడా తగిలాయి. దశాబ్దాల క్రితం తాను నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మరో రాష్ట్ర రాజధానిపై నియంత్రణను కోల్పోయారు. న్యాయ పరమైన పోరాటాలను ఎదుర్కొన్నారు. రాజకీయంగా కొంతకాలం అప్రాధాన్య స్థితిలోకి వెళ్లారు. కానీ ఇప్పుడు ఆయనకు భారతదేశ శక్తివంతమైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మద్దతు లభిస్తోంది. 2029లో తన పార్టీ తిరిగి ఎన్నికలను ఎదుర్కొనే సమయానికి ఈ ప్రాజెక్టు తిరుగులేని వాస్తవంగా మార్చడానికి నిర్మాణ పనులకు గడువును నిర్ణయిం చారు. ప్రతిరోజూ 25వేల మందికి పైగా కార్మికులు ఈ ప్రదేశంలో పని చేస్తున్నారు. ప్రఖ్యాత బ్రిటిష్ ఆర్కిటెక్ట్ నార్మన్ ఫోస్టర్ రూపొందించిన డిజైన్ ప్రకారం అమరావతి నగరం నిర్మితమవుతోంది. నగర మంతా గ్రిడ్‌లలో రూపొందించబడింది. ఇందులో దాదాపు ఐదు మైళ్ల పొడవున ప్రభుత్వ భవనాలు ఉంటాయి.


## 2029 నాటికి 8టవర్లతో క్వాంటమ్ వ్యాలీ

నగరం మధ్యలో ఎత్తైన టవర్లతో కూడిన అసెంబ్లీ భవనం ఉంటుంది. దాని చుట్టూ మంచినీటి సరస్సు ఉంటుంది. ఐదు పరిపాలనా కార్యాలయాలు ఎత్తైన టవర్లలో పనిచేస్తాయి. వీటిలో 16,000 మంది ఉద్యోగులు పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో అత్యంత ఎత్తైన భవనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం ఉంటుంది. దాని పైకప్పుపై హెలిప్యాడ్ కూడా ఉంటుంది. కొత్త నగరంలో లి60 శాతం ప్రాంతం నీరు లేదా పచ్చదనంతో నిండి ఉంటుందని అంచనా. దాదాపు 2,000 మైళ్ల సైక్లింగ్ మార్గాలు కూడా ఇందులో ఉండనున్నాయి. నగరంలోని క్వాంటమ్ వ్యాలీలో 50 ఎకరాల క్యాంపస్ కోసం వందల మిలియన్ డాలర్ల పెట్టుబడులు కేటాయించారు. జనవరి నాటికి ఈ క్యాంపస్‌లోని ప్రధాన భవనంలో 156-క్యూబిట్ ×దీవీ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు కానుంది. అత్యల్ప స్థాయి ప్రకంపనలను కూడా తట్టుకునేలా ఈ భవనాన్ని భూకంప రక్షణ టెక్నాలజీతో నిర్మిస్తున్నారు.

2029 చివరి నాటికి 88వేల మంది ఇంజినీర్లకు వసతి కల్పించేలా ఎనిమిది టవర్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు.

*"అమరావతి విషయంలో మా లక్ష్యం కేవలం ఒక గొప్ప రాజధానిని నిర్మించడం మాత్రమే కాదు.. భారత్‌లోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా కొత్త ప్రమాణాలు సృష్టించడం. పచ్చదనం, మెరుగైన మౌలిక వసతులు, సమర్థవంతమైన పాలనతో పాటు ప్రజల రోజువారీ జీవన నాణ్యతకు పెద్దపీట వేసేలా అమరావతిని నిర్మించాలన్నదే మా లక్ష్యం. ప్రపంచస్థాయి నగర జీవనం భారత్‌లో సాధ్యం కాదనే భావనను తొలగించి.. అది మన దేశంలోనే నిర్మించవచ్చని, అమరావతిని దానికి ఒక ఉదాహరణగా నిలపాలని కోరుకుంటున్నాం. ఈ విజన్‌ను ది న్యూయార్క్ టైమ్స్ ప్రస్తావించడం సంతోషంగా ఉంది. లక్ష్యం పెద్దదే.. కానీ సాధించగలిగేదే. అమరావతి దేశానికే ఒక ఆదర్శ నగరంగా నిలవాలి."*

*– నారా చంద్రబాబునాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి.*



## అమరావతి నగర నిర్మాణంలో ఎన్నో సవాళ్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్మాణ ప్రదేశానికి సమీపంలోనే నివసిస్తున్నారు. ఆయన తన నివాసం నుంచి బయటకు వచ్చి తాత్కాలిక ప్రభుత్వ కార్యాలయాల వైపు తిరిగి వెళ్లేటప్పుడు, భూగర్భంలో అమర్చడానికి సిద్ధంగా ఉన్న మురుగునీటి పైపుల కుప్పలు, మట్టి దిబ్బలు, చెల్లాచెదురుగా ఉన్న యంత్రాలు కనిపించాయి. రోడ్డు డివైడర్లలో కొత్తగా నాటిన బోగన్‌విల్లియా మొక్కలు పుష్పించాయి. అవి ఆయన నగర నిర్మాణ కలలకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. అయితే సవాళ్లు అనేకం ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం ఎన్నికల్లో ఓటు వేయడానికి కార్మికులు తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లడంతో కార్మికుల లభ్యత ఏకంగా 15 శాతం వరకు తగ్గింది. మరోవైపు మధ్యప్రాచ్యంలో యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరిగాయి. అంతేకాక, చంద్రబాబు నాయుడు లక్ష్యాలను భారతదేశంలోని సాధారణ వాస్తవాలు ఆయనను పరీక్షించనున్నాయి. కొత్తగా నిర్మించిన మౌలిక వసతుల్లో వైఫల్యాలు, వంతెనలు కూలిపోవడం నుంచి విమానాశ్రయాలు నీట మునగడం వరకు చోటుచేసుకునే అనేక ఘటనలు ఇందుకు ఉదాహరణలుగా చెప్పొచ్చు.

## సింగపూర్ నమూనాతో రూపకల్పన

కొత్త నగరం కోసం ప్రభుత్వం లి30,000 మంది రైతుల నుంచి 35,000 ఎకరాల భూమిని సమీకరించడం ప్రారంభించింది. ప్రాచీన ఆంధ్ర రాజ్యం రెండో శతాబ్దంలో ఉన్న రాజధాని పేరును అనుసరించి ఈ నగరానికి అమరావతి అని పేరు పెట్టారు. ఒక నిపుణుల కమిటీ కేంద్రీకృత రాజధాని నిర్మాణానికి బదులుగా ప్రభుత్వాన్ని వికేంద్రీకరించాలని సూచించినప్పటికీ చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును కొనసాగించాలనే నిర్ణయంతో ముందుకు సాగారు. విమర్శకులు ఆయనపై ఇది వ్యక్తిగత ప్రతిష్ట కోసం చేపట్టిన ప్రాజెక్టు అని, విలువైన సారవంతమైన భూమిని వృథా చేస్తున్నారని ఆరోపించారు. దక్షిణాసియాలోని అనేక మంది నాయకుల మాదిరిగానే చంద్రబాబు నాయుడు కూడా సమర్థత, ఉత్పాదకతకు ప్రతీకగా భావించే లిసింగపూర్ నగర-నమూనాలిను ఎంతో మెచ్చుకుంటారు. అందుకే నగర మాస్టర్ ప్లాన్ కోసం ఆయన సింగపూర్ ప్రభుత్వ సహాయాన్ని కోరారు. కొంతమంది రైతుల నుంచి వ్యతిరేకత ఎదురైనప్పుడు, అభివృద్ధి చేసిన భూమిలో వారికి చిన్నదైనా ఎక్కువ విలువ కలిగిన ప్లాట్లు అందే వరకు స్వల్ప వార్షిక చెల్లింపులు చేసే విధానాన్ని ఆయన ప్రవేశపెట్టారు. తమ అరటి తోటల్లో నిలబడి భవిష్యత్తు నగరాన్ని ఊహించలేకపోతున్న రైతులు ఆ దృశ్యాన్ని అర్థం చేసుకునేలా, వారిలో చిన్న చిన్న బృందాలను సింగపూర్‌కు పంపించారు.

## పడిన చోటే మళ్లీ కెరటంలా పైపైకి

2019 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఓడిపోయారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో 2023లో రాష్ట్ర అధికారులు చంద్రబాబు నాయుడిని అవినీతి ఆరోపణలపై కొన్ని వారాల పాటు జైలుకు పంపారు. ఆయన తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కేసులపై ఆరోపణలు ఉపసంహరించ బడ్డాయి. ఆయన అధికారానికి దూరంగా ఉన్న ఐదేళ్లలో అమరావతి పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత వచ్చిన పాలకుడు రాజధాని కోసం ప్రత్యామ్నాయ ఆలోచనలను ప్రతిపాదించారు. అయితే రెండేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు తిరిగి అధికారంలోకి వచ్చారు. ఆయన మోదీతో మళ్లీ సఖ్యత ఏర్పరచుకున్నారు. ప్రధానమంత్రి నేతృత్వంలోని జాతీయ కూటమిలో కీలక భాగస్వామిగా మారడంతో ఆయనకు గణనీయమైన రాజకీయ ప్రాధాన్యత లభించింది. మోదీ సహకారంతో అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా ప్రకటించే చట్టాన్ని ఆమోదించడంలో ఆయన విజయం సాధించారు. అలాగే న్యూఢిల్లీతో ఉన్న సత్సంబంధాలను ఉపయోగించుకుని కొత్త నగరంలోని ప్రధాన నిర్మాణాలకు అవసరమైన బిలియన్ల డాలర్ల రుణాలను సమీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన మంత్రం ఒక్కటే..."వేగం, వేగం, వేగం."

## ఒక నమ్మకంతో కూడిన ముందడుగు

క్వాంటమ్ వ్యాలీ ద్వారా చంద్రబాబు నాయుడు తన కొత్త రాజధానికి ఆర్థిక శక్తిని, సాంకేతిక గుర్తింపును తీసుకురావాలని చూస్తున్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌కు సాఫ్ట్‌వేర్ రంగం ఇచ్చిన గుర్తింపులాగే, క్వాంటమ్ టెక్నాలజీ అమరావతికి కొత్త ఆర్థిక ఇంజిన్‌గా మారాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. 2024 చివర్లో, అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే, దక్షిణ భారతదేశంలోని ప్రముఖ సాంకేతిక విద్యాసంస్థ ××ు మద్రాసుకు చెందిన శాస్త్రవేత్తల బృందాన్ని ఆయన తన నివాసానికి ఆహ్వానించారు. ఆ సంస్థ డైరెక్టర్ వి. కామకోటి, భవిష్యత్తులో సాంకేతిక ప్రపంచాన్ని శాసించే రంగంగా తాను భావిస్తున్న క్వాంటమ్ కంప్యూటింగ్ గురించి చంద్రబాబు నాయుడికి వివరించారు. సాంప్రదాయ కంప్యూటింగ్ భవిష్యత్తులో ఆర్థిక, వ్యవసాయ, ఔషధ రంగాల అవసరాలను తీర్చలేకపోవచ్చని ఆయన వివరించారు. మార్కెట్ పరంగా దాని ప్రయోజనాలు కనిపించడానికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చని కామకోటి చెప్పారు. అయితే ప్రపంచంలోని ప్రధాన దేశాలు, అతిపెద్ద టెక్ కంపెనీలు ఇప్పటికే ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు. చంద్రబాబు నాయుడు ఆ ఆలోచనకు ఆకర్షితులయ్యారు. "ఆయన ఒక నమ్మకంతో కూడిన ముందడుగు వేస్తున్నారు,"లి అని కామకోటి అన్నారు.

## అమరావతి చుట్టూ క్వాంటమ్ ఎకోసిస్టం

తన కొత్త రాజధానిని క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన సమగ్ర ఎకోసిస్టమ్‌గా తీర్చిదిద్దాలని చంద్రబాబు నాయుడు కోరుకుంటున్నారు. ఇందుకోసం క్వాంటమ్ రంగంలో నిపుణులను తయారు చేసేలా విద్యాసంస్థలను తీసుకురావడంతో పాటు, ప్రతిభావంతులైన మానవ వనరులను తయారు చేసే వ్యవస్థను నిర్మించాలని భావిస్తున్నారు. హైదరాబాద్ నుంచి నేర్చుకున్న ఒక ముఖ్యమైన పాఠాన్ని ఆయన అమరావతిలో అమలు చేయాలని చూస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రావీణ్యం సాధించడం మాత్రమే సరిపోదు; భారత్ హార్డ్‌వేర్ రంగంలోనూ ఆవిష్కరణలు చేయాలి, సరఫరా వ్యవస్థలను కూడా నిర్మించాలి. గత సంవత్సరం చేతిలో క్లిక్కర్ పట్టుకుని చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు వివరిస్తూ ఒక ప్రసంగం చేశారు. "క్వాంటమ్ టెక్నాలజీ భారత్‌కు భవిష్యత్తులో ఇతరులను అనుసరించడం కాకుండా, ఇప్పుడే ముందడుగు వేసే అరుదైన అవకాశాన్ని అందిస్తోంది. మీరంతా రేపటి గురించి ఆలోచిస్తున్నారు. నేను వచ్చే 20 ఏళ్ల గురించి ఆలోచిస్తున్నాను" అని చంద్రబాబు చెప్పిన మాటలు ఆయన దార్శనికతకు అద్దం పడుతున్నాయి.

## ఆనాటి పరిస్థితులు కన్నీళ్లు తెప్పించాయి: లోకేష్

మా పర్యటన సమయంలో చంద్రబాబు నాయుడు ఇంటర్వ్యూకు అందుబాటులో లేరు. అయితే ఆయన కుమారుడు, ప్రస్తుత ప్రభుత్వంలో పలు కీలక శాఖలకు నాయకత్వం వహిస్తున్న నారా లోకేశ్, రాష్ట్ర విభజన సమయాన్ని తీవ్ర నిరాశతో కూడిన సమయంగా అభివర్ణించారు. "ఒక రోజు ఉదయాన్నే ఉన్న ఫళంగా బయటికి వెళ్లండి, ఇక ఇది మీది కాదు అని సమైక్య రాష్ట్రం నుంచి మమ్మల్ని బయటకు పంపేశారు" అని అన్నారు. 2014లో కుటుంబంతో హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుండి బయలుదేరి, కొత్త రాజధాని పనులు ప్రారంభమయ్యే ప్రాంతమైన విజయవాడ విమానాశ్రయంలో దిగాము. "అది కేవలం ఒక టిన్ షెడ్ మాత్రమే. నాకు కళ్ళలో నీళ్లు వచ్చాయి" అని



విమానాశ్రయం గురించి లోకేష్ చెప్పారు. "అది బాధ కలిగించింది, కానీ అదే మాలో ఒక పట్టుదల, కసిని నింపింది. మేము వారిని అధిగమిస్తాం అనే సంకల్పాన్ని ఇచ్చింది" అని అన్నారు.

# గుమ్మడికి సంగీత నాటక అకాడమీ అవార్డ్

## రాష్ట్రపతి చేతులమీదుగా ప్రదానం - ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం



అమరావతి(చైతన్యరథం): ప్రముఖ థియేటర్ ఆర్టిస్ట్ గుమ్మడి గోపాలకృష్ణకు ప్రతిష్ఠాత్మక సంగీత నాటక అకాడమీ అవార్డు లభించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. 2024 సంవత్సరానికి థియేటర్ నటనా విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఆయన అవార్డు అందుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆయనను అభినందిస్తూ తెలుగు నాటక రంగానికి చేసిన సేవలను ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు పోస్టు పెట్టారు. 'భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా 2024 సంవ త్సరానికి థియేటర్ నటనా విభాగంలో ప్రతిష్ఠాత్మక సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్న గుమ్మడి గోపాలకృష్ణకు హృదయ పూర్వక అభినందనలు. నాలుగు దశాబ్దాలుగా తెలుగు నాటక రంగానికి, ముఖ్యంగా పద్య నాటక సంప్రదాయానికి మీరు అందిస్తున్న విశిష్ట సేవలకు ఈ జాతీయ పురస్కారం సముచిత గుర్తింపు. ఎన్నో పౌరాణిక పాత్రలను మీ నటనా కౌశలంతో ఆవిష్కరించారు. తెలుగు నాటక వైభవాన్ని దేశ, విదేశాల్లో చాటిన మీకు ఈ సందర్భంగా శుభాభినందనలు' అంటూ పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబుతో ఐఐటీ కాన్పూర్ ప్రతినిధుల సమావేశం



అమరావతి(చైతన్యరథం): ఫ్యామిలీ ఎంపవర్‌మెంట్ మిషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఐఐటీ కాన్పూర్ ప్రతినిధులు సమావేశమయ్యారు. అర్హులకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేరటంతో పాటు పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఆర్టీజీ ఎస్‌తో కలిసి సమగ్రమైన సిటిజన్ డేటా బేస్‌ను రూపొందించే అంశంపై చర్చించారు.

### ఎన్టీఆర్ మూడక్షరాల పేరు కాదు..

# తెలుగుజాతి ఆత్మ గౌరవ ప్రతీక

పేదల గతిని మార్చిన మహనీయుడు ◆ దామచర్ల చేసిన సేవలు చిరస్మరణీయం

◆ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



కొండపి(చైతన్యరథం): ఎన్టీఆర్ అనేది మూడక్షరాల పేరు కాదు అది తెలుగుజాతి ఆత్మ గౌరవ ప్రతీక అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి కొనియాడారు. గురువారం జరుగుమల్లి మండలం దావగూడూరులో ఎన్టీఆర్, మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగవైభవంగా జరిగింది. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి మంత్రి స్వామి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల ఆవిష్కరణ అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ తెలుగు జాతి శక్తిని దశ దిశలా చాటి చెప్పిన మహనీయులు ఎన్టీఆర్. విప్లవాత్మకమైన సంక్షేమ, అభివృద్ధి పథకాలు తీసుకొచ్చి పేదల గతిని మార్చారు.. పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, పక్కా ఇళ్లు, జనతా వస్త్రాలు, ఆస్తిలో మహిళలకు సమాన వాటా వంటి విప్లవాత్మక నిర్ణయాలతో ఎన్టీఆర్‌పాలనలో తనదైన ముద్ర వేశారు. ఎన్టీఆర్ సినీ రంగంలో ఉన్నా, రాజకీయ రంగంలో ఉన్న ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డారని కొనియాడారు.దామచర్ల ఆంజనేయులు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కొండపి నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని సులభతరం చేశారు. ఈ ప్రాంతంలో దశాబ్దాల తరబడి ఉన్న సమస్యలకు దామచర్ల ఆంజనేయులు పరిష్కారం చూపించారు. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో పెద్దాయనగా దామచర్ల ఆంజనేయులు చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రశంసించారు.

# గ్రూప్ 1 ఉద్యోగాలు అమ్ముకున్న జగన్‌రెడ్డి

- ◆ సిట్ నివేదికతో వెలుగుచూసిన అక్రమాలు
- ◆ తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- ◆ గత ప్రభుత్వంలో దేశంలోనే అతిపెద్ద కుంభకోణం
- ◆ ఓఎంఆర్ షీట్లను మార్చేశారు..
- ◆ కోట్ల రూపాయలు చేతులు మారాయి
- ◆ తాడేపల్లి ప్యాలెస్‌కూ సూట్ కేసులు వెళ్లాయి
- ◆ అప్పటి సలహాదారు సజ్జల పాత్ర ఉంది
- ◆ ప్రైవేట్‌వ్యక్తులతో మూడుసార్లు వాల్యుయేషన్
- ◆ అర్హత లేని అభ్యర్థులకు అధిక మార్కులు
- ◆ అర్హులైన వారికి అన్యాయం చేశారు
- ◆ అప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్‌నూ పక్కనపెట్టారు
- ◆ గ్రూప్1లో అవినీతిపై ఎక్కడైనా చర్చకు సిద్ధం
- ◆ శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు

తిరుపతి(చైతన్యరథం): గ్రూప్ 1 ఉద్యోగాలు అమ్ముకున్న జగ న్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని శాప్‌చైర్మన్ అనిమి ని రవినాయుడు డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీలో దేశ చరిత్రలోనే అతిపెద్ద గ్రూప్-1 కుంభకోణం జరిగిందన్నారు. ఈ వ్యవహారం లో భారీస్థాయిలో అవినీతి చోటుచేసుకుందని, ప్రత్యేక దర్యాప్తు బృందం హైకోర్టుకు ఇచ్చిన సమగ్ర నివేదికలో వెల్లడైందని తెలిపా రు. గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు ఉద్దేశపూర్వ కంగా దుష్ప్రచారం ప్రారంభించారని విమర్శించారు. సిట్ దర్యా ప్తు ప్రకారం అప్పటి సీఎం జగన్ ఆదేశాల మేరకే గ్రూప్-1 సమాధాన పత్రాల డిజిటల్ మూల్యాంకనంలో జోక్యం జరిగిందని పేర్కొన్నారు. అర్హత లేని అభ్యర్థులకు అధిక మార్కులు కేటాయిం చి, అర్హులైన పలువురిని అన్యాయంగా పక్కన బెట్టారని ఆరోపిం చారు. ఈ మొత్తం వ్యవహారంలో ఏపీపీఎస్సీ చైర్మన్‌ను పూర్తిగా పక్కనపెట్టి, ఆయన అధికారాలను నిర్వీర్యం చేశారని తెలిపారు. చైర్మన్ సూచనలను కూడా పట్టించుకోకుండా తాడేపల్లి నుంచే అన్ని ఆదేశాలు జారీ అయ్యాయని సిట్ నిర్ధారించిందని చెప్పారు.

### జవాబు పత్రాల మూల్యాంకనంలో ప్రైవేటు వ్యక్తులు




మూల్యాంకనం జరుగుతున్న సమయంలో సీసీ కెమెరాలను తొలగించి ప్రభుత్వ భద్రతా సిబ్బంది స్థానంలో ప్రైవేట్ సెక్యూరి టీని నియమించారని ఆరోపించారు. అంతేకాకుండా మూల్యాంకన ప్రక్రియలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల బదులుగా తాపీ మేస్త్రీలు, కాంట్రాక్ట్ కార్మికులు, ఎలక్ట్రీషియన్లు, గృహిణుల ను వినియోగించారని పేర్కొన్నారు. ఒక ఎలక్ట్రీషియన్ ఒక్కరే సుమా రు 300 పేపర్లను మూల్యాంకనం చేసి రూ.10 లక్షలు తీసుకు న్నాడని ఆరోపించారు. ఓఎంఆర్ షీట్ల మార్పిడిలో కూడా అప్పటి ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల పాత్ర ఉందని ఆరోపిస్తూ.. మొత్తం 48,442 డూప్లికేట్ ఓఎంఆర్ షీట్లు మార్చబడినట్లు తెలిపారు. ఈ గ్రూప్-1 నియామకాల వ్యవహారంలో కోట్ల రూపాయలు చేతులు మారాయని, ఇంటర్మీడియట్‌లో మూడుసార్లు విఫలమైన వ్యక్తి కూడా ఆర్డీవోగా ఎంపికయ్యాడని ఆరోపించారు.

ఈ కుంభకోణానికి సంబంధించిన సూట్‌కేసులు తాడేపల్లికి వెళ్లా యన్నది వాస్తవమని పేర్కొంటూ, ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద గ్రూప్-1 నియామక అవినీతి కుంభకోణమని తెలిపారు. వైసీపీ హయాంలో గ్రూప్-1లో జరిగిన అవినీతిపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసినట్లుగా ఈ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ జగన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయా లని డిమాండ్ చేశారు. లక్షన్నర మంది నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడిన వ్యక్తి అని ధ్వజమెత్తారు. డీఎస్సీ నియామకాలపై కపట రాజకీయాలు చేసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పు డు గ్రూప్-1 కుంభకోణంపై కూడా నోరు విప్పి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



# అర్హులకు అన్యాయం..

# అక్రమాల మాయాజాలం!

- గత ప్రభుత్వంలో గ్రూప్1లో అతిపెద్ద కుంభకోణం
- సిట్ రిపోర్ట్‌లో వెల్లడైన విస్తుపోయే అంశాలు
- మూడు దఫాలుగా జవాబు పత్రాల మూల్యాంకనం
- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఆన్సర్ స్క్రిప్టులు
- మార్కుల మార్పులపై ఫోరెన్సిక్ ఆధారాలు
- ఉద్యోగాలను అంగడి సరుకుల్లా అమ్మేసిన గొడ్డలిపార్టీ
- లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం




అమరావతి(చైతన్యరథం): వైసీపీ హయాంలో జరిగిన గ్రూప్ 1 పరీక్షల్లో తీవ్రమైన అక్రమాలు జరిగాయని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేలింది. ఈ మేరకు సిట్ అధికారులు హైకోర్టుకు తుది నివేదిక సమర్పించారు. సీఐడీ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం 173 మంది సాక్ష్యులను విచారించి ఫోరెన్సిక్ డేటా ఎనాలసిస్‌తో గ్రూప్ 1 పరీక్షల్లో జరి గిన అక్రమాల గుట్టు బయటపెట్టింది. సిట్ నివేదిక ప్రకారం ఒకే జవాబు పత్రాలకు మూడు సార్లు వాల్యుయేషన్ నిర్వహించారు. ఇది ఏపీపీఎస్సీ నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. మొదట డిజిటల్ పద్ధతిలో వాల్యుయేషన్ నిర్వహించి తర్వాత భౌతిక విధానంలో హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం చేశారు. ఓఎంఆర్ షీట్లు, ఆన్సర్ పేపర్ల వాల్యుయేషన్‌కి అర్హులైన నిపుణులు ఉన్నా వారిని పక్కన పెట్టి.. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో మూల్యాంకనం నిర్వహించారు. మూడోసారి మూల్యాంకనం కోసం కొత్త ఓఎంఆర్ షీట్లను ముద్రించడంలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని సిట్ అధికారులు నిర్ధారించారు. వైసీపీ తమ ఐదేళ్ల పాలనలో అత్యున్నత రాజ్యాంగ సంస్థ ఏపీపీఎస్సీని అడ్డాగా చేసుకుని గ్రూప్-1 ఉద్యోగాలను సంతలో పశువుల్లా ఎలా అమ్మేశారో దీనిని బట్టి తెలుస్తోంది.

**సిట్ నివేదికలో వెల్లడైన అంశాలు**

సిట్ నివేదికలో వెల్లడైన అంశాల ప్రకారం మొత్తం 736 ఎగ్జిబిట్లను 7 కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలు పరిశీలించగా ..173 మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసినట్లు నివేదిక తెలిపింది. నివేదికలోని ప్రధాన నిర్ధారణలు సీఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టులు, అనుబంధ పత్రాలు, ప్రమాణ పూర్వక వాంగ్మూలాలపై ఆధారపడి ఉన్నాయని సిట్ పేర్కొంది.

**డిజిటల్ మూల్యాంకనంలోనే మొదటి ప్రశ్నలు**

2020-21లో డిజిటల్ మూల్యాంకనం చేపట్టిన ప్రక్రియలో అప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్ అనుమతి పొందలేదని సిట్ పేర్కొంది. నిబంధనల ప్రకారం ఎగ్జామినర్ల నియామకం చైర్మన్ పరిధిలో ఉండగా ఆమోదం లేకుండా తీసుకున్న చర్యల చట్టబద్ధతపై నివే దిక ప్రశ్నలు లేవనెత్తింది. అంతేకాదు ట్రూ గ్రాడర్ ఎడ్యూ సర్వీసెస్ సంస్థను టెండర్ లేకుండా నామినేషన్ పద్ధతిలో నియ మించినట్లు, ఫలితాలు వెలువడిన రోజు సంస్థకు రూ.1.38 కోట్లకు పైగా చెల్లింపు జరిగినట్లు నివేదిక పేర్కొంది. ఎగ్జామినర్ల ఎంపిక కూడా ప్రైవేట్ స్థాయిలో జరిగిందని, అధికారిక ప్రక్రియ కు భిన్నంగా ప్యానెల్ రూపొందించబడిందని సిట్ తెలిపింది. మరో కీలక అంశం ఏమిటంటే.. మూల్యాంకన ప్రక్రియ వ్యక్తిగత ఈ-మెయిల్లు, గూగుల్ డ్రైవ్ లింకుల ద్వారా నడిచిందని, సమర్పించిన మార్కులు..తుది ఫలితాల డేటాబేస్‌లో కనిపించిన మార్కుల మధ్య తేడాలు ఉన్నట్లు ఫోరెన్సిక్ పరిశీలనలో గుర్తిం చారని నివేదిక చెబుతోంది. రెండో మూల్యాంకనం తప్పనిసరిగా జరగాల్సి ఉండగా, అనేక సందర్భాల్లో రెండో ఎగ్జామినర్ లేకుం డానే రెండో మూల్యాంకన మార్కులు నమోదు చేసినట్లు పేర్కొంది.

**హాయ్‌ల్యాండ్‌లో 84 రోజులు..**

**ప్రైవేట్ ఏజెన్సీ కస్టడీలో గ్రూప్-1 ఆన్సర్ స్క్రిప్టులు**

రిపోర్ట్‌లో అత్యంత తీవ్రంగా ప్రస్తావించిన అంశం హాయ్‌ల్యాండ్ (అవాసా) రిసార్ట్‌లో జరిగిన పర్‌పోర్టెడ్ మాన్యువల్ వాల్యుయేషన్. 2021 డిసెంబర్ నుంచి 2022 ఫిబ్రవరి వరకు దాదాపు 84 రోజుల పాటు గ్రూప్-1 మెయిన్స్ ఆన్సర్ స్క్రిప్టులు ఏపీపీఎస్సీ స్ట్రాంగ్ రూం నుంచి ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించి హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో ఉంచారని నివేదిక పేర్కొంది. ఏపీపీఎస్సీ చరిత్రలో ఇదే తొలిసారి ఆన్సర్ స్క్రిప్టులను ప్రైవేట్ సంస్థ ఆధీనంలోని ప్రదేశంలో ఉంచిన సందర్భమని తెలిపింది. చైర్మన్ అనుమతి పొందలేదని, స్క్రిప్టులను అక్కడికి ఎందుకు తరలిం చారనే కారణం రికార్డుల్లో కనిపించలేదని కూడా పేర్కొంది.

**నిపుణులను పక్కన పెట్టి మరీ..**

ఇక్కడ మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. విశ్వ విద్యాలయాల నుంచి సేకరించిన 452 మంది నిపుణుల జాబితా ను పక్కనపెట్టి, 66 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను వినియో గించినట్లు సిట్ పేర్కొంది. వీరిలో ఎలక్ట్రీషియన్లు, ప్రైవేట్ టీచర్లు, సెక్యూరిటీ గార్డులు, క్లర్కులు, గృహిణులు తదితర వృత్తుల్లో ఉన్న వారు కూడా ఉన్నారని నివేదిక పేర్కొంది. సిట్ నివేదిక ప్రకారం మునుపటి డిజిటల్ మూల్యాంకనం మార్కుల జాబితాను ఎక్సెల్ లో అందించి డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆ మార్కులను ఓఎంఆర్ స్లిప్పులపై బబుల్ చేయడంతో పాటు ఎగ్జామినర్-1, ఎగ్జామినర్-2, స్క్రూటినైజర్, క్యాంప్ ఆఫీసర్ పేర్ల స్థానాల్లో సంతకాలు చేసి నట్లు ఆరోపణలను నివేదిక నమోదు చేసింది. దీనిని ఫోర్జరీ, ఇంపర్సనేషన్ కోణంలో పరిశీలించినట్లు పేర్కొంది.

**169 ఓఎంఆర్ స్లిప్పులపై వైట్ కరెక్షన్ ఫ్లూయిడ్**

హాయలాండ్ మూల్యాంకనానికి సంబంధించిన 736 ఎగ్జిబిట్లలో 169 ఓఎంఆర్ వాల్యుయేషన్ స్లిప్పులపై వైట్ కరెక్షన్ ఫ్లూయిడ్

సిట్ గుర్తించింది. ఏపీపీఎస్సీ ఎగ్జామినర్ల సూచనల ప్రకారం దాని ని ఉపయోగించడం నిషేధం. కొన్ని స్లిప్పులపై ఫోరెన్సిక్ పరీక్షలు అనధికార వ్యక్తుల భాగస్వామ్యానికి సంకేతాలు ఇచ్చాయని నివేది క పేర్కొంది.

**హైకోర్టుకు వాస్తవాలు పూర్తిగా వెల్లడించలేదు**

మరో తీవ్ర అంశంగా హాయ్‌ల్యాండ్‌లో జరిగిన మూల్యాంకనంపై కోర్టుకు సమర్పించిన కౌంటర్ అఫిడవిట్లలో పూర్తి వివరాలు వెల్ల డించలేదని సిట్ పేర్కొంది. 2022, 2023లో సమర్పించిన వివరణలు, 2021 డిసెంబర్ 3న జారీ చేసిన వర్క్ ఆర్డర్ మధ్య విరుద్ధత ఉందని నివేదిక అభిప్రాయపడింది. ఇదే అంశంపై కోర్టు నియమించిన ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీ కూడా హాయ లాండ్‌లో వాల్యుయేషన్ జరిగినట్లు చూపే ఓఎంఆర్ స్లిప్పులు ఉన్నాయని గుర్తించింది. ఈ నిర్ధారణ సిట్, సీఎఫ్‌ఎస్‌ఎల్ నుంచి స్వతంత్రంగా వచ్చిందని రిపోర్ట్‌లో ఉంది.

**విజయవాడలో మూడోసారి మూల్యాంకనం..**

**మార్కుల మార్పులపై ఫోరెన్సిక్ ఆధారాలు**

హాయలాండ్ తర్వాత 2022 మార్చి-మే మధ్య విజయవాడలో మరోసారి మాన్యువల్ మూల్యాంకనం జరిగింది. ఈ మూడో మూల్యాంకనం ఎందుకు అవసరమైందన్న దానిపై ఏపీపీఎస్సీ ఫైళ్ల లో సమగ్ర కారణాలు లేవని గుర్తించింది. హాయలాండ్ ప్రక్రియలో వాడిన ఓఎంఆర్/టీ అయిపోవడంతో 48,442 డూప్లికేట్ బార్‌కోడ్ ఓఎంఆర్ స్లిప్పులు ముద్రించినట్లు గుర్తించింది. ఫోరెన్సిక్ పరిశీలనలో ఎంపికైన 165 మంది అభ్యర్థుల ఓఎంఆర్ స్లిప్‌లలో 160 అంటే 96.97 శాతం స్లిప్‌లపై మార్పులు ఉన్నట్లు రిపోర్ట్ పేర్కొంది. 161 మంది అన్‌సెలెక్టెడ్ అభ్యర్థుల గ్రూప్‌లో 153 స్లిప్‌లపై, 408 పిటిషనర్ల గ్రూప్‌లో 405 స్లిప్‌లపై ఆల్టరేషన్స్ నమోదయ్యాయి. అయితే ప్రతి మార్పు నూ మోసంగా పరిగణించలేమని నివేదిక మరోచోట స్పష్టం చేసింది. కొన్ని మార్పులు నిజమైన టోటల్ కాలుక్యులేషన్ ఎర్రర్స్ గా ధృవీకరించబడ్డాయని పేర్కొంది. ఇది రిపోర్ట్‌లోని ముఖ్యమైన బ్యాలెన్సింగ్ ఫైండింగ్.

**చీఫ్ ఎగ్జామినర్ల అనధికార మార్పులపై కీలక నిర్ధారణలు**

ఏపీపీఎస్సీ సూచనల ప్రకారం ఎగ్జామినర్ భాగంలో మార్కుల సవరణను సంబంధిత ఎగ్జామినర్ మాత్రమే చేసి ఇనీషియల్స్ వేయాలి. చీఫ్ ఎగ్జామినర్‌కు అలా మార్కులు మార్చే అధికారం లేదని ఏపీపీఎస్సీ స్వయంగా తెలిపినట్లు సిట్ పేర్కొంది. ఈ క్రమంలో కొంతమంది చీఫ్ ఎగ్జామినర్స్ చేతిరాతపై సీఎఫ్‌ఎస్‌ఎల్ పరీక్షలు నిర్వహించగా, ఎగ్జామినర్ పేరుతో ఉండాల్సిన ఇనీషియల్స్/రైటింగ్స్ తాము రాసినవేనని ఫోరెన్సిక్‌గా నిర్ధారణ అయిన సందర్భాలు రిపోర్ట్‌లో ఉన్నాయి. ఒక చీఫ్ ఎగ్జామినర్ 103 మార్కుల గ్రాండ్ టూటల్‌ను 69కు తగ్గించిన విషయం కూడా నివేదికలో నమోదు అయింది. ఇంకొన్ని ఓఎంఆర్ స్లిప్‌లపై ఎగ్జామినర్ లేదా చీఫ్ ఎగ్జామినర్‌కు చెందని సంతకాలు ఉన్నాయని సిట్ రిపోర్టులో నమోదు చేసింది. కనీసం ఆరు సంతకాల రచయితలను అధికారిక వ్యక్తులతో అనుసంధానించ లేకపోయామని, వారి ఆదర్‌షిప్‌పై మరిన్ని సీఎఫ్‌ఎస్‌ఎల్ నివేదికలు రావాల్సి ఉందని పేర్కొంది.

**సీసీటీవీ, స్ట్రాంగ్‌రూమ్ భద్రతలోనూ తీవ్రమైన లోపాలు**

ఏపీపీఎస్సీ శాశ్వత సీసీటీవీ వ్యవస్థ లేకపోవడం, స్ట్రాంగ్‌రూంపై పూర్తి నిఘా లేకపోవడం వంటి అంశాలను కూడా సిట్ ప్రస్తావించింది. స్ట్రాంగ్ రూంపై సీసీటీవీ మూల్యాంకనం ప్రారం భమైన 17 రోజుల తర్వాత మాత్రమే ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. కొన్ని రోజుల ఫుటేజ్, యాక్సెస్ రిజిస్టర్స్ మధ్య వ్యత్యాసాలు కూడా గుర్తించబడ్డాయి. రిజిస్టర్‌లో ఒకే ఎంట్రీ ఉన్నప్పటికీ సీసీటీవీలో పలుమార్లు స్ట్రాంగ్‌రూం తెరవడం, మూయడం కనిపించిన సందర్భాలను గుర్తించినట్లు పేర్కొంది. బయో మెట్రిక్ అథంటికేషన్, ఎలక్ట్రానిక్ యాక్సెస్ కంట్రోల్, యాక్సెస్ కార్డ్స్ వంటి భద్రతా వ్యవస్థలు కూడా లేవని నివేదిక పేర్కొంది.

**మూడుసార్లు మూల్యాంకనం.. నిబంధనలపై ప్రశ్నలు**

ఏపీపీఎస్సీ రూల్స్ ఆఫ్ ప్రొసిడ్యూర్ ఆన్సర్ షీట్స్ రీవాల్యుయేషన్ సాధారణంగా అనుమతించరాదని నిబంధన ఉన్నప్పటికీ ఇదే ఆన్సర్ స్క్రిప్టులకు మూడు దఫాల మూల్యాంకనం జరిగిందని పేర్కొంది. నివేదిక ప్రకారం ఏపీ హైకోర్టు 2024 మార్చి 13న రెండో, మూడో మూల్యాంకనాలను illegal, irregular, arbitraryగా పేర్కొంటూ తాజా మెయిన్ ఎగ్జామ్స్‌కు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఆ తీర్పుపై 2024 మార్చి 31 నుంచి ఇంటిరిం స్టే అమల్లో ఉందని కూడా రిపోర్ట్ స్పష్టం చేసింది.

**స్కామ్ మూలాలు**

ఏపీపీఎస్సీ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అక్రమాలకు ముందే పెద్ద ప్లాన్ సిద్ధమైంది. అప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్‌ను పూర్తిగా పక్కనపెట్టి జగన్ నమ్మినబంటుగా పేరుబడ్డ పి.ఎస్.ఆర్. ఆంజనేయులును కార్యదర్శిగా తీసుకొచ్చారు. బోర్డు నియమాల ను, చైర్మన్ అనుమతులను బొందపెట్టి తమకు కావాల్సిన రీతిలో కథ నడిపించారు.

**1. మొదటి దశ: చట్టవిరుద్ధంగా డిజిటల్ మూల్యాంకనం**

- ఏపీపీఎస్సీ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా డిజిటల్ మూల్యాంకనానికి తెరలేపారు.
- కాంట్రాక్టును ఏకపక్షంగాకట్టబెట్టి ప్రైవేటుస్కూళ్లు, కాలేజీల అర్హతలేని బోధనా సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో అత్యంత కీలకమైన జవాబు పత్రాలను దిద్దించారు.

**2. రెండో దశ: హాయ్‌ల్యాండ్ రిసార్టులో రిగ్గింగ్**

- డిజిటల్ మూల్యాంకనం చెల్లదని హైకోర్టు స్పష్టం చేయడంతో మాన్యువల్ మూల్యాంకనం పేరిట మరో దారుణానికి ఒడిగట్టారు.
- అత్యంత రహస్యంగా ఉండాల్సిన జవాబు పత్రాల ను హాయ్ ల్యాండ్ రిసార్టుకు తరలించారు.
- అక్కడ ఎలక్ట్రీషియన్లు, సెక్యూరిటీ గార్డులు, గుమాస్తాలు, చివరికి గృహిణులతో ఓఎంఆర్ షీట్లపై మార్కులు వేయించారు. వ్యవహారం బయటపడగానే అసలు మూల్యాంకనమే జరగలేదని అబద్ధాలాడారు.

**3. మూడో దశ: ఫలితాల మార్పు, 95% పత్రాల్లో దిద్దుబాట్లు**

- విజయవాడలో చేపట్టిన మూడో విడత మూల్యాంకనంలో అసలు రంగు బయటపడింది.
- మొదటి మూల్యాంకనంలో ఇంటర్వ్యూకి ఎంపికైన 326 మందిలో ఏకంగా 202 మంది గల్లంతయ్యారు!
- ఫోరెన్సిక్ విచారణలో 95% ఓఎమ్మార్ పత్రాల్లో వైటనర్లు, ఓవర్ రైటింగ్స్, వేర్వేరు చేతిరాతలు ఉన్నట్లు సిట్ ఆధారాలతో సహా నిరూపించింది.
- చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఆన్సర్ షీట్లను ముచ్చటగా మూడుసార్లు మూల్యాంకనం చేసి నియామక ప్రక్రియను మహా ప్రహసనంగా మార్చేశారు. మొత్తం 736 ఓఎంఆర్ వాల్యుయేషన్ పత్రాల్లో ఏకంగా 95% పత్రాల్లో సవరణలు, ఓవర్ రైటింగ్‌లు, వైట్‌నర్ దిద్దుబాట్లు ఉన్నాయంటే వీళ్ల బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

## ఆరోపణలు చేయడం కాదు..

# ప్రజలపై గౌరవముంటే అసెంబ్లీకి రండి

- అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతల పిచ్చి ప్రేలాపనలు
- అమరావతి గురించి మాట్లాడే నైతిక అర్హత కూడా వైసీపీకి లేదు
- మెగా డీఎస్సీ పేరుతో యువతను దగా చేసిన ఘనత గొడ్డలి పార్టీదే
- అభివృద్ధి అడ్డుకుంటే ఉపేక్షించేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్

మచిలీపట్నం (చైతన్యరథం): వైసీపీ నేతలు రోడ్డెక్కి ఆరోపణలు చేయడం కాదు.. ప్రజలు ఇచ్చిన తీర్పుపై గౌరవం, చట్టసభలపై నమ్మకం ఉంటే అసెంబ్లీకి రావాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సవాల్ చేశారు. మచిలీపట్నం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నేతలకు ఆరోపణలు చేయడం, పారిపోవడం అలవాటుగా మారిపోయిందని మంత్రి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేకే వైసీపీ నేతలు పిచ్చి ప్రేలాపనలకు దిగుతున్నారన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాత్రింబవళ్లు రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల కోసం పని చేస్తున్నారు. నిరంతరం సమీక్షలు సమావేశాలతో ఏపీకి పెట్టుబడులు పరిశ్రమల కోసం తపిస్తున్నారు. ప్రతి వీడియో కాన్ఫరెన్స్‌లోనూ పోలీసు అధికారులతో లా అండ్ఆర్డర్‌పై సమీక్షిస్తున్నారు. బాధ్యత కలిగిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తుంటే.. గతంలో అధికారంలో ఉన్న వారు ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి ప్రశ్నించారు.

**'దిశ చట్టం' పేరుతో ప్రజలను మభ్యపెట్టారు**

మహిళలు, ఆడబిడ్డల భద్రత విషయంలో గత ప్రభుత్వం చేసిన ప్రచారానికి, ఆచరణకు పొంతన లేదని మంత్రి విమర్శించారు. దిశ చట్టం పేరుతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప మహిళల భద్రతకు గత ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలే ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. కానీ నేడు రాష్ట్రంలో మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. అసలు లేని చట్టం గురించి వైసీపీ నేతలు ఎందుకు ఇంతలా యాగీ చేస్తున్నారో వారికే తెలియాలని ఎద్దేవా చేశారు.

**అమరావతిపై మాట్లాడే నైతిక హక్కు లేదు**

మూడు రాజధానుల పేరుతో డ్రామాలాడి, అమరావతి రైతుల్ని ముప్పుతిప్పలు పెట్టిన వారు.. అమరావతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతిపై వైసీపీ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదు. గత ఐదు సంవత్సరాలు అమరావతి రైతుల్ని ఎంతలా హింసించారో, ఎంతలా వేధించారో ప్రపంచం మొత్తం చూసింది. చివరికి వారు కట్టుకున్న చీరల గురించి కూడా అవమానకరంగా మాట్లాడిన నీచ సంస్కృతి వైసీపీ నేతలది. అలాంటి వైసీపీ నేతలు నేడు అమరావతిపై కపట ప్రేమను ప్రదర్శించడం మానుకోవాలని హితవు పలికారు.

అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభించుకోవడం హర్షణీయం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే టెండర్లు, నిర్మాణ పనులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రపంచస్థాయి నాణ్యతతో



తక్కువ ఖర్చుతో నాణ్యమైన నిర్మాణాలు చేపడుతున్న ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడానికి వైసీపీ నేతలు సిగ్గుపడాలన్నారు.

**మెగా డీఎస్సీపై మాట్లాడే హక్కు ఎక్కడిది?**

మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలు ఐదు సంవత్సరాల పాలనలో చేసిన ఘనకార్యాలను గుర్తు చేసుకోవాలి. ఏటా మెగా డీఎస్సీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ హామీలు ఏమయ్యాయో వైసీపీ నేతలు, జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీని పూర్తి చేసి 16 వేల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించింది. వారంతా ఉద్యోగాల్లో చేరిపోయిన తర్వాత రాద్ధాంతం చేయడానికి బుద్ధి ఉండాలన్నారు.

పట్టిసీమ ప్రాజెక్టు దండగ అన్న వారు.. ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు వచ్చిన ప్రయోజనాలను ప్రజలు గమనిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టును రానున్న రోజుల్లో పూర్తి చేసి రాష్ట్రానికి మరింత ప్రయోజనం చేకూరుస్తామని మంత్రి పేర్కొన్నారు.

**దమ్ముంటే అసెంబ్లీకి రండి.. చర్చిద్దాం**

మచిలీపట్నం అభివృద్ధిపై తాను బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని కొల్లు రవీంద్ర ప్రకటించారు. వైసీపీ నాయకుడు పేర్ని నానికి ధైర్యం ఉంటే మచిలీపట్నం అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. రాష్ట్ర అభివృద్ధిపై గానీ, వైసీపీ నేతలు చేస్తున్న డీఎస్సీ, శాంతిభద్రతలు, అభివృద్ధి అంశాలన్నింటిపైనా కూలంకషంగా చర్చిద్దామని సవాల్ చేశారు. మచిలీపట్నం అభివృద్ధిపై తాను చేసిన పనులను ప్రజలకు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని, విమర్శలు చేస్తున్న వారు తాము చేసిన పనులపై కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేయడం కంటే ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చకు రావాలని సూచించారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూకేటాయింపులు, బియ్యం వ్యవహారాలు, ఇతర అంశాలపై కూడా మాజీ మంత్రి సమాధానం చెప్పాలని కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. అయితే వీటిపై వచ్చిన ఆరోపణలు, న్యాయపరమైన అంశాలను సంబంధిత కోర్టు తీర్పులు, అధికారిక రికార్డుల ఆధారంగానే చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేలా తప్పుడు ప్రచారం, నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు టీడీపీ సిద్ధంగా ఉందని, అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతలపై బహిరంగ చర్చకు ఎప్పుడైనా సిద్ధమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు

- నిర్మాణపనుల్లో నాణ్యతలో రాజీపడొద్దు
- బోటింగ్‌లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం
- ఏపీటీడీసీ ఛైర్మన్ డా.నూకసాని బాలాజీ
- విజయవాడ బెర్మ్ పార్క్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాష్‌రూమ్‌లు, బోటింగ్ యూనిట్‌ను పరిశీలించిన ఛైర్మన్

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ బెర్మ్ పార్క్‌లో పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు బోటింగ్ కార్యకలాపాలను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని అధికారులను ఏపీటీడీసీ ఛైర్మన్ డా. నూకసాని బాలాజీ ఆదేశించారు.

గురువారం ఉదయం బెర్మ్ పార్క్‌ను సందర్శించిన డా. నూకసాని బాలాజీ.. పార్క్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాష్‌రూమ్‌లను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, ఉపయోగిస్తున్న నిర్మాణ సామగ్రి ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. అలాగే, నిర్దేశించిన డిజైన్, ప్రమాణాలు, సాంకేతిక నిబంధనలకు అనుగుణంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయా లేదా అన్న అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ఛైర్మన్ స్పష్టం చేశారు. పర్యాటకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాష్‌రూమ్‌ల నిర్మాణం సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా, దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పనులను నిర్ణీత ప్రమాణాల మేరకు వేగవంతంగా పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

అనంతరం బోటింగ్ యూనిట్‌ను సందర్శించిన డా. బాలాజీ.. బెర్మ్ పార్క్‌లో ప్రస్తుతం నిర్వహిస్తున్న బోటింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. బోటింగ్‌కు వినియోగిస్తున్న అన్ని బోట్ల పరిస్థితి, వాటి నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, తదితర అంశాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పర్యాటకుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, బోట్లను



నిరంతరం తనిఖీ చేస్తూ వాటి ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలను నిర్ధారించిన తర్వాత మాత్రమే బోటింగ్‌కు వినియోగించాలని ఛైర్మన్ సూచించారు. బోటింగ్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, భద్రతా పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

అలాగే బోటింగ్ కంట్రోల్ రూమ్‌ను నిర్దేశిత నిబంధనలు, భద్రతా మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. బోటింగ్ కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఏదైనా సమస్య లేదా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు తక్షణమే స్పందించే విధంగా కంట్రోల్ రూమ్‌ను సన్నద్ధంగా ఉంచాలని సూచించారు.

పార్క్‌కు వచ్చే పర్యాటకులకు మెరుగైన అనుభూతి కల్పించేందుకు పరిశుభ్రత, భద్రత, మౌలిక సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు డా. నూకసాని బాలాజీ సూచించారు. పర్యాటకుల సౌకర్యం, భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు.

ఈ సందర్భంగా బెర్మ్ పార్క్ అభివృద్ధి, పర్యాటకులకు అందుతున్న సౌకర్యాలు, బోటింగ్ నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలను జారీ చేశారు.



**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమైన సచివాలయం**



# ప్రజారోగ్యానికి సవాలుగా ఊబకాయం

- రాష్ట్రంలో ప్రతి ఇద్దరిలో ఒకరికి అధిక బరువు
- మహిళల్లోనే అత్యధికంగా ఉండడంపై ఆందోళన
- నియంత్రణ కోసం జాయింట్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- ఆరోగ్యం, విద్య, క్రీడలు, మహిళా శిశు సంక్షేమ శాఖల భాగస్వామంతో
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- విజయవాడలో సీఐఐ ఆధ్వర్యంలో ఊబకాయంపై సదస్సు

విజయవాడ (చైతన్యరథం): తీవ్ర స్థాయిలో ఉన్న ఊబకాయ సమస్య రాష్ట్ర ప్రజారోగ్యానికి సవాల్ విసురుతోశీదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర రూపం దాలుస్తోన్న ఊబకాయ సమస్యను ఎదుర్కొనేందుకు జాయింట్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరోగ్య శాఖతోపాటు విద్య, క్రీడలు, మహిళా శిశు సంక్షేమం, తదితర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. విజయవాడలో గురువారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో ఊబకాయం, జీవక్రియ ఆరోగ్యంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి బహుళరంగ భాగస్వామ్యుల సదస్సులో మంత్రి మాట్లాడారు. జీవనశైలిలో వస్తోన్న మార్పుల కారణంగా ఊబకాయం ప్రధాన ప్రజారోగ్య సవాల్‌గా మారుతోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సంపద పెరుగుతున్న వేగం కంటే ఊబకాయం విస్తరిస్తున్న వేగం ఎక్కువగా ఉందన్నారు. పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక ప్రగతితో జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నప్పటికీ.. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో ఊబకాయం సమస్య తీవ్రతరమవుతోందని చెప్పారు. దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఆరోగ్యంతోపాటు ఉత్పాదకత, ఆర్థిక ప్రగతిపైనా ప్రభావం పడుతుందని వివరించారు.

### పెరుగుతున్న స్థూలకాయులు

ప్రపంచ వ్యాప్తంగా అధిక బరువు ఉన్న వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతోందని, 2010 నుంచి 2030 మధ్య వీరి సంఖ్య 115 శాతం పెరిగి సుమారు 200 కోట్లకు చేరుతుందన్న అంచనాలున్నాయన్నారు. ఊబకాయంతో బాధపడే చిన్నారుల సంఖ్య నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఆందోళన కలిగిస్తోందన్నారు. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే-5 ప్రకారం దేశంలో 24 శాతం మహిళలు, 23 శాతం పురుషులు అధిక బరువుతో ఉన్నారని చెప్పారు. సర్వే-6 ప్రకారం మహిళల్లో 30.70 శాతం, పురుషుల్లో 27.30 శాతం నమోదైందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఊబకాయ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని మంత్రి తెలిపారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 ప్రకారం రాష్ట్రంలో 47.90 శాతం మహిళలు, 44.40 శాతం పురుషులు అధిక బరువుతో ఉన్నారని చెప్పారు. అంటే రాష్ట్రంలో దాదాపు ప్రతి ఇద్దరిలో ఒకరు అధిక బరువుతో ఉన్నట్లేనని వివరించారు. అధిక బరువు, ఊబకాయానికి జీవనశైలిలో మార్పులు, శారీరక కదలికలు తగ్గడం, అధిక ఆహారం,




అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార పదార్థాల వినియోగం, చక్కెర పానీయాలు, పని ఒత్తిడి, ఎక్కువ సమయం మొబైల్ బైల్ స్క్రీన్‌ల ముందు గడపడం వంటి అంశాలు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. పిల్లల్లో బహిరంగ క్రీడలు, శారీరక కార్యకలాపాలు తగ్గడం కూడా సమస్యను పెంచుతోందన్నారు.

### శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణ

సీఐఐ సదస్సులో జరిగిన చర్చలు, వచ్చిన సూచనల ఆధారంగా ఊబకాయ నియంత్రణకు అవసరమైన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని మంత్రి తెలిపారు. ఇందుకోసం జాయింట్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోగ్య శాఖతోపాటు విద్య, క్రీడలు, మహిళా శిశు సంక్షేమం, తదితర శాఖలను భాగస్వామ్యం చేయడం ద్వారా సమస్యను సమగ్రంగా ఎదుర్కొనే ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఊబకాయాన్ని ఒక్క ఆరోగ్య శాఖకు మాత్రమే సంబంధించిన సమస్యగా చూడకూడదన్నారు

### నాణ్యమైన ఆహారంపై దృష్టి

వైద్య, ఆరోగ్య శాఖలో అంతర్భాగంగా ఉన్న ఫుడ్ సేఫ్టీ శాఖను బలోపేతం చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా ఈ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార నాణ్యత, ప్రజల ఆరోగ్యం మధ్య ఉన్న సంబంధాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు కొనసాగిస్తామని మంత్రి పేర్కొన్నారు.

### సీఎంకు ప్రతిపాదనలు

సీఐఐ సదస్సులో ఊబకాయ సమస్య తీవ్రత, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వచ్చిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. వాటిపై ముఖ్యమంత్రి ఇచ్చే కీలక సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందుగానే గుర్తించి నివారించడంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు.

### పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా పిల్లల ఎత్తు, బరువును నమోదు చేస్తున్నామని మంత్రి చెప్పారు. పిల్లల్లో జీవక్రియ సంబంధిత సమస్యలను కూడా ముందుగానే గుర్తించేలా ఈ కార్యక్రమం ద్వారా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నామన్నారు. చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలను గుర్తిస్తే అవసరమైన జాగ్రత్తలు, చికిత్సా చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

### 59 లక్షల మందికి బీపీ

రాష్ట్రంలో అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ) పరిస్థితిపై ఇప్పటికే జిల్లాల వారీగా మ్యాపింగ్ చేపట్టామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన ఎన్‌సీడీ సర్వేలో రాష్ట్ర జనాభాలో 59 లక్షల మందికి రక్తపోటు, 48 లక్షల మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఊబకాయం, జీవక్రియ సమస్యలు, అసాంక్రమిక వ్యాధుల మధ్య సంబంధాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు గుర్తింపు, నివారణ చర్యలకు ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు.

### 41 రకాల పరీక్షలు ఉచితం

యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమం కింద మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా 41 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. కుప్పంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పారు. సంజీవని పథకం ద్వారా ఆరోగ్య సమస్యలున్నవారిని గుర్తించి ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందేలా అపాయింట్‌మెంట్లు ఇప్పిస్తున్నామని, వారి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తున్నామని వివరించారు.

రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు మాట్లాడుతూ...సాంకేతికత పెరగడం, జీవన విధానంలో మార్పులు ఊబకాయం పెరగడానికి ప్రధాన కారణాలుగా మారాయన్నారు. ఆటలు, క్రీడలకు బదులుగా వినోదం స్క్రీన్‌ల వైపు మళ్లింది. పని విధానాలు కూడా ఎక్కువగా డెస్క్ ఆధారితంగా మారడంతో అన్ని వయసుల వారిలో శారీరక శ్రమ గణనీయంగా తగ్గింది. మన పూర్వీకుల జీవన విధానంలోని మంచి అలవాట్లకు తిరిగి వెళ్లాల్సిన అవసరం ఉంది. పరిమితంగా ఆహారం తీసుకోవడం, ఇంటి పనులు సహా సాధ్యమైనంత ఎక్కువ శారీరక శ్రమ చేయడం, సహజ ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వడం, నూనె, ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించడం అవసరం.

ఈ సవాలును ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్యశాఖ పూర్తిగా కట్టుబడి ఉంది. సమగ్ర పరీక్షలు, ముందస్తు గుర్తింపుపై దృష్టి సారిస్తూ చికిత్స నుంచి నివారణ వైపు, అనారోగ్యం నుంచి సంపూర్ణ ఆరోగ్యం వైపు దృష్టిని మళ్లిస్తున్నాం. సీఐఐ నుంచి వచ్చే సమగ్ర సిఫార్సుల కోసం ఎదురుచూస్తున్నాం. వాటిని పరిశీలించి, అమలుకు అవసరమైన చర్యలు చేపడతామని చక్రధర్ బాబు పేర్కొన్నారు

సీఐఐ రాష్ట్ర ఛైర్మన్ నరేంద్రకుమార్, మాజీ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ, ప్రిన్సిపల్ అడ్వైజర్ (హెల్త్‌కేర్) డాక్టర్ షబ్నమ్ సింగ్ మాట్లాడుతూ.. సీఐఐ ఆర్థిక వ్యవహారాలకే పరిమితం కాకుండా సామాజిక, ఆరోగ్య రంగాల అభివృద్ధికి కూడా కృషి చేస్తోందన్నారు. ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఊబకాయ సమస్య తీవ్రతను గుర్తించి రాష్ట్రాల వారీగా అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలపై సీఐఐ తరపున ప్రతిపాదనలు అందిస్తామని చెప్పారు. ఈ సదస్సులో వైద్య, ఆరోగ్య శాఖ జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, బోధనాసుపత్రుల వైద్యులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొని ఊబకాయం పరిష్కార చర్యలపై అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# గ్రూప్ 1 నియామకాల్లో అంతులేని అక్రమాలు

- సిట్ నివేదికతో జగన్ పాపాలు బట్టబయలు
- ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై సమాధానం చెప్పాలి
- యువతను, కోర్టులను తప్పుదారి పట్టించిన వారికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదు
- పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై గొడ్డలి పార్టీ అనవసర రాద్ధాంతం
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, డా. డోలా బాల వీరాంజనేయ స్వామి

అమరావతి (చైతన్యరథం): ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పోస్టుల నియామకంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను, పాపాలను సిట్ నివేదిక చాలా స్పష్టంగా బయటపెట్టిందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.శ్రీ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సిట్ నివేదిక ప్రకారం 158 మంది వాల్యుయేటర్లలో కేవలం 72 మందికి మాత్రమే అర్హత ఉందన్నారు. మిగిలిన అర్హత లేని వ్యక్తులతో వాల్యుయేషన్ జరిగిందన్నారు. అధికారిక వ్యవస్థ ద్వారా కాకుండా ప్రైవేట్ జీమెయిల్ ఖాతాలు, వ్యక్తిగత ఐడీలు, డ్రైవ్‌ల ద్వారా వాల్యుయేషన్ నిర్వహించారు. ఆన్సర్ షీట్లు ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించి 86 రోజులు అక్కడ ఉంచారు. సీసీ కెమెరాలు లేకుండా, యూనివర్సిటీ నిపుణులు లేకుండా వాల్యుయేషన్ జరిగింది. ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 160 మంది (96.97 శాతం) ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు జరిగాయి. మొత్తం 736 మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లలో 97.55 శాతం మందికి దిద్దుబాట్లు కనిపించాయని సిట్ నివేదిక ద్వారా స్పష్టమైంది. వైట్నర్/వైట్ కరెక్షన్ వాడకం, సంతకాలు సరిపోక పోవడం, ఒకే పేపర్‌లో రెండు రకాల ఇంక్ వాడకం, చీఫ్ ఎగ్జామినర్



సంతకాలు సరిపోకపోవడం వంటి అనేక అక్రమాలు ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలాయి. మొదటి వాల్యుయేషన్ మార్కులు, డిజిటల్ ఫలితాల మధ్య వ్యత్యాసాలు సిట్ గుర్తించింది. ఇవి కేవలం సాంకేతిక తప్పిదాలు కావు. యువత భవిష్యత్తుతో ఆడిన చెలగాటం. మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరిగింది. గత ప్రభుత్వం హయాంలో జరిగిన ఈ అక్రమాలకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రధాన బాధ్యుడు. మా ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు అత్యంత పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలు హామీలో భాగంగానే డీఎస్సీని నిర్వహించాం. వైసీపీ నాయకులు 240కి పైగా కేసులు వేసినా, కేంద్ర మార్గదర్శకాలు ఉన్నా అన్నింటినీ చట్టబద్ధంగా అధిగమించి, ఎలాంటి అడ్డంకులు లేకుండా డీఎస్సీని పూర్తి చేశాం. డీఎస్సీలో పారదర్శకంగా జరిగిన ప్రక్రియపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ధర్నాలు చేస్తున్న వారు, సిట్ నివేదికలో తేలిన తమ అక్రమాలపై సమాధానం చెప్పాలి. యువతను తప్పుదారి పట్టించిన వారికి రాజకీయాల్లో ఉండే నైతిక అర్హత లేదు. తెలుగుదేశం ప్రభుత్వం యువతకు న్యాయం చేస్తూ, మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పిస్తూ ముందుకు సాగుతోంది. గతంలో జరిగిన అక్రమాలపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని మంత్రి డా. స్వామి స్పష్టం చేశారు.

# ప్రాణాలు పోతున్నా వదిలేయడం వైసీపీ నైజం..

- ప్రాణాలు కాపాడటం టీడీపీ సంస్కారం
- బైకు ప్రమాదంలో బాధితుడిని పట్టించుకోకుండా కేసు తారుమారుకు సీదిరి తాపత్రయం
- కారు ప్రమాదంలో క్షతగాత్రులకు ఆసుపత్రిలో చికిత్స అందించింది మేము
- మా తప్పు లేకపోయినా బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలిచాం
- సీదిరి అప్పలరాజులా పారిపోలేదు, నిందితులను మార్చలేదు
- పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పష్టీకరణ

అమరావతి (చైతన్యరథం): సోషల్ మీడియా, కొన్ని టీవీ ఛానెళ్లు, పత్రికలను వేదికగా చేసుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు అవాస్తవాలతో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మండిపడ్డారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే మీడియా ముందుకు వచ్చానని ఆయన తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు బైక్‌తో ప్రమాదానికి కారణమై, దానయ్య అనే వ్యక్తిని రోడ్డుపైనే వదిలేసిన ఘటనను పక్కదారి పట్టించేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేసును తప్పుదోవ పట్టించేందుకు మరొకరిని నిందితుడిగా చూపించే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలపై ప్రజల దృష్టి మళ్లించేందుకే, సుమారు 20 నెలల క్రితం జరిగిన తమ కారు ప్రమాద ఘటనను ఇప్పుడు తెరపైకి తెచ్చి తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

### సొంత ఖర్చులతో చికిత్స

2024 సంవత్సరం డిసెంబర్ 21న మా అబ్బాయి వివాహ ఆహ్వాన పత్రికలు పంపిణీ చేయడానికి మా డ్రైవర్, సిబ్బంది కారులో వెళ్తున్నారు. పెద్దసీది నుంచి పాతపట్నం వెళ్తుండగా కొరసవాడ గ్రామం దగ్గర మధ్యాహ్నం 12:00 నుండి 1:00 గంటల మధ్యలో అనుకోని ప్రమాదం జరిగింది. మా కారు సరైన మార్గంలోనే వెళ్తుండగా, మన్యం జిల్లా నుంచి పాతపట్నంలో అంత్యక్రియలకు వచ్చి తిరుగు ప్రయాణమైన ఆటో రాంగ్ రూట్‌లో వచ్చి మా కారును బలంగా ఢీకొట్టింది. ఈ విషయాన్ని అక్కడ ఉన్న స్థానిక ప్రజలందరూ ప్రత్యక్షంగా చూశారు. ప్రమాదం జరిగిన వెంటనే మా డ్రైవర్, అక్కడికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న మా ఆఫీస్ సిబ్బంది, పీఏలు తక్షణమే అక్కడకు చేరుకున్నారు. వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, గాయపడిన ఐదుగురినీ శ్రీకాకుళం రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరగడం దురదృష్టకరమే, కానీ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మా నైజం. సీదిరి అప్పలరాజులా బాధితులను రోడ్డుపై వదిలేసి వెళ్లే మనస్తత్వం మాది కాదు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే నేను స్వయంగా శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి వెళ్లాను. అక్కడ ఉన్న సూపరింటెండెంట్, డాక్టర్లతో మాట్లాడి, గాయపడిన ఐదుగురి వద్దకూ వెళ్లి పరామర్శించి వారికి ధైర్యం చెప్పాను. బాధితుడు 'భోగయ్య'కి అప్పటికే గుండె సమస్య (హార్ట్ ప్రాబ్లమ్) ఉండి, పల్స్ పడిపోతోందని డాక్టర్లు చెప్పగానే... క్షణం ఆలస్యం చేయకుండా అదే రోజు రాత్రి ఆయన్ను 'మెడికవర్' కార్పొరేట్ హాస్పిటల్‌కి మార్పించాను. మెడికవర్ ఆసుపత్రిలో ఆయనకు ప్రత్యేక వైద్యం అందిస్తూ లక్షలాది రూపాయల బిల్లులను నా సొంత ఖర్చులతో భరించాను. దీనికి సంబంధించిన ప్రతి బిల్లు, డాక్యుమెంట్లు నా దగ్గర ఆధారాలుగా ఉన్నాయి. దురదృష్టవశాత్తూ భోగయ్య 4 రోజుల చికిత్స అనంతరం ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన కుటుంబానికి ఇన్సూరెన్స్ డబ్బులు రావడానికి సమయం పడుతుందని, కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పెద్దలు కోరడంతో... నేను వెంటనే స్పందించి రూ.5,00,000 (ఐదు లక్షల రూపాయలు) ఆర్థిక సహాయం అందిస్తానని మాటిచ్చాను. ఇందులో భాగంగానే రూ.1,85,000 (లక్షా ఎనభై ఐదు వేల రూపాయలు) ఫోన్ పే ద్వారా భోగయ్య కుమారుడి ఖాతాకు జమ చేశాను. మిగతా నలుగురు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి సురక్షితంగా డిశ్చార్జ్ చేయించాం. ఈ ఘటన అంతా పట్టపగలు, ఊరి నడిబొడ్డున ప్రజలందరి సమక్షంలో జరిగింది. పోలీసుల ఇన్వెస్టిగేషన్ రికార్డులు, రిమ్స్ ఆసుపత్రి రికార్డులు పరిశీలిస్తే ఎవరిది తప్పు, ఎవరు బాధ్యతగా వ్యవహరించారనేది స్పష్టంగా తెలుస్తుంది. అటువంటిది, తమ పార్టీ నాయకులు చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి నాపై తప్పుడు అభియోగాలు మోపడం గొడ్డలి పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. నిజానిజాలు గ్రహించి ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు, మీడియా మిత్రులకు ఎమ్మెల్యే గోవిందరావు విజ్ఞప్తి చేశారు.

### తప్పు కప్పిపుచ్చుకునేందుకు..

వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులు నాపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాను. పాతపట్నం ఎమ్మెల్యే కారు యాక్సిడెంట్‌కు ఒక న్యాయం... నా కొడుకు యాక్సిడెంట్‌కు ఒక న్యాయమా అని సీదిరి అప్పలరాజు భార్య ప్రశ్నించారు. పలాసలో అప్పలరాజు కుమారుడు కనీస మానవత్వం లేకుండా 'హిట్ అండ్ రన్' చేసి ఒక నిరుపేద పశువుల కాపరి (దానయ్య) ప్రాణాలు తీస్తే... ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి, నాపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. మీ భర్త డాక్టర్ అయి ఉండి కూడా, రోడ్డుపై రక్తం ఓడుతూ పడి ఉన్న దానయ్య అనే నిరుపేదని కనీసం హాస్పిటల్‌కి తీసుకెళ్లే మానవత్వం మీ అబ్బాయికి గానీ, మీకు గానీ లేకపోయింది. పైగా కేసు నుంచి



తప్పించుకోవడానికి సాక్ష్యాలను తారుమారు చేస్తూ బైక్ వేరే యువకుడు నడుపుతున్నట్లుగా కేసును తారుమారు చేశారు. నా విషయానికి వస్తే ప్రమాదం జరిగిన మరుక్షణమే 108కి ఫోన్ చేసి, హాస్పిటల్‌లో చేర్పించి, లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించి, ఆ కుటుంబానికి రూ. 5 లక్షల సాయం అందించి ఆదుకున్నాం. అంతేకాకుండా, ఆ కుటుంబంలోని అర్హత కలిగిన వ్యక్తికి నా సొంత హాస్పిటల్‌లో గానీ, ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్ / కాంట్రాక్ట్ ప్రాతిపదికన గానీ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాను. వైసీపీ వారికి మాకు తేడా ఇదేనని గోవిందరావు అన్నారు.

ఒక వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి వచ్చి, బడుగు బలహీన వర్గాల అండతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ప్రజాసేవ చేసే అవకాశం పొందిన సామాన్యుడిని నేను. నిత్యం ప్రజల్లో ఉంటూ సేవ చేయడమే నా ధ్యేయం. అటువంటిది నాపై, నా పార్టీపై ఆధారాల్లేకుండా తప్పుడు అభియోగాలు మోపుతుంటే ఎంతో మనస్తాపానికి గురై ఈ ఆధారాలను మీడియా ముందుకు తెస్తున్నాను. మాకు రూపాయి కూడా అందలేదు, మమ్మల్ని పట్టించుకోలేదు.. అని కొందరు చేస్తున్న దుష్ప్రచారంలో నిజం లేదు. మరణించిన భోగయ్య కుమారుడు మధు ఖాతాకు నా స్వంత డబ్బుల నుంచి రూ. 1,85,000 ఫోన్ పే ద్వారా పంపిన డిజిటల్ ట్రాన్సాక్షన్ రికార్డులు నా దగ్గర ఉన్నాయి. మిగిలిన మొత్తాన్ని క్యాష్ రూపంలో అందజేశాం. ప్రమాదం మధ్యాహ్నం 1:00 గంటకు జరిగితే, సరిగ్గా 3:00 గంటలకల్లా బాధితుడు భోగయ్య కుమారుడు మధు స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. మా కారును తోలుతున్న డ్రైవర్ రాజేష్ పేరు మీదనే ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. ప్రమాదం జరిగిన తరువాత మా డ్రైవర్ అక్కడ ఉన్నాడు, కారు మాదే అని ఒప్పుకున్నాం, గంటల వ్యవధిలోనే బాధ్యతాయుతంగా పోలీసులకు సహకరించాం. మేము వైఎస్సార్‌సీపీ నాయకుల్లాగా ప్రమాదం చేసి నాలుగు రోజులు దాక్కుని, కారు మార్చి, డ్రైవర్‌ను మార్చి సాక్ష్యాలను తారుమారు చేయలేదు. గుంటూరులో 'సింగయ్య' అనే వ్యక్తిపై కారు ఎక్కించి శవాన్ని పక్కన పడేసి వెళ్లిన చరిత్ర మీ నాయకుడు జగన్‌ది... పలాసలో పశువుల కాపరి 'దానయ్య'ను ఢీకొట్టి రక్తం ఓడుతున్నా పట్టించుకోకుండా పారిపోయిన సంస్కృతి మీ అప్పలరాజుది. అప్పలరాజు భార్య ఒక తల్లిగా మాట్లాడుతున్నానంటూ... ఒక తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఇంకొక తల్లిపై, ఇంకొక కొడుకుపై నిందలు వేయడం ఎంతవరకు న్యాయం అని గోవిందరావు ప్రశ్నించారు.

### డైవర్షన్ పాలిటిక్స్..

పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు చేసిన 'హిట్ అండ్ రన్' పాపాన్ని కప్పిపుచ్చుకోవడానికి, నాపై, మా ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై సదరు బాధితులు (మధుబాబు, సంతోషమ్మ) ఇచ్చిన సాక్ష్యాలు, విచారణలో లభించిన ఆధారాలను పరిశీలించిన తర్వాత న్యాయస్థానం 06-08-2026 న ఈ కేసును పూర్తిగా కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. కోర్టు తీర్పు వచ్చి కేసు క్లియర్ అయిన తర్వాత కూడా... బాధితులను ప్రలోభపెట్టి, మీడియా ముందుకు తెచ్చి మాట్లాడించడం ఎంతవరకు సమంజసం? మీరు మీడియా ముందుకు వచ్చి "మేము రాజ్యాంగానికి, న్యాయస్థానాలకు కట్టుబడి ఉంటాం" అని చెప్తారు కదా... మరి కోర్టు ఇచ్చిన తీర్పు కంటే మీరు గొప్పవారా? మా ఆయన డాక్టర్, ఎన్నో మండలాల్లో సేవలు చేశారు అని మాట్లాడే అప్పలరాజు భార్యకు ఒకటే చెప్తున్నాను.. ప్రాణాలు కాపాడాల్సిన డాక్టర్ కొడుకై ఉండి, రక్తం ఓడుతున్న దానయ్య అనే వ్యక్తిని నడిరోడ్డుపై వదిలేసి పారిపోవడం ఏ రకమైన సేవ? వైఎస్సార్‌సీపీకి ఒకటే సిద్ధాంతం ఉంది.. అదే 'డైవర్షన్ పాలిటిక్స్'. తాము చేసిన దారుణాలు బయటపడకుండా ఉండేందుకు వేరొకరిపై నిందలు వేయడం వారికి అలవాటుగా మారింది. నిజమైన దొంగలు, నేరస్థులు చట్టం నుంచి తప్పించుకోవడానికి ఎలాంటి తప్పు చేయని నాపై, తెలుగుదేశం పార్టీపై బురద చల్లుతున్నారు. నిప్పులాంటి నిజాన్ని మసిపూసి మారేడుకాయ చేయాలని చూస్తే ప్రజలు నమ్మరు. న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులకు, చట్టానికి అందరం కట్టుబడి ఉండాలి. 20 నెలల కిందట జరిగిన ప్రమాదాన్ని తవ్వి తీసి, చట్టబద్ధంగా మేం చేసిన సాయాన్ని దాచిపెట్టి నాపై బురద చల్లాలని చూస్తే ప్రజలు ఊరుకోరు. తెలుగుదేశం పార్టీ నిప్పు లాంటిది. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. వైఎస్సార్‌సీపీ చేసే ఈ 'డైవర్షన్ పాలిటిక్స్'ని, వారు ఆడుతున్న నాటకాలను గమనించి వాస్తవాలను తెలుసుకోవాలి.

తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేస్తున్నాం. మేం తప్పు చేస్తే మా నాయకుడు సహించరు, శిక్షిస్తారు. ఒక సాధారణ, బడుగు బలహీన వర్గాల కుటుంబం నుంచి వచ్చినవాడిగా నాకు పేదల కష్టాలు తెలుసు. రోడ్డు మీద శవాలను విడిచిపెట్టి పారిపోయే నైజం వైసీపీది... ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే సంస్కారం తెలుగుదేశం పార్టీది. మీడియా మిత్రులు, ప్రజలు ఈ రెండింటికీ ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని గోవిందరావు విజ్ఞప్తి చేశారు.

# ఆయుష్ వైద్యులకు టీటీడీపీ మద్దతు

గౌరం వేతనం పెంపు కోసం తెలంగాణ రాష్ట్రంలో సేవలందిస్తున్న ఆయుష్ వైద్యులు/శస్త్ర వైద్యులు చేస్తున్న ఆందోళనకు తెలంగాణ తెలుగుదేశం పార్టీ సంఘీభావం ప్రకటించింది. నిబంధనల ప్రకారం గౌరవ వేతనం పెంచాలంటూ ఇందిరాపార్క్, ధర్నాచౌక్ వద్ద ఆయుష్ వైద్యులు/శస్త్ర వైద్యులు చేస్తున్న నిరసన చేస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అల్లోపతీ, ఆయుష్ వైద్యులకు/శస్త్ర వైద్యులకు ఒకే విధంగా గౌరవ వేతనం ఉండేదని, కానీ పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో పాలకులు అన్యాయం చేస్తూ... పక్షపాతం వహిస్తున్నారని ఆయుష్ వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యువ వైద్యులకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, (NIMA)–National Integrated Medical Association తెలంగాణ రాష్ట్ర సలహాదారు ప్రొ.తిరునగరి జ్యోత్స్న 10వ రోజైన గురువారం ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టి ఆయుష్ వైద్యులకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటామని నిరసనలో పాల్గొన్న వందలాదిమంది యువ వైద్యులకు భరోసా ఇచ్చి సంఘీభావం తెలిపారు.

ప్రొ.తిరునగరి జ్యోత్స్న ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తరపున మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీజీకే మూర్తి, తెలుగు యువత నాయకుడు సాయి నాగార్జున, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు రామోజు శివకుమార్, పలువురు తెలుగుదేశం అభిమానులతో కలిసి టీటీడీపీ రాష్ట్ర నాయకుడు, పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకులు వేజండ్ల కిషోర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ ఒక పక్క విభజిత ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని తెలుగుదేశం ప్రభుత్వం ఆర్థిక లోటులో ఉన్నా, అల్లోపతీ, ఆయుష్ వైద్యులకు/శస్త్ర వైద్యులకు ఒకే విధంగా గౌరవ వేతనం (సుమారు రూ.70వేలు) ఇస్తున్నారని తెలిపారు. ఇక్కడ మన ధనిక తెలంగాణ లో మాత్రం గత బీఆర్ఎస్ పాలనలోనూ, నేటి కాంగ్రెస్ పాలనలోనూ సగానికి సగం మాత్రమే ఇస్తున్నారని, ఇది



ఏమాత్రం సమంజసం కాదు కాబట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణం స్పందించి యువ ఆయుష్ వైద్యులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# భూమిని ఆక్రమించిన వైసీపీ గూండాలు

- నకిలీ కాగితాలతో భూమి కొట్టేసిన వైసీపీ నేత
- భూమి కొనుగోలు పేరిట చెల్లని చెక్కులిచ్చి బురిడీ.. అడిగితే బెదిరింపులు
- కబ్జా రాయుళ్ల దౌర్జన్యం.. 82 సెంట్ల స్థలంలో అక్రమ కట్టడాలు
- వారసత్వ భూమికే ఎసరు.. ఆన్‌లైన్‌లో హక్కుదారు పేరు తీసేశారు
- టీడీపీ కేంద్రకార్యాలయంలో బాధితుల ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి





అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమానికి అర్జీదారులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ప్రజల నుంచి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా..డోలా బాల వీరాంజనేయ స్వామి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం ఎస్. లింగందిన్నె గ్రామానికి చెందిన కుమ్మరి బాలుడు అర్జీ ఇస్తూ.. తమ గ్రామంలో తమ పూర్వీకుల నుంచి వస్తున్న పెద్దల ఆస్తిని తమ దాయాదులు, వైఎస్సార్సీపీకి చెందిన గుండాలు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. అంతేకాకుండా తమ తండ్రి పేరిట ఉన్న భూమి వివరాలను రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల నుంచి కనిపించకుండా చేశారు. ఆ భూమికి సంబంధించి తమ వద్ద ఉన్న ఆధారాలను కూడా మాయం చేసి తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన జి. గంగమ్మ విజ్ఞప్తి చేస్తూ..1976 లో సీలింగ్ యాక్ట్ కింద తన భర్త లేట్ కుల్లాయప్పకి తాడిపత్రి పొలం పరిధిలోని సర్వే నంబర్ 770/2లో 2.40 ఎకరాల భూమిని ప్రభుత్వం పట్టాగా మంజూరు చేసిందని తెలిపారు. 1999లో భర్త కుల్లాయప్ప మరణించినప్పటి నుండి ఆ భూమిని తాను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. తన భర్త కుల్లాయప్ప మరణించగా, అప్పటి రెవిన్యూ అధికారుల సహకారంతో ఆ భూమిని వైసీపీ నాయకుడు రమేష్‌రెడ్డి అక్రమంగా ఆయన పేరుపైకి మార్చుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ భూమి 22 ఏ (నిషేధిత జాబితా) కింద ఉన్నప్పటికీ, ఆ విషయం తమకు చెప్పకుండా నమ్మబలికి, చదువు రాని తన వద్ద వేలిముద్రలు తీసుకున్నారు. ఆర్డీవో కోర్టు ఉత్తర్వుల పేరిట ఒక నకిలీ ఆర్డర్ కాపీ సృష్టించి రమేష్ రెడ్డి కి లబ్ధి చేకూరేలా చేశారు. ఈ అక్రమ వ్యవహారానికి అప్పటి రెవిన్యూ అధికారులు లంచాలు తీసుకుని పూర్తి స్థాయిలో సహకరించారు. 19.05.2026 తేది నాడు డాక్యుమెంట్ నంబర్ 3725/2026 ద్వారా రమేష్ రెడ్డి ఆయన సతీమణి అంబిక పేరు మీద ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ అన్యాయంపై ప్రశ్నించడానికి వెళ్లిన తమను రెవిన్యూ అధికారులు కులం పేరుతో తీవ్రంగా అవమానించి బయటకు గెంటివేశారు. వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బంగారు చిన్నేపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి అర్జీ ఇస్తూ..అనంతపురం టౌన్, రామ్‌నగర్ నివాసి అయిన మాధవరెడ్డి, ఆయన కుమారుడు విజయ్ మోహన్ రెడ్డి భూమి కొనుగోలు అడ్వాన్స్ నెపంతో తన వద్ద రూ. 10,00,000/- తీసుకున్నారని తెలిపారు. దానికి సంబంధించి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ చెక్కులు ఇవ్వగా అవి చెల్లకుండా పోయాయి. చెల్లుబాటు కాని చెక్కుల విషయమై నిలదీయగా, కాలయాపన చేస్తూ తనపై దాడికి దిగారు. అంతేకాకుండా పుట్టపర్తి రైల్వే స్టేషన్ వద్ద దాడి చేసి, చంపడానికి ప్రయత్నించారు. మాధవరెడ్డిపై ఇప్పటికే అనంతపురం 2-టౌన్ పోలీస్ స్టేషన్‌లో పలు అక్రమ, క్రిమినల్ కేసులు ఉన్నాయి. రెడ్డిపల్లి సబ్ జైలు నుండి విడుదలైన తర్వాత తనను నిరంతరం వెంటాడుతూ ప్రాణభయానికి గురిచేస్తున్నాడు. వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తిరుపతికి చెందిన ఎం. పుష్పమ్మ గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ..1981లో చిత్తూరు పట్టణం, గ్రీమ్‌పేటలోని సర్వే నెం. 244/1 లోని 0.82 సెంట్ల భూమిని తన భర్త లేట్ నాగయ్య కొనుగోలు చేసి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. ఈ 0.82 సెంట్ల స్థలంలో 0.40 సెంట్లను తన పెద్ద కుమారుడైన ఎం. రామమూర్తికి 2009లో గిఫ్ట్ డీడ్ ద్వారా ఇచ్చాను. అయితే, ఆర్థిక స్థోమత లేక వారు అక్కడ నిర్మాణాలు చేపట్టకపోవడాన్ని ఆసరాగా తీసుకొని... చిత్తూరుకు చెందిన వినాయగం, షంశీఆలీ, యాగంశెట్టి, అనిత అనే వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించి కడగాళ్ళు వేశారు.అనిత అనే మహిళ రాజకీయ నాయకుల అండదండలతో తమ స్థలంలో అక్రమంగా ఇల్లు కూడా నిర్మించుకోవడమే కాకుండా, భూమి యజమానులైన తమను ఆ స్థలంలోకి రానీయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ ఆక్రమణపై 2025 నవంబర్ 02న చిత్తూరు జిల్లా కలెక్టర్‌కి గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయగా, వారు విచారణ నిమిత్తం తహశీల్దార్‌కు పంపారు. అయితే ఇప్పటివరకు తహశీల్దార్ ఎలాంటి పరిష్కారం చూపలేదు. కావున వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి గ్రామానికి చెందిన సురేష్ విజ్ఞప్తి చేస్తూ.. జంతులూరు పొలంలోని సర్వే నంబర్ 62లో ఉన్న 6.13 ఎకరాల భూమి తన తండ్రి నడిపి సుంకన్నకి చెందినదని తెలిపారు. తండ్రి మరణాంతరం వారసత్వంగా ఆ భూమిని తన పేరిట రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డులలో నమోదు చేయించుకున్నానన్నారు. అయితే, తనకు తెలియకుండానే ఆన్‌లైన్ రికార్డుల నుండి తన పేరును అక్రమంగా తొలగించి, ఆ స్థానంలో ఆనంద్ అనే వ్యక్తి పేరును ఎక్కించారు. ఈ అన్యాయంపై తగిన రీతిలో స్పందించాలని, తన పేరును తిరిగి ఆన్‌లైన్‌లో చేర్చాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగి వేడుకున్నా అధికారులు పట్టించుకోలేదు. వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తిరుపతి జిల్లా తడ మండలం జడా కండ్రిగ గ్రామానికి చెందిన దేవసేన విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని సర్వే నంబర్ 103/1ఏ (ఖాతా నంబర్ 598) లో ఉన్న భూమికి సంబంధించి ఆర్ఓఆర్ 1బీ, అడంగళ్, పాత రెవెన్యూ రికార్డులలో తమ కుటుంబం పేరే నమోదై ఉందని తెలిపారు. 2023 వరకు కూడా ఈ వివరాలు వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో స్పష్టంగా కనిపించాయి. అయితే, ఎలాంటి స్పష్టమైన సమాచారం లేకుండానే ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ రికార్డుల నుంచి తమ భూమి వివరాలు మాయమయ్యాయి. దీనిపై 18-06-2026న ఆర్ఓఆర్ అప్పీల్ దాఖలు చేసినప్పటికీ, నిర్దేశిత గడువు ముగిసినా అధికారులు ఎటువంటి విచారణ జరపలేదు, తగిన కారణాలతో కూడిన ఉత్తర్వులు కూడా జారీ చేయలేదు. తగు చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బంగారు చిన్నేపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి విజ్ఞప్తి చేస్తూ..కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామంలోని సర్వే నంబర్ 81లోని 14.20 సెంట్ల భూమి తన హక్కు అనుభవంలో ఉందని తెలిపారు. ఈ భూమిపై కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించగా... పెనుకొండ కోర్టు, పుట్టపర్తి కోర్టు, ఆర్డీవో, హైకోర్టులు కూడా తగిన ఉత్తర్వులు ఇస్తూ భూమిపై తనకే హక్కు ఉందని స్పష్టం చేశాయి. ఈ భూమిని అమ్ముకోవడానికి హైకోర్టుతో పాటు బుక్కపట్నం రిజిస్ట్రార్ కార్యాలయం నుండి అనుమతులు కూడా ఉన్నాయి. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ, కొత్తచెరువు తహసీల్దార్ తనకు సంబంధించిన 1బీ (రెవెన్యూ రికార్డు) ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. తగు చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన నక్కా స్వర్ణలత విజ్ఞప్తి చేస్తూ..ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్.ఎస్. నంబర్ 199/8బీ లోని 0.44 ఎకరాల మెరక భూమి రెవెన్యూ అడంగల్‌లో తన తండ్రి పాలడుగు కోటేశ్వరరావు పేరిట నమోదు అయి ఉందని తెలిపారు. 08-06-2022న ఈ భూమిని తన కుమారుడు నక్కా జగదీష్ పేరిట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దఖలు పత్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. అయితే, తన తండ్రి కోటేశ్వరరావు అనుమతి లేకుండానే, తమ దగ్గరి బంధువు ఒకరు వారి కుమార్తె పేరిట అక్రమంగా దొంగ రిజిస్ట్రేషన్ మార్పించారు. మరోవైపు వి.ఆర్.ఓ అనుమతి లేకుండానే మరో వ్యక్తి సదరు భూమిలో అక్రమంగా చెరువు తవ్వి, అందులోని మట్టిని తన స్వంత ఇంటి నిర్మాణానికి తరలించారు. కావున వారిపై చర్యలు తీసుకొని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.


అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన చిట్టంరెడ్డి కవిత విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్ 823 లో ఉన్న ప్లాట్ నంబర్లు 31, 34 లలోని 5 సెంట్ల స్థలంలో నివాసానికి సంబంధించి తాము నిర్మించుకున్న బాత్‌రూమ్, వంటగదిలను ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా జేసీబీతో పడగొట్టారని తెలిపారు. వీరంతా కలిసి తమ స్థలాన్ని అక్రమంగా కబ్జా చేశారు. ఈ దౌర్జన్యం జరుగుతున్న సమయంలో వి.ఆర్.ఓ దృష్టికి తీసుకెళ్లినా, ఆధారాలు చూపించినా స్పందించలేదని.. తదనంతరం తహశీల్దార్, జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# కొత్త ఎక్సైజ్ పాలసీపై మంత్రుల కమిటీ కసరత్తు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ గడువు సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, తదుపరి రిటైల్ ఎక్సైజ్ పాలసీ రూపకల్పనపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో గురువారం మంత్రుల సబ్ కమిటీ సమావేశమై విస్తృతంగా చర్చించింది. గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

2024-26 రిటైల్ ఎక్సైజ్ పాలసీ అమలు ద్వారా జూలై 2026 వరకు వచ్చిన ఫలితాలపై అధికారులు మంత్రుల బృందానికి సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న పాలసీ సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో, ఆ తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీకి సంబంధించి రూపొందించిన వివిధ నమూనాలను కూడా సమావేశంలో అధికారులు మంత్రుల బృందం ముందు ఉంచారు. కొత్త పాలసీ రూపకల్పన కోసం వివిధ వర్గాల నుంచి అందిన సూచనలు, అభిప్రాయాలను కూడా వివరించారు.




ప్రతిపాదించిన వివిధ నమూనాలపై మంత్రుల బృందం సుదీర్ఘంగా చర్చించింది. అందుబాటులో ఉన్న సమాచారం, గణాంకాలను పరిశీలించిన అనంతరం ప్రతిపాదిత నమూనాలను మరింతగా సవరించి, సంబంధిత పూర్తి వివరాలు, ఆధారిత గణాంకాలతో మరోసారి సమర్పించాలని అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది.

ప్రస్తుత ఎక్సైజ్ పాలసీ పనితీరు, ఇప్పటివరకు వచ్చిన ఫలితాలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 30 తర్వాత అమలు చేయాల్సిన కొత్త రిటైల్ ఎక్సైజ్ పాలసీని రూపొందించే ప్రక్రియలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించారు.

ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. రెవెన్యూ (ఎక్సైజ్) శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, ఎక్సైజ్ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ..

# అక్రమార్కులకు ఆలవాలం

- మంత్రి కందుల దుర్గేష్ ధ్వజం
- జగన్ అరాచక పాలనకు, పాపాలకు సిట్ నివేదిక చెంపపెట్టు
- పారదర్శకంగా మెగా డీఎస్సీలో ఉద్యోగాల భర్తీ
- అక్టోబర్‌లో మరో డీఎస్సీ నోటిఫికేషన్
- వైసీపీ మాయమాటలు నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు
- వైసీపీ నేతలకు దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి డీఎస్సీపై చర్చించండి

నిడదవోలు (చైతన్యరథం): వైసీపీ ఐదేళ్ల హయాంలో ఏపీపీఎస్సీ అంటే 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్' లా కాకుండా 'అక్రమార్కులకు ఆలవాలమైన కమిషన్'గా మారిపోయిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల స్కామ్, కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన 'మెగా డీఎస్సీ' తదితర అంశాలపై మీడియాకు సుదీర్ఘ వివరణ ఇచ్చారు.

### వైసీపీ అక్రమాలు బట్టబయలు

ఏపీపీఎస్సీ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా మూడుసార్లు మూల్యాంకనం చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటూ వైసీపీ నాయకులు ఉద్యోగాలు అమ్ముకున్నారని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు. 132 పేజీల సిట్ నివేదిక వైసీపీ అరాచకాలకు, అవినీతికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిందన్నారు. కరోనా మహమ్మారిని సాకుగా చూపి నాటి ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల పరీక్షా పత్రాలను నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా డిజిటల్ మూల్యాంకనం చేశారని.. అసలు ఈ డిజిటల్ మూల్యాంకన డ్రామాకు అనుమతి ఇచ్చింది ఎవరో వైసీపీ నేతలు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. డిజిటల్ మూల్యాంకనంపై హైకోర్టు మొట్టికాయలు వేయడంతో మంగళగిరి దగ్గర ఉన్న 'హాయ్ ల్యాండ్' లో మాన్యువల్ మూల్యాంకనం అంటూ మరో డ్రామా ఆడారు. వాస్తవానికి అక్కడ మూల్యాంకన ప్రక్రియ చేసి




కూడా చేయలేదని కోర్టుకు వచ్చి అబద్ధాలు చెప్పి మరోసారి న్యాయస్థానం చేతిలో మొట్టికాయలు తిన్న ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అన్నారు. ముచ్చటగా మూడోసారి మాన్యువల్ మూల్యాంకనం పేరుతో చీఫ్ ఎగ్జామినర్లు జవాబుపత్రాల్లో ఇష్టానుసారం మార్కులు మార్చేయడం, దిద్దడం, అడ్డగోలుగా తమకు కావాల్సిన వారికి మార్కులు పెంచేసి, మిగతా వారికి తగ్గించేశారని ధ్వజమెత్తారు. ఏపీపీఎస్సీ ఫలితాల అక్రమాలపై పూర్తిస్థాయిలో బాధితులకు న్యాయం జరగాల్సిందే అని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

### చట్టవిరుద్ధంగా రీవాల్యుయేషన్

ఏపీపీఎస్సీ నిబంధనల ప్రకారం జవాబు పత్రాలకు 'రీవాల్యుయేషన్' చేసే వెసులుబాటే లేదు, కేవలం మార్కుల రీ-కౌంటింగ్‌కు మాత్రమే అనుమతి ఉంటుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా మూడుసార్లు రీవాల్యుయేషన్ చేసి తమకు కావలసిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టారని మంత్రి దుర్గేష్ ఫైర్ అయ్యారు. ఫోరెన్సిక్ పరీక్షలకు పంపిన జవాబు పత్రాలలో ఏకంగా 95 శాతం పేపర్లలో వైట్‌నర్లు రుద్ది, వేర్వేరు రంగుల ఇంకు పెన్నులతో మార్కులు మార్చి ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడినట్లు సిట్ తేల్చిందని స్పష్టం చేశారు.

అంతేగాక నిబంధనల ప్రకారం అత్యుత్తమ విద్యావేత్తలు, అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో పేపర్లు దిద్దించాల్సి ఉండగా... నాటి ప్రభుత్వం పదో తరగతి, ఇంటర్ చదివిన సెక్యూరిటీ గార్డులు, ఎలక్ట్రీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో మూల్యాంకనం చేయించి తీవ్రమైన నేరానికి పాల్పడిందన్నారు. ప్రత్యేకించి నాటి ఏపీపీఎస్సీ కార్యదర్శి, ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు నామినేషన్ పద్ధతిలో ఎలాంటి టెండర్లు లేకుండా తన మిత్రుడి కంపెనీకే ఈ ప్రక్రియ బాధ్యతలు కట్టబెట్టడం అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు.

### అర్హులైన అభ్యర్థులకు అన్యాయం

డిజిటల్ మూల్యాంకనంలో అర్హత సాధించిన 326 మంది అభ్యర్థులు... మాన్యువల్ మూల్యాంకనానికి వచ్చేసరికి 202 కి ఎలా పడిపోయారో వైసీపీ నేతలు జవాబు చెప్పాలని మంత్రి దుర్గేష్ నిలదీశారు. స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర సీసీ కెమెరాలు ఆపేసి, యాక్సెస్ రిజిస్టర్లు లేకుండా చేసి, పేపర్లు దిద్దే చోట ఫోన్లలో మాట్లాడుకుంటూ దొంగచాటుగా వ్యవహరించారని మండిపడ్డారు. ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థి చేతే మెయిన్స్ పేపర్లు దిద్దించిన ఘనత ఒక్క జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఇద్దరు ముగ్గురు పరిశీలకులతో దిద్దించాల్సిన ప్రక్రియను గాలికొదిలేసి, మూల్యాంకనకర్తలు వేసిన మార్కులకు... తుది ఫలితాల డేటాబేస్ లో ప్రత్యక్షమైన మార్కులకు హద్దు అదుపు లేకుండా తారుమారు చేశారని తద్వారా అర్హులైన అభ్యర్థులకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. నియామక ప్రక్రియ ముగిసే వరకు పరీక్షల్లో జరిగే ప్రతి చిన్న మార్పును అభ్యర్థులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలి. కానీ వైసీపీ ప్రభుత్వం ఏ ఒక్క మార్పుకు స్పష్టమైన కారణం చూపించకుండా అభ్యర్థులను చీకట్లో ఉంచి చీకటి రాజకీయం నడిపిందన్నారు. గ్రాస్ లెవెల్లో నిర్లక్ష్యం, నిధులు/అధికార దుర్వినియోగం స్పష్టంగా జరిగిందని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు.

### ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ

గత ప్రభుత్వం 'మెగా డీఎస్సీ' అని ప్రకటనలు ఇచ్చి నిరుద్యోగులను దగా చేస్తే... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే చేశారని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు.

రికార్డు స్థాయిలో కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసి అభ్యర్థుల కలలను నెరవేర్చామన్నారు. నిబంధనలకు అనుగుణంగా నూటికి నూరు శాతం పారదర్శకంగా స్పోర్ట్స్ కోటా భర్తీ ప్రక్రియ ముగిసిందన్నారు. ప్రజాప్రయోజన వ్యాజ్యం అనేది చాలా విలువైన సాధనం, దానిని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తే పిల్ ఉద్దేశమే దెబ్బతింటుందని కోర్టు తెలిపినా కూడా వైసీపీ వైఖరిలో మార్పు రాకపోవడం శోచనీయం అన్నారు.

### అక్టోబర్‌లో మరో డీఎస్సీ నోటిఫికేషన్

డీఎస్సీలో ఉద్యోగం రాని అభ్యర్థులు నిరాశ పడవద్దని, అక్టోబర్‌లో మరో డీఎస్సీ నోటిఫికేషన్ నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని మంత్రి దుర్గేష్ తెలిపారు. బాగా చదివే వారికి మరో మంచి అవకాశం దక్కుతుందని భరోసా ఇచ్చారు. దయచేసి వైసీపీ నేతల విషప్రచారాలు నమ్మకుండా శ్రద్ధగా చదువుకొని పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. అసలు గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ అయినా వేశారా? వేయకపోవడానికి గల కారణాలేంటో చెప్పగలరా? అసలు ఏనాడూ డీఎస్సీ వేయని మీరు... మేము అత్యంత పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తే సీబీఐ విచారణ అడగటం విడ్డూరంగా ఉందని అన్నారు.

### అసెంబ్లీకి రాకుండా దొంగ నాటకాలు

ప్రభుత్వ జీతాలు, సౌకర్యాలు అనుభవిస్తూ శాసనసభకు వచ్చి ప్రజల తరపున మాట్లాడే ధైర్యం వైసీపీ నేతలకు ఎందుకు లేదని, దమ్ముంటే అసెంబ్లీ వేదికగా డీఎస్సీపై, ప్రజా సమస్యలపై చర్చకు రావాలని మంత్రి కందుల దుర్గేష్ సవాల్ విసిరారు. ఉండ్రాజవరం మండల వైసీపీ నాయకులు ఈ నిజాలు తెలుసుకోకుండా డీఎస్సీపై ర్యాలీలు చేయడం సిగ్గుచేటని, గతంలో తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల వద్ద ధర్నాలు చేస్తే హౌస్ అరెస్టులు చేయించిన చరిత్ర వైసీపీదని గుర్తుచేశారు.

### మంత్రి లోకేష్ రాజీనామా డిమాండ్‌పై మండిపాటు

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చి వేలాది ఉద్యోగాలు ఇస్తుంటే... వైసీపీ చేసిన పాపాలకు లోకేష్ రాజీనామా చేయాలనడం గురివింద గింజ సామెతను గుర్తుచేస్తోందన్నారు. సీబీఐ విచారణ కోరే అర్హత వైసీపీకి అసలే లేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీల నేతృత్వంలో రాష్ట్రంలో "డబల్ ఇంజిన్ సర్కార్" వేగంగా అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని, నిరుద్యోగులు వైసీపీ విషప్రచారాన్ని నమ్మవద్దని మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి చేశారు.

### ఆస్తుల విధ్వంసమే ధ్యేయమా?

చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించని వైసీపీ నాయకులు, జగన్ మోహన్ రెడ్డి ... రోడ్లమీదికొచ్చి బలప్రదర్శనలు చేయడం, ఆస్తులను విధ్వంసం చేయడం, వ్యాపారాలు చేసుకునే వారి వ్యాపారాలను నాశనం చేయడమే యాత్రల ఉద్దేశంగా పెట్టుకున్నారని మంత్రి దుర్గేష్ ఫైర్ అయ్యారు. ప్రజలు మీ నాటకాలను చూస్తూ ఊరుకోరు, గతంలో 11 సీట్లకు పరిమితమైన మిమ్మల్ని త్వరలోనే సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయడం ఖాయం అని తెలిపారు.

# 18వ రోజూ విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

- 3.25 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- రోజుకు 3 లక్షలకు పైగా..మొత్తం 53.87 లక్షల కుటుంబాలతో మమేకం
- కూటమి రెండేళ్ల అభివృద్ధి-సంక్షేమాన్ని వివరిస్తూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న పార్టీ శ్రేణులు
- జోనల్ ఇన్‌ఛార్జిలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సమీక్ష

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంతో పాటు, ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 18వ రోజు గురువారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగింది. ఇప్పటివరకు 53.87 లక్షల



కుటుంబాలను నేరుగా కలిసిన టీడీపీ శ్రేణులు.. ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తున్నారు.

ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజల నుంచి అభిప్రాయాలు, స్థానిక సమస్యలను తెలుసుకుంటూ వాటిని సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారు. 18వ రోజు కూడా రాష్ట్రవ్యాప్తంగా 3.25 లక్షల ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన 18 రోజుల్లో మొత్తం 53.87 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు.

ప్రతిరోజూ మూడు లక్షలకు పైగా కుటుంబాలతో మమేకమవుతూ.. కార్యక్రమాన్ని వేగవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ద్వారా ఆయా వర్గాలకు అందుతున్న ప్రయోజనాలను వివరించి, ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించడంతో పాటు ప్రజల మాటను ప్రభుత్వానికి చేరవేసే వారధిగా 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు కొనసాగిస్తున్నారు.

కార్యక్రమ నిర్వహణ తీరుపై జోనల్ ఇన్‌ఛార్జీలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉత్తమ పనితీరు కనబరుస్తున్న నియోజకవర్గాల నాయకులను ఆయన అభినందించారు. ఇంటింటి పర్యటనలను కేవలం ప్రభుత్వ పథకాల వివరాలను వివరించేందుకే పరిమితం చేయకుండా.. ప్రజల సమస్యలు, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, రైతులకు అందుతున్న ప్రభుత్వ సహకారం, యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ప్రజలతో నేరుగా మమేకమై చర్చించాలని సూచించారు.

# పదవులు కాదు.. ప్రజల విశ్వాసమే అసలైన ఆస్తి

- అదే ఎమ్మెల్యే కన్నా సంపాదించుకున్న తరగని సంపద
- నియోజకవర్గాలు మారాయి, కాలం మారింది.. కానీ ఆయనపై ప్రజల అభిమానం మారలేదు
- ఐదు దశాబ్దాల ప్రజాజీవితమే అతిపెద్ద రాజకీయ విశ్వవిద్యాలయం
- యువ రాజకీయ నాయకత్వానికి కన్నా లక్ష్మీనారాయణ జీవితం ఒక స్ఫూర్తి
- రాజకీయ స్వర్ణోత్సవ సంబరాల్లో మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు (చైతన్యరథం): సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఐదు దశాబ్దాల పాటు ప్రజల మధ్యే ఉంటూ వారి విశ్వాసాన్ని, అభిమానాన్ని నిలబెట్టుకోవడం సాధారణ విషయం కాదని, సీనియర్ నాయకుడు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ జీవితం నేటి యువ నాయకత్వానికి ఒక స్ఫూర్తిదాయక పాఠమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరులో గురువారం జరిగిన కన్నా లక్ష్మీనారాయణ 50 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం – రాజకీయ స్వర్ణోత్సవ సంబరాల్లో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు ఆయనకు తన తరఫున, కూటమి పార్టీల తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానం అంటే సాధారణ విషయం కాదన్నారు. ఒక ఎన్నిక గెలవడం గొప్ప విషయం కావచ్చు. కానీ ఐదు దశాబ్దాల పాటు ప్రజల మధ్య ఉండి, వారి విశ్వాసాన్ని, అభిమానాన్ని నిలబెట్టుకోవడం అసాధారణమైన విషయం. విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన కన్నా



లక్ష్మీనారాయణ ప్రయాణం గుంటూరు జిల్లా యూత్ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించే స్థాయికి ఎదిగిందని కొనియాడారు.

1989, 1994, 1999, 2004లో పెదకూరపాడు నుంచి, 2009లో గుంటూరు వెస్ట్ నుంచి, 2024లో సత్తెనపల్లి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం కన్నా లక్ష్మీనారాయణపై ప్రజలకు ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గాలు మారాయి... కాలం మారింది... రాజకీయ పరిస్థితులు మారాయి... కానీ కన్నాపై ప్రజల అభిమానం మాత్రం మారలేదు. అదే ఆయన నిజమైన రాజకీయ బలం అని అచ్చెన్నాయుడు అన్నారు. మంత్రిగా పరిశ్రమలు, వాణిజ్యం, ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్, గృహ నిర్మాణం, వ్యవసాయం వంటి కీలక శాఖలను నిర్వహించి కన్నా లక్ష్మీనారాయణ తనదైన ముద్ర వేశారని తెలిపారు. 2018–2020 మధ్య రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కూడా పార్టీకి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. రాజకీయాల్లో ఎన్నో పదవులు నిర్వహించినప్పటికీ ప్రజలతో ఉన్న ఆత్మీయ అనుబంధమే కన్నా లక్ష్మీనారాయణను ప్రత్యేకమైన నాయకుడిగా నిలబెట్టిందన్నారు.

కన్నా రాజకీయ జీవితాన్ని చూస్తే ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. రాజకీయమంటే పదవి కాదు... బాధ్యత. రాజకీయమంటే అధికారం కాదు... ప్రజాసేవ. రాజకీయమంటే ఐదేళ్ల ప్రయాణం కాదు... జీవితకాల నిబద్ధత. ఆయన సంపాదించుకున్న అసలైన ఆస్తి పదవులు కాదు... ప్రజల విశ్వాసం, కార్యకర్తల అభిమానం, ప్రజలతో ఏర్పడిన ఆత్మీయ బంధం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ స్వర్ణోత్సవం ఒక వ్యక్తికి సంబంధించిన వేడుక మాత్రమే కాదని, ప్రజాజీవితంలోకి రావాలనుకునే ప్రతి యువ నాయకుడికి ఆయన ప్రస్థానం ఒక స్ఫూర్తి అని అన్నారు. ఐదు దశాబ్దాల ప్రజాజీవితమే అతిపెద్ద రాజకీయ విశ్వవిద్యాలయం. మీరు 50 ఏళ్ల రాజకీయ మైలురాయిని చేరుకున్నారు. కానీ ఇది ముగింపు కాదు... మరో కొత్త అధ్యాయానికి ప్రారంభం కావాలి. మీ అనుభవం రాష్ట్రానికి, మీ రాజకీయ పరిజ్ఞానం యువ నాయకత్వానికి మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు. కన్నా లక్ష్మీనారాయణ నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండి, మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. జన నాయకుడు కన్నా 50 ఏళ్ల రాజకీయ స్వర్ణోత్సవ ప్రస్థానానికి హృదయపూర్వక అభినందనలు. ఆయన ప్రజాసేవా ప్రస్థానం చిరస్థాయిగా కొనసాగాలి" అంటూ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాడు నెత్తుటి రాజకీయం.. నేడు నీతి శతకాలు

- ఐదేళ్ల పాలనలో బీసీలపై సాగించిన దమనకాండ మరిచావా?
- అచ్చెన్నాయుడు, కొల్లు అరెస్ట్ సమయంలో బీసీలు గుర్తుకు రాలేదా
- జగన్‌పై ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మండిపాటు
- చంద్రబాబు హయాంలో నేరస్థులపై చట్టప్రకారం చర్యలుంటాయని స్పష్టీకరణ



అమరావతి (చైతన్యరథం): వైసీపీ హయాంలో అర్థరాత్రి గోడ దూకి అచ్చెన్నాయుడును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు నీ చట్టం, రాజ్యాంగము ఏమయ్యాయని జగన్ ను రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాపులు ప్రశ్నించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాసనభ్యులు కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ... ఆనాడు అచ్చెన్నాయుడు బీసీ నాయకుడిగా కనిపించలేదా.. అర్థరాత్రి అరెస్టు చేయడం అక్రమమని జగన్ కు తెలియదా అని నిలదీశారు. అచ్చెన్నాయుడు ఆపరేషన్ చేయించుకొని ఇంటిలో ఉండగా.. ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తిని వందల కిలోమీటర్లు వాహనంలో తరలించడం అన్యాయం కాదా? అప్పుడు అచ్చెన్నాయుడుకు ఏమైనా జరిగివుంటే ఎవరు బాధ్యత వహించేవారు? నేడు బీసీలను వేధిస్తున్నట్లుగా అమాయకంగా మాట్లాడుతున్నావు. తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులంతా జగన్ వేధింపులకు గురైనవారే. కొల్లు రవీంద్రను హత్యా నేరం కింద రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారు. మా సీనియర్ నాయకుడు బీసీల్లో అత్యంత గౌరవంగా బతుకుతున్న యనమల రామకృష్ణుడు పై కేసు పెట్టించలేదా? చివరకు నాపై కూడా కేసు పెట్టించారు. మేమంతా బీసీలమని తెలియదా? జగన్ ఐదేళ్ల పాలనలో ఎవర్నీ వదలకుండా రాజకీయాల్లో ఉన్నా లేకున్నా దాదాపు 280 మందిని చంపించారు. నెత్తుటికూడుతో రాజకీయం చేసిన నీవా ఈ రోజు రాజ్యాంగం, ప్రజల హక్కులు, ఎమ్మెల్యేల గురించి మాట్లాడుతున్నావని జగన్‌పై ఎమ్మెల్యే కాల్వ మండిపడ్డారు.

**దళిత మహిళపై అరాచకం**

ఐదేళ్ల పాలనలో అడుగడుగునా అరాచకాలు సృష్టించారు. నేరగాళ్లను ప్రోత్సహించారు. సామాన్యుడు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితులు కల్పించారు. ప్రజలు తిరగబడతారనే భయంతో పరదాల మాటున తిరిగిన రోజులను జగన్ గుర్తుకు తెచ్చుకోవాలి. పోలీసులు లేనిదే బయటికి రాని వ్యక్తివి నీవు. జగన్ కు మించిన పిరికివాడు, దుర్మార్గులు ఎవరూ లేరు. అన్నీ బాగుంటే నా అంతటివారు లేరని విర్రవీగుతావు.. లేకపోతే బయటికి రావడానికే భయపడతావు. జగన్ కట్టుకొని తిరిగిన పరదాల ఖర్చుతో ఒక జిల్లాను బాగు చేయొచ్చు. నాయకుడనేవాడు బాధితుడిని పరామర్శిస్తారు గానీ.. నీలా నేరస్థులను పరామర్శించడు. బాధితులను పరామర్శించడం రాజకీయాల్లో ఆనవాయితీ. ఆలూరులో నేలకల్లు గ్రామానికి నేను వెళ్లగా బాధితురాలు నాతో మాట్లాడుతూ.. నేను అవమానానికి గురయ్యాను, నా బట్టలు చింపేశారు, నా పొత్తికడుపుపై బూటు కాలితో తన్నాడు, నన్ను అనేక దుర్భాషలాడాడు. నేను ఎలా తలెత్తుకొని తిరగాలని ఆ దళిత మహిళ వేసిన ప్రశ్నకు జగన్ సిగ్గుపడాలి. ఒక బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే ఓ దళిత యువత యువతిపట్ల వ్యవహరించిన తీరును విని నాకు బాధేసింది. ఆ మహిళ పొత్తికడుపుపై కాలితో తన్నినా, ఆమెను వివస్త్రను చేయడానికి ప్రయత్నించినా జగన్ అక్కున చేర్చుకుంటాడు, ఆదరిస్తాడనే ధైర్యంతోనే ఆయన పార్టీ మనుషులు ఇలాంటి అఘాయిత్యాలకు తెగబడుతున్నారని ఎమ్మెల్యే కాల్వ ధ్వజయెత్తారు.

**నేరగాళ్లపై ఉక్కుపాదం**

ఇది చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తున్న ప్రభుత్వం. ఆడబిడ్డకు ఎవరు అన్యాయం చేసినా సహించరు. ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడినా సహించే ప్రసక్తే ఉండదు. కూటమి ప్రభుత్వంలో శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యమిస్తాం. నేరానికి కులమంటూ ఉండదు. జగన్ చుట్టూ ఉన్నవారంతా నేరగాళ్లే. నేరం చేసేవాడికి కులాన్ని అంటగట్టడం దగుల్బాజీ రాజకీయం. మూడు తరాలుగా రాజకీయాల్లో ముఠా కక్షలను ప్రోత్సహించింది వైఎస్ కుటుంబమే. కక్షల కుంపట్లో చలికాచుకునే మనస్తత్వం జగన్ ది. మీ రాజకీయ దాహానికి, మీ అధికార దర్పానికి మీ నేర సామ్రాజ్య విస్తరణకు అనేక బీసీ, మైనార్టీ, దళిత కుటుంబాలు బలయ్యాయి. భర్తలను, కొడుకులను, తండ్రులను పోగొట్టుకొని అనాధలైనవారు అనేకమంది ఉన్నారు. కూటమి ప్రభుత్వంపై జగన్ ఇలాంటి అభాండాలు వేస్తే రెడ్ బుక్ రాజ్యాంగమని అవాకులు చవాకులు పేలిస్తే సహించేది లేదు. జగన్ కుటుంబాల బాధితులు అనేకమంది ఉన్నారు. ఈ బాధితులతో తాడేపల్లి ప్యాలెస్ ఎదుట ప్రదర్శన చేస్తాను. కొన్ని వందల కుటుంబాలు నా వెంట వస్తాయి. వైఎస్ కుటుంబ బాధితులు కొన్ని వేలమంది ఉన్నారు. వీరందరూ నా వెనుక నడవడానికి సిద్ధంగా ఉన్నారు. కాబట్టి జగన్ ఖబడ్దార్. లేని పోని అసత్యాలు వల్లెవేసినా, ప్రభుత్వంపై అభాండాలు వేసినా ఊరుకునేదిలేదు. ప్రజాభిమానాన్ని కోల్పోయి ఇలాంటి చౌకబారు రాజకీయాలకు దిగొద్దు. ప్రజలు గమనిస్తున్నారు. చట్టానికి కొన్ని పరిమితులుంటాయి. రాజ్యాంగం నిర్దేశించిన చక్రబంధంలో ప్రభుత్వం పనిచేస్తుంది. నేరాలు చేసేవారికి నియమాలు, నిబంధనలుండవు.. యథేచ్ఛగా విచ్చలవిడిగా వ్యవహరిస్తారు. వారిని కంట్రోల్ చేసే శక్తి చంద్రబాబుకు ఉంది. నేడు కూటమి పాలనలో ఎవరు నేరం చేసినా జైలుపాలవుతున్నారు. శిక్షలు పడడంలో ఆలస్యం కావచ్చేమోగానీ శిక్ష పడక మాత్రం తప్పదు. ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ రాజ్యాంగాన్ని అనుసరించి నడుస్తోంది. విచ్చలవిడి తనంతో, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నవారందరినీ ప్రజాక్షేత్రంలో వారి పాపాలను ఎండగట్టాల్సిన బాధ్యత ప్రతి ప్రజాస్వామ్యవాదిపై ఉంది. చట్టాన్ని, ధర్మాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి, ఆయన తమ్ముడు, వారి మూక అందరు వెళ్లి సృష్టించిన బీభత్సం అందరికీ తెలుసు. నా భర్త లేదు, నా ఇంటిలోకి ఎందుకొస్తారని బాధితురాలు అంటే తోసేసి, ఇంటిలోకి వెళ్లి బీభత్సం చేసిన దృశ్యాలు(చిత్రాలు) నేను చూశాను. టీవీలు పగులగొట్టారు. వస్తువులన్నీ చిందర వందర చేశారు. ఇంతటి బీభత్సం ఒక శాసనసభ్యుడు చేయదగ్గది కాదు. చేశాడు కాబట్టే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకున్నారు. 11 మంది శాసనసభ్యులున్నారు. వారిపై మేము కక్షసాధింపు చర్యలు చేపట్టామా.. లేదుకదా! అక్రమ కేసులు పెట్టే సమస్యేలేదు. తప్పు చేస్తే శిక్ష తప్పదు. ఎమ్మెల్యేని అరెస్టు చేయడానికి కొన్ని ప్రొసెజర్స్ ఉంటాయి. ప్రొసెజర్ ప్రకారమే ప్రభుత్వం చేసింది. చట్ట వ్యతిరేకంగా ప్రభుత్వం ఏ కార్యక్రమాలను చంద్రబాబునాయుడు ప్రభుత్వం చేయదని ఎమ్మెల్యే కాల్వ స్పష్టం చేశారు.


**అసెంబ్లీకి రాకుండా జీతాలా: చీఫ్‌విప్ జీవీ**

ఛీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ 17 వ తేదీ నుండి నాలుగు రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయన్నారు. అనేక ప్రజా సమస్యలు చర్చించబోతున్నాం. జగన్ ప్రజా సమస్యలను గాలికొదిలేశారు. జగన్ ఈసారైన అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలు విన్నవిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం. ప్రజా సమస్యలను అసెంబ్లీలో వినిపిస్తారనే ఉద్దేశంతో ప్రజలు వైసీపీకి చెందిన 11 మందిని గెలిపించారు. వైసీపీ నాయకులు వారు చేసిన స్వయంకృతాపరాధం, దోపిడి, అరాచక పాలన వల్ల 11 సీట్లకు వచ్చారు. వీరికి బాధ్యత లేదా? వీరు ఎందుకు అసెంబ్లీకి రారు? జీతాలు తీసుకొని కూడా అసెంబ్లీకి రావడంలేదు. ఇది సిగ్గుచేటు. దమ్ముంటే అసెంబ్లీకి రావాలి, చర్చ జరపాలి. ప్రజలు గుణపాఠం చెప్పారు. మళ్లీ మళ్లీ ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తే ఆ 11 సీట్లు కూడా రావు. జగన్ ఐదేళ్లలో ఒక్క టీచర్ ఉద్యోగం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా ఉపాధ్యాయ నియామకాలు చేస్తే వైసీపీ నాయకులు దానిపై దుష్ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నాయకులు దుర్మార్గాలు మానాలి. అసెంబ్లీలో కూటమి ఎమ్మెల్యేలందరూ సమర్థవంతంగా వ్యవహరిస్తూ.. ప్రతి ఒక నిమిషం ఎంతో విలువైనదిగా భావిస్తూ నడుచుకుంటారు. అసెంబ్లీ వద్ద అందంగా అలంకరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నాం. అసెంబ్లీ ప్రాంగణం చూడడానికి కూడా ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని అమరావతి రైతులు తదితరులు సద్వినియోగం చేసుకోవాలని ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు.

# లక్షలాది నిరుద్యోగుల కలలతో ఆటలాడిన జగన్

## - ఏపీపీఎస్సీ కుంభకోణంతో వ్యవస్థాగత హత్య చేసిన గొడ్డలి పార్టీ అధినేత -

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అంటే రాష్ట్ర పాలనా వ్యవస్థలో కీలకమైన అధికారులను ఎంపిక చేసే అత్యున్నత వ్యవస్థ. పేద, మధ్యతరహా కుటుంబానికి చెందిన నిరుద్యోగ యువత రాత్రనకా పగలనకా తిండి తిప్పలు మర్చిపోయి, ఏళ్లపాటు పుస్తకాలతో కుస్తీ పట్టి రాసే ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష ఇది. కానీ, గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి 169 గ్రూప్-1 ఉద్యోగాలను తమకు కావలసిన వారికి పంచుకోవడానికి పెద్ద స్కాంకు పాల్పడ్డారని కోర్టుకు సిట్ ఇచ్చిన నివేదికతో తేలిపోయింది. సామాన్యుడికి అర్థమయ్యేలా చెప్పాలంటే.. ఇది కేవలం అధికారుల తప్పు కాదు, పక్కా ప్లాన్ ప్రకారం తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా నిరుద్యోగులకు చేసిన పెద్ద దగా! ఏపీపీఎస్సీ నిబంధనలు పక్కన పెట్టి.. మూడుసార్లు పేపర్లు మూల్యాంకనం చేశారు. ఏపీపీఎస్సీ రూల్స్ ప్రకారం ఒకసారి పేపర్ మూల్యాంకనం చేసిన తరువాత కేవలం మార్కులు సరిగ్గా లెక్కబెట్టారో లేదో మాత్రమే చూడాలి. అంతేకానీ మళ్లీ మొదటి నుంచి పేపర్లు రీ-మూల్యాంకనం చేసి ఏపీపీఎస్సీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. తొలిసారి కంప్యూటర్ల ద్వారా మూల్యాంకనం చేసినట్లు నాటకమాడారు. రెండోసారి, మూడోసారి రహస్యంగా మనుషులతో మళ్లీ మళ్లీ మూల్యాంకనం చేయించారు. నిజాయితీగా రాసి అర్హత సాధించిన పేద, మధ్య తరగతి నిరుద్యోగుల ఆశలను చిదిమేసి 169 పోస్టులను ఒక్కొక్కటి లక్షలాది రూపాయలకు వైసీపీ నాయకులు అమ్ముకున్నారు. రూల్స్ అన్నీ పక్కనపడేసి ఝుమోఅస్త్రఅ వీవసఋ అనే ఒక ప్రైవేట్ కంపెనీకి ఈ పేపర్లు దిద్దే కాంట్రాక్ట్ ఇచ్చేశారు. ఏకంగా విజయవాడ-గుంటూరు సమీపంలోని హాయ్‌ల్యాండ్ లో 86 రోజుల పాటు రహస్య క్యాంప్ ఏర్పాటు చేశారు. దీనిపై కోర్టు ప్రశ్నించిన సమయంలో కేవలం ఏర్పాటు చేశామని కోర్టుకు తప్పుడు సమాధానం ఇచ్చారు. ఝుమోఅస్త్రఅ వీవసఋ ప్రైవేట్ కంపెనీకి ఇచ్చిన రూ.1.14 కోట్ల ప్రజల సొమ్ములో ఏకంగా రూ.75 లక్షలు ఎటు పోయాయో కూడా ఆచూకీ లేదు! హైకోర్టుకు సిట్ ఇచ్చిన ఫోరెన్సిక్ రిపోర్టులో పేర్కొన్న సంచలన విషయాలు కేవలం ఆరోపణలు మాత్రమే కాదు, ల్యాబ్ పరీక్షల (జఖీరూ ఫోరెన్సిక్ నివేదిక) ద్వారా ఈ ఆధారాలు పక్కాగా దొరికాయి.




### సంతకాలు లేవు

21 మార్కుల స్లిప్పుల్లో మార్కులు మార్చేశారు, కానీ మార్చిన అధికారి సంతకం లేదు! దొంగ సంతకాలు (ఫోర్జరీ), పేపర్లు దిద్దాల్సిన ప్రొఫెసర్ల సంతకాలను కాపీ చేసి దొంగ సంతకాలు పెట్టారు. ఎవరు ఏ అభ్యర్థి పేపర్ దిద్దుతారో తెలిపే 57 మంది ఎగ్జామినర్ల రహస్య జాబితాను మూల్యాంకనానికి ముందే లీక్ చేశారు.

### వైట్ ఫ్లూయిడ్‌తో మార్కులు మార్చేశారు

61 స్లిప్పులపై మార్కులను పాతవి చెరిపేయడానికి తెల్లటి 'వైట్ ఫ్లూయిడ్' పూసి నచ్చిన మార్కులు రాసుకున్నారు.

### చేతిరాతలు మారిపోయాయి

రెండు కీలకమైన కాగితాల్లో చేతిరాతలు స్పష్టంగా మారిపోయాయని ల్యాబ్ సైంటిస్టులు నిరూపించారు. 452 మంది చదువుకున్న ప్రొఫెసర్లను పక్కనపెట్టి, కేవలం 66 మంది పదోతరగతి, ఇంటర్మీడియట్ చదివిన ఎలక్ట్రీషియన్లు, సెక్యూరిటీ గార్డులు, గుమస్తాలు, గృహిణులను డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జవాబు పత్రాలు దిద్దించారు. గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికైన 165 మందిలో ఏకంగా 160 మంది జవాబు పత్రాలలో మార్కులను సవరించారు.

కరెంట్ అనాలిసిస్

తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

**మంగినపల్లి ఎలీషా (అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్)**

నాటి ఏపీపీఎస్సీ సెక్రటరీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులును ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు (ప్రస్తుతం షరతులతో కూడిన బెయిల్‌పై బయటున్నారు). కానీ అసలు సూత్రధారులు ఇంకా వెనుకే ఉన్నారు. అధికార బలంతో ఏపీపీఎస్సీలాంటి రాజ్యాంగ వ్యవస్థను భ్రష్టు పట్టించి, లక్షలాది మంది యువత కలలను అపహాస్యం చేశాడు నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి. ఇది కేవలం ఏదో చిన్న పరిపాలనా తప్పు కాదు. ఈ కుంభకోణంలో కేవలం కాంట్రాక్టర్లను, అధికారులను మాత్రమే కాకుండా.. వెనుక ఉండి నడిపించిన రాజకీయ సూత్రధారులందరినీ కఠినంగా శిక్షించినప్పుడే ఏపీలో నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుంది!

### వైఎస్ హయాంలో గ్రూప్ -1 ఇంటర్వ్యూ లో అక్రమాలు

2003 తెలుగుదేశం పార్టీ హయాంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. దురదృష్టవశాత్తు 2004 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అప్పుడు ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. అదే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు శాపంగా మారింది. ప్రిలిమినరీ, మెయిన్స్ లో ఎక్కువ మార్కులు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ నిరుద్యోగులకు ఇంటర్వ్యూలో తక్కువ మార్కులు వేసి తక్కువ క్యాడర్ కు పరిమితం చేశారు. తన సామాజిక వర్గానికి ఇంటర్వ్యూలో ఎక్కువ మార్కులు వేసి క్యాడర్ పెంచారు.

### పారదర్శకంగా మెగా డీఎస్సీ

ఎన్నికల మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలు హామీలో భాగంగానే కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలు అత్యంత పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేసింది. వైసీపీ నాయకులు 240కి పైగా కేసులు వేసినా, కేంద్ర మార్గదర్శకాలు ఉన్నా అన్నింటినీ చట్టబద్ధంగా అధిగమించి, ఎలాంటి అడ్డంకులు లేకుండా డీఎస్సీని పూర్తి చేసింది. డీఎస్సీలో పారదర్శకంగా జరిగిన నియామక ప్రక్రియపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ధర్నాలు చేస్తున్న గొడ్డలి పార్టీ నాయకులు గత ప్రభుత్వంలో ఏపీపీఎస్సీలో జరిగిన అవినీతిపై, అక్రమాలపై సమాధానం చెప్పాలి. ఏపీపీఎస్సీ కుంభకోణంలో కోర్టును, యువతను తప్పుదారి పట్టించిన జగన్ రెడ్డికి రాజకీయాల్లో ఉండే నైతిక అర్హత లేదు.

కూటమి రెండేళ్ల పాలనలో రూ.29 లక్షల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఇప్పటికే 7లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించడం జరిగింది. ఈ ఏడాది డిసెంబర్ నెలలో మరో డీఎస్సీ ద్వారా 3వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. కూటమి ప్రభుత్వంలో యువతకు న్యాయం చేస్తూ, ఉద్యోగాలు కల్పిస్తూ ముందుకు సాగుతోంది.

### 9వ తరగతిలోనే 10 క్లాస్ పేపర్ లీకేజీకి పాల్పడిన జగన్

*హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జగన్ రెడ్డి 9వ తరగతి చదువుతున్న రోజుల్లోనే 10వ తరగతి సీబీఎస్ఈ పేపర్ ను లీక్ చేశాడు. ఆ సమయంలో స్కూల్ యాజమాన్యం రోడ్డుపైకి వచ్చి జగన్ కు వ్యతిరేకంగా ధర్నా చేసిన సమయంలో, అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి తన రాజకీయ భవిష్యత్ నాశనం అవుతుందని ఉపాధ్యాయులకు చేతులు జోడించి క్షమాపణ కోరారు. ఈ పేపర్ లీకేజీ వ్యవహారంలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో జగన్ రెడ్డిపై కేసు నమోదైనట్లు మనం అనేక సందర్భాల్లో విన్నాం. జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2022లో కూడా 10వ తరగతి పేపర్ లీక్ జరిగింది. అదే తరహాలోనే ఏపీపీఎస్సీ వ్యవస్థను కూడా భ్రష్టుపట్టించారు.*



# ఏపీపీఎస్సీ పాపాలు మరచి, డీఎస్సీపై జగన్ గగ్గోలు!

తన హయాంలో ఉద్యోగ నియామక వ్యవస్థలో జరిగిన పరిణామాలపై సమాధానం చెప్పాల్సిన వైసీపీ అధినేత జగన్.. నేడు డీఎస్సీ పై ఆరోపణలు చెయ్యడం హాస్యాస్పదం. తన హయాంలో ఏపీపీఎస్సీ నియామకాలు, పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాల వ్యవహారాలు, నియామక ప్రక్రియపై వచ్చిన విమర్శలకు సమాధానం చెప్పకుండా. నేడు డీఎస్సీపై ఆరోపణలు చెయ్యడం ఎంతవరకు సమంజసం? ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన రాజ్యాంగబద్ధ సంస్థ. దాని పై జగన్ ప్రభుత్వ హయాంలో నియామక ప్రక్రియలపై అనేక తీవ్రమైన ఆరోపణలు, వివాదాలు తలెత్తాయి. ఏపీపీఎస్సీ స్కామ్ కు చాలా పకడ్బందీగా స్కెచ్ వేసి అంచెలంచెలుగా అమలుచేశారు. అదెలాగో తెలియాలంటే డే బై డే ఏం జరిగిందో ప్రజలు కూడా తెలుసుకోవాల్సి వుంది. 2018 డిసెంబర్ 31: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 169 గ్రూప్ 1 ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రిలిమ్స్, మెయిన్స్, ఓరల్ టెస్ట్ ద్వారా ఎంపిక చేపట్టింది. అప్పట్లో ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్. మొత్తం 1 లక్షా 14 వేల మంది నుంచి దరఖాస్తులు తీసుకొన్నారు. కానీ ఈ ప్రాసెస్ మొదలయ్యేసరికి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. తరువాత రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. 2019 మే 27- గ్రూప్ 1 ఉద్యోగాలకు 59,200 మంది ప్రిలిమ్స్ రాసారు. 2019 అక్టోబర్: జగన్ చెప్పినట్లు వినే వివాదాస్పద ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు కార్యదర్శి హోదాలో ఏపీపీఎస్సీలోకి రావడం జరిగింది. అట్లాగే ఏపీపీఎస్సీ బోర్డులోకి సభ్యులుగా జగన్ మనుషులు వచ్చారు. అంటే ఇందులో స్కామ్ చేయడానికి వీలుగా పక్కా ప్లాన్ తో జగన్ తన మనుషులతో ఏపీపీఎస్సీని నింపేసారు. అక్కడ నుంచి చైర్మన్ గా ఉన్న ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్ ను పక్కకు తప్పించి, సీతారామాంజనేయులు మిగిలిన బోర్డు సభ్యులతో కలిసి స్కామ్ చెయ్యడానికి తెరతీశారు. ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ.2.50 కోట్లకు, డీఎస్పీ పోస్టును రూ.1.50 కోట్లకు, ఇలా పోస్టులు అమ్ముకోవడం ద్వారా రూ.150 కోట్ల అవినీతికి పాల్పడినట్లు సమాచారం. ఇది పైకి కనిపించేది మాత్రమే. కానీ దీని వెనుక అసలు జగన్‌రెడ్డి దీర్ఘకాలిక, కీలక వ్యూహం కూడా ఉంది. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పోస్టులలో తన వారిని కూర్చోబెడితే రాబోయే రోజుల్లో తాను అధికారంలో ఉన్నా, లేకున్నా తాను నియమించుకున్న వాళ్ళు తన అక్రమాలకు సహకరిస్తారని, అతి కీలకమైన ఉద్యోగాల్లో తన వారిని పెట్టుకోవాలని జగన్ రెడ్డి కుట్ర పన్నడం ఎంత దుర్మార్గమైన చర్య? అలాగే ప్రతిభతో కాకుండా డబ్బులు పెట్టి ఉద్యోగం కొనుక్కొన్న ఆ ఉద్యోగి ఆ తర్వాత ఎలాంటి పాత్ర పోషిస్తాడో ఊహించవచ్చు. ప్రభుత్వ పాలనా వ్యవస్థను పూర్తిగా అవినీతిమయం చేయడం జగన్ దీర్ఘకాలిక వ్యూహం. అందుకోసం అసలైన ప్రతిభకు పాతరేసి లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలకు తూట్లు పొడిచి అతిపెద్ద కుంభకోణానికి పాల్పడినట్లు సమాచారం.

## అతిపెద్ద కుట్ర!

సివిల్ సర్వీసెస్ మాదిరిగా ఈ గ్రూప్ 1 ఉద్యోగాలను పొందాలని విద్యార్థులు జీవితాశయంగా పెట్టుకొంటారు. ఇందుకోసం ఏళ్ల తరబడి ఎంతో కష్టపడి చదువుతారు. తమ బిడ్డలు ఈ ఉద్యోగాల్లో స్థిరపడాలని తల్లిదండ్రులు కూడా ఆర్థిక ఇబ్బందులు వున్నా అప్పులు చేసి వారి పిల్లలకు కోచింగ్‌లు ఇప్పిస్తారు. అటువంటి ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసే ఏపీపీఎస్సీ ఎంతో పవిత్రమైనది. అంతటి పవిత్రమైన ఏపీపీఎస్సీ ని కూడా అపవిత్రం చేసిన పాపాత్ములకు నేటి డీఎస్సీ పై మాట్లాడే హర్హత ఉన్నదా? అసలు ఏపీపీఎస్సీ స్కామ్‌లో మరెవరో కాదు నాటి ప్రభుత్వ అధినేత కాగా, ప్రధాన పాత్రదారి ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులని సమాచారం. ఈ స్కాంలో భాగస్వామ్యం లేకపోయినా ఏపీపీఎస్సీ చైర్మన్‌గా ఉన్న అప్పటి ఐపీఎస్ అధికారి గౌతం సవాంగ్ అన్నీ తెలిసికూడా చూడనట్లు వదిలేసి స్కామ్ జరగడానికి కారణం అయి గ్రూప్ 1 ఉద్యోగాలను పొందటం జీవితాశయంగా పెట్టుకొన్న విద్యార్థుల ఆశలను అడియాసలు చేశారు. నియామక వ్యవస్థ పవిత్రత గురించి నేడు మాట్లాడుతున్న పెద్ద మనిషి తన హయాంలో ఏపీపీఎస్సీపై వచ్చిన ఆరోపణలకు ఏం సమాధానం చెబుతారు? ముందుగా తమ హయాంలో జరిగిన వ్యవహారాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత జగన్ కి లేదా? ప్రభుత్వ వ్యవస్థల్లో తన మనుషులని నింపెందుకు అతిపెద్ద కుట్రకి తెరతీశారు. రాష్ట్ర ప్రభుత్వంలో అత్యున్నత ఉద్యోగ నియామకాలయిన గ్రూప్ 1-డిప్యూటీ కలెక్టర్లు, డిఎస్పీలు, ఆర్టీఓలు, జిల్లా రిజిస్ట్రార్లు వంటి ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని నడిపించే ముఖ్యమైన ఉద్యోగాలు అన్నీ గ్రూప్ 1 కిందికి వస్తాయి. 2018 గ్రూప్-1 నిర్వహణ అంశంలో ఎన్నో అక్రమాలు జరిగినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో నిగ్గు తేల్చింది. అప్పట్లో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అడ్డగోలుగా నిబంధనలు ఉల్లంఘించినట్టు గుర్తించింది. 10,720 పేజీల సమగ్ర నివేదికను తాజాగా హైకోర్టుకు సిట్ సమర్పించింది. గ్రూప్-1 మెయిన్స్ పత్రాల మూల్యాంకనం మూడుసార్లు జరిగితే ప్రతి దశలోనూ అక్రమాలే జరిగాయని స్పష్టం చేసింది. ముఖ్యంగా గ్రూప్ 1 పరీక్షల మూల్యాంకనం, ఫలితాల ప్రక్రియపై వచ్చిన ఫిర్యాదులు చివరకు న్యాయస్థానాల దృష్టికి వెళ్లాయి. గ్రూప్ 1 మూల్యాంకన ప్రక్రియలో మూల్యాంకన ప్రమాణాల్లో అసమానతలు, జవాబు పత్రాల నిర్వహణలో అవకతవకలు, అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వంటి అంశాలను సిట్ తన నివేదికలో వెల్లడించింది.

## ప్రభుత్వాధి నేత చెప్పకుండా మాన్యువల్ మార్చడం సాధ్యమేనా?

2019 నవంబర్ 1: ఏపీపీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్ ఫైనల్ ఆన్సర్ కీని విడుదల చేసింది. 9679 మంది క్వాలిఫై అయ్యారు. వెంటనే ప్రిలిమ్స్ ప్రశ్నాపత్రంలో ప్రశ్నలు తప్పుగా ఉన్నాయని అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. 2020 అక్టోబర్ 22: గ్రూప్ -1 ప్రిలిమ్స్ పేపర్‌లో తప్పులున్నాయన్న వాదనతో ఏపీ హైకోర్టు ఏకీభవించింది. ప్రిలిమ్స్ లో 25 ప్రశ్నలను తీసేసి, మరో 5 ప్రశ్నలకు జవాబులను పరిగణనలోకి తీసుకుని ప్రిలిమ్స్ ఫలితాలను వెల్లడించాలని చెప్పింది. దీంతో 2020 నవంబర్ 2న జరగాల్సిన మెయిన్స్ పరీక్షను ప్రభుత్వం డిసెంబర్‌కు వాయిదా వేసింది. 2020 అక్టోబర్ 29: హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రిలిమ్స్ ఫైనల్ ఫలితాలను కమిషన్ ప్రకటించింది. నిర్దేశిత నిష్పత్తి ప్రకారం వీరిలో 9679 మందిని మెయిన్స్ కు సెలెక్ట్ చేసారు. 2020 డిసెంబర్ 14-20: గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలను ఏపీపీఎస్సీ నిర్వహించింది. 2021 ఏప్రిల్ 28: ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల అయ్యాయి. 326 మందిని ఇంటర్వ్యూకు సెలెక్ట్ చేసారు. అయితే మాన్యువల్ గా దిద్దాల్సిన జవాబు పత్రాలను డిజిటల్ పద్ధతిలో దిద్దారు. ఫలితాల్లో అక్రమాలు ఉన్నాయని, డిజిటల్ ఎవాల్యుయేషన్ గురించి నోటిఫికేషన్‌లో చెప్పలేదంటూ అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. ఇక్కడే స్కామ్ కు పునాది పడింది. మాన్యువల్ ఎవాల్యుయేషన్ కాదని డిజిటల్ ఎవాల్యుయేషన్ చేయాలని పీఎస్ఆర్ ఆంజనేయులు ఎందుకు నిబంధనలు మార్చేసారు? ఎవరికీ కోసం మార్చేసారు? ఎవరు చెప్తే మార్చేసారు? ప్రభుత్వాధి నేత చెప్పకుండా మాన్యువల్ మార్చడం సాధ్యమేనా? అంటే ఇక్కడ డిజిటల్ ఎవాల్యుయేషన్ లో తమకు కావాల్సిన వారిని సెలెక్ట్ చేసుకున్నారు. అందు కోసం పీఎస్ఆర్ ఆంజనేయులు డిజిటల్ ఎవాల్యుయేషన్ అనే కొత్త కాన్సెప్ట్ తీసుకుని వచ్చారు.

## ప్రైవేటు రిసార్ట్‌లో మూల్యాంకనమా?

2021 మే 15: మరో వైపు అభ్యర్థులందరూ టీడీపీ యువ నాయకుడు నారా లోకేష్ ను కలిసి తమకు అండగా నిలవాలని కోరారు. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలను మాన్యువల్ పద్ధతిలో మూల్యాంకనం చేయాలని, అంతేకాకుండా ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లతో పాటు అభ్యర్థులందరి మార్కులను వెల్లడించాలని డిమాండ్ చేస్తూ జగన్ కు నారా లోకేష్ లేఖ రాసారు. 2021 జూన్ 17: ఒక వైపు నారా లోకేష్ పోరాటం కొనసాగు తుండగానే, మరో వైపు గ్రూప్-1 ప్రధాన పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలపై సీబీఐతో విచారణ చేయించాలని కోరుతూ 19 మంది అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. 2021 అక్టోబర్ 1: డిజిటల్ ఎవాల్యూయేషన్ సరికాదని, మెయిన్స్ ఫలితాలను రద్దు చేసి, 3 నెలల్లో మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేయమంటూ హైకోర్టు తుది తీర్పును ఇచ్చింది. 2021 డిసెంబర్ - 2022 ఫిబ్రవరి మధ్య హాయ్ ల్యాండ్ రిసార్ట్స్ లో గ్రూప్ 1 మెయిన్స్ జవాబు పత్రాలను మాన్యువల్ గా దిద్దటానికి ఏర్పాట్లు చేసారు పీఎస్ఆర్ ఆంజనేయులు. ఫిబ్రవరిలో ఫలితాలు ఇస్తున్నామని చెప్పారు. ఇందు కోసం క్యామ్ సైన్ మీడియా ప్రయివేటు లిమిటెడ్ అనే హైదరాబాద్ కంపెనీకి ఎలాంటి పోటీతో కూడిన బిడ్డింగ్ పిలవకుండా మాన్యువల్ గా దిద్దటానికి కాంట్రాక్టు ఇచ్చేసారు. కానీ అది కూడా ప్రభుత్వ పెద్ద దగ్గరి మనుషుల సంస్థ. నిబంధనల ప్రకారం ఏపీపీఎస్సీ కార్యాలయంలో కానీ, ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో కానీ ఇవి దిద్దాలి, లేదా ప్రభుత్వ కాలేజీల్లో దిద్దాలని బోర్డు సభ్యులు చెప్పినా వినిపించుకోలేదు. హాయ్ ల్యాండ్ అనే ఒక ప్రైవేటు రిసార్ట్ లో, పీఎస్ఆర్ ఆంజనేయులు ఈ తతంతంగం మొత్తం పూర్తీ చేసారు. ఇందు కోసం చెక్ నెంబర్ 197469 ద్వారా రూ.1,14,32,312/- క్యామ్ సైన్ మీడియా ఇస్తున్నట్టు 16.2.2022న పీఎస్ఆర్ ఆంజనేయులు సంతకం చేసారు.

## ఆదేశాలు పాటించ కుండా కోర్టు ధిక్కారం

మాన్యువల్ విధానంలో ఎవాల్యుయేషన్ చేయమని హైకోర్టు స్పష్టంగా చెప్పినా, కోర్టునే ధిక్కరించాలనే ఈగోతో, డిజిటల్ ఎవాల్యూయేషన్ లో వచ్చిన మార్కులే మాన్యువల్ ఎవాల్యుయేషన్ లో కూడా రావాలని పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాలు ఇచ్చారు. అంటే కోర్టుకి అబద్ధాలు చెప్పటమే కాకుండా, దాని ఆదేశాలు పాటించకుండా కోర్టుని కూడా ధిక్కరించారు పీఎస్ఆర్ ఆంజనేయులు. డిజిటల్ ఎవాల్యూషన్ లో ఏ రిజల్ట్ అయితే వచ్చిందో, అదే మాన్యువల్ ఎవాల్యూషన్ లో కూడా వచ్చే విధంగా ప్రభుత్వ పెద్ద, పీఎస్ఆర్ ప్లాన్ చేసారు. ఇందు కోసం తమ అనుకూల కంపెనీ క్యామ్ సైన్ మీడియాను నిబంధనలు అన్నీ పక్కన పెట్టి తెచ్చుకున్నారు. ఏపీపీఎస్సీ సెలెక్ట్ చేసిన ఎవాల్యూటర్స్ మాత్రమే మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేయాలి. కానీ, పీఎస్ఆర్ ఆంజనేయులు తన ఇష్టం వచ్చినట్టు క్వాలిఫికేషన్ లేని వాళ్ళని తీసుకొచ్చారు. వెల్డర్, డ్రైవర్, తోటపని చేసే వాళ్ళు, ఇలా పీఎస్ఆర్ ఆంజనేయులు ఇష్టం వచ్చిన మనుషులని దింపారు. ప్రొఫెసర్‌లు దిద్దాల్సిన పేపర్లు చదువురాని వారి చేత దిద్దించారు. వీళ్ళు చేయాల్సింది డిజిటల్ ఎవాల్యూషన్ లో ఆన్సర్ షీట్ లో ఏవైతో ఉన్నాయో, అలాగే మాన్యువల్ ఎవాల్యూషన్ లో చూపిస్తూ ఓఎంఆర్ షీట్ లో రిజల్ట్స్ చూపించాలి. ఈ విధంగా కోర్టుని కూడా మోసం చేసి. ఏపీపీఎస్సీలో అక్రమాలు చేసి యువత గొంతు నులిమారు. వారికి కావలసిన వారికి సెలెక్ట్ చేసుకునే ప్లాన్ చేశారు. ఇది ఇలా జరుగుతూ ఉండగానే, అభ్యర్థులు కోర్టుకి వెళ్ళటం, కోర్టు చీవాట్లు పెట్టటం, స్కాం బయటకు రావటంతో, అసలు ఈ రెండోసారి హాయ్ ల్యాండ్‌లో మాన్యువల్ ఎవాల్యూషన్ జరగలేదని ప్రభుత్వం బుకాయించి ఏకంగా కోర్టునే బురిడీ కొట్టించారు.

## నిరుద్యోగ యువతను దగా చేసి వారి ఉసురు పోసుకున్నారు!

2022 ఫిబ్రవరి 17: వివాదం పెద్దది అవ్వటంతో పీఎస్ఆర్‌ని తప్పించి, డీజీపీ హోదాలో జగన్ పాపాలకు అన్నివిధాలా అండగా నిలిచిన గౌతమ్ సవాంగ్ ను ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమించారు జగన్ రెడ్డి. తన పాపాలు, తాను చేసిన తప్పుడు పనులు ఎక్కడ బయట పడతాయో అని భయం వేసిన పీఎస్ఆర్ ఆంజనేయులు, అప్పటి వరకు ఉన్న నోట్ ఫైల్స్ అన్నీ తీసుకుని వెళ్ళిపోయారు. అలా తీసుకుని వెళ్ళిపోతున్నా గౌతం సవాంగ్ నిలువరించలేక పోయారు. 2021 అక్టోబర్ 1న కోర్టు ఆదేశించినట్టుగా 2022 మార్చి నుంచి మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేస్తామని కోర్టుకు చెప్పారు. అంటే హాయ్ ల్యాండ్ లో చేసిన వాల్యుయేషన్ గురించి కోర్టుకు చెప్పకుండా దాచారు. ఎందుకు అలా చేయవలసి వచ్చింది అనేదే ప్రశ్న. 2022 మార్చి 25 నుంచి మే 25 వరకు విజయవాడలో మళ్ళీ మాన్యువల్ గా పేపర్లు దిద్దారు. అంటే ఒకే జవాబు పత్రాన్ని మూడుసార్లు దిద్దించారు. 2022 మే 25: ఏపీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలు చూసి అభ్యర్థులు అవాక్కయ్యారు. ఎందుకంటే డిజిటల్ విధానంలో పేపర్లు దిద్దినప్పుడు ఎన్నికయిన 326 మందిలో ఇప్పుడు ఏకంగా 202 మంది పేర్లు గల్లంతయ్యాయి. అంటే 62 శాతం ఫలితాలు తేడాగా రావడం అదెలా సాధ్యం? 2022 జూలై 5: గ్రూప్ 1 నియామకాలలో అవకతవకలు జరిగాయంటూ అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. దీన్ని పట్టించుకోని ఏపీపీఎస్సీ జూన్ - జూలై నెలల్లో ఇంటర్వ్యూలు పెట్టి, ఆగస్టులో నియామకాలు కూడా జరిపింది. వీరిలో 143 మంది ఇప్పటికే అధికారులుగా పనిచేస్తున్నారు. ఇది మొత్తం స్కాం జరిగిన తీరు. తన వారిని ప్రధాన ప్రభుత్వ వ్యవస్థలో అదీ గ్రూప్ 1 లాంటి కీలకమైన స్థానాల్లో పెట్టటానికి, పీఎస్ఆర్ ఆంజనేయులతో కలిసి ఆనాటి ప్రభుత్వ పెద్ద జగన్ పన్నిన పన్నాగం ఇది. ఎంతో ఉన్నతమైన పదవి లో ఉండి ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు ఎంత నీచాతి నీచానికి పాల్పడ్డాడో ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు తెలుసుకోవాలి. ఇది స్కాం కాదు రాజద్రోహం అవుతుంది. కుట్రతో రాష్ట్ర నిరుద్యోగ యువతను దుర్మార్గంగా దగా చేసి వారి ఉసురు పోసుకున్నారు. నిరుద్యోగ యువత పట్ల క్రూర మృగాలకంటే ఘోరంగా జగన్, పీఎస్ఆర్ ఆంజనేయులు వ్యవహరించారు. ఇంత పాపానికి ఒడిగట్టిన పాపాత్ములను చరిత్ర మాత్రం క్షమించదు. కూటమి ప్రభుత్వం 2024 జూన్ 13న 16,347 ఉపాధ్యాయ పోస్టుల మెగా డీఎస్సీ ప్రక్రియకు శ్రీకారం చుట్టి తర్వాత 2025లో పరీక్షలు నిర్వహించి ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను పూర్తి చేసింది. ఇంత పెద్ద నియామక ప్రక్రియను కేవలం రాజకీయ ఆరోపణలతో అపవిత్రం చేయాలని చూడటం అంటే ఉద్యోగం సాధించిన వేలాది యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. నిర్ధారణ చెయ్యలేని, ఆధారాలు లేని ఆరోపణలతో వేలాది మంది కొత్త ఉపాధ్యాయుల ప్రతిష్ఠను దెబ్బతీయడం ఎంతవరకు సమంజసం?జగన్ హయాంలో గ్రూప్ 1 మూల్యాంకనంపై తీవ్రమైన అక్రమాలు జరిగినట్లు సిట్ నివేదికలో వెల్లడి అయింది. మరి ముందుగా తమ హయాంలో జరిగిన వ్యవహారాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత జగన్ రెడ్డికి లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- నీరుకొండ ప్రసాద్




**కార్మికుడి సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది. ఈ సూత్రాన్ని ఆచరణలో పెట్టిన కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక భద్రత, ఆరోగ్య సేవలు, డిజిటల్ పాలన వంటి ప్రతి రంగంలో చారిత్రాత్మక సంస్కరణలను అమలు చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కార్మిక శాఖను కేవలం నియంత్రణ శాఖగా కాకుండా, కార్మికుల జీవితాల్లో భరోసా నింపే సంక్షేమ వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగింది. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన సంక్షేమ వ్యవస్థకు మళ్లీ ప్రాణం పోసి, కార్మిక కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించే చర్యలు చేపట్టింది.**



# శ్రమకు గౌరవం... భవిష్యత్తుకు భరోసా

## కార్మికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం కొండంత అండ

గత ఐదేళ్లలో నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులు ఉన్నప్పటికీ వాటిని కార్మికుల కోసం వినియోగించక పోవడంతో అనేక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులు నిర్వీర్యమయ్యాయి. ఈ పరిస్థితిని పూర్తిగా మార్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. కార్మిక సంక్షేమాన్ని తిరిగి గాడిలో పెట్టి, ప్రభుత్వంపై కార్మికుల్లో నమ్మకాన్ని పెంచింది.

### భవన నిర్మాణ కార్మికులకు మళ్లీ సంక్షేమ భరోసా

2026 మార్చి 1 నుంచి భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం పునరుద్ధరించింది. వివాహ బహుమతిగా రూ.20వేలు, ప్రసూతి సహాయంగా రూ.20వేలు, సహజ మరణానికి రూ.60వేలు, అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.20వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ మొత్తాలను మరింత పెంచే ప్రతిపాదనలు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఆధార్ ఆధారిత డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నేరుగా కార్మికుల ఖాతాల్లో నిధులు జమ చేయడం వల్ల పారదర్శకతతో పాటు వేగవంతమైన సేవలు అందుతున్నాయి.

### 25 ఇంటిగ్రేటెడ్ లేబర్ అమినిటీస్ కాంప్లెక్సులు-కార్మికులకు ఒకేచోట సేవలు

అసంఘటిత రంగ కార్మికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 25 ఇంటిగ్రేటెడ్ లేబర్ అమినిటీస్ కాంప్లెక్సుల ఏర్పాటు చేపట్టింది ప్రభుత్వం. ఈ కేంద్రాల్లో ఉపాధి సమాచారం, కార్మికుల నమోదు, సంక్షేమ సేవలు, నైపుణ్య శిక్షణ, తాగునీరు, వై-ఫై, పారిశుధ్య సదుపాయాలు ఒకేచోట లభించేలా ప్రణాళిక రూపొందించింది. భవిష్యత్తులో ప్రతి నియోజకవర్గానికీ ఈ నమూనాను విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది.




### కేర సురక్ష-కొబ్బరి కార్మికులకు భరోసా

కొబ్బరి కార్మికుల కోసం ప్రత్యేకంగా 'కేర సురక్ష' బీమా పథకాన్ని ప్రారంభించి తొలి దశలో 2,500 మంది కార్మికులకు బీమా రక్షణ కల్పించింది. మరణం లేదా శాశ్వత వైకల్యానికి రూ.7లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.3.5 లక్షలు, ఆసుపత్రి ఖర్చులకు రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించేలా పథకాన్ని రూపొందించింది.

### డిజిటల్ గవర్నెన్స్‌తో విప్లవాత్మక మార్పులు

కొత్త లేబర్ కోడ్‌లకు అనుగుణంగా ట్రేడ్ యూనియన్ నమోదు, కార్మికుల నమోదు, సంక్షేమ క్లెయిమ్స్, ఫిర్యాదుల పరిష్కారం, బాల కార్మికుల పర్యవేక్షణ, అర్థన్యాయ సేవల కోసం పూర్తిస్థాయి ఆన్‌లైన్ వ్యవస్థను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇంటి వద్ద నుంచే సేవలు అందేలా చర్యలు తీసుకుంది. శాఖ సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేయడం వల్ల పారదర్శకత, వేగవంతమైన సేవలు, రియల్ టైమ్ పర్యవేక్షణ సాధ్యమైంది.

### అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత

సామాజిక భద్రత కల్పించేందుకు ఇ-శ్రమ్ పోర్టల్‌లో 88.67 లక్షల మంది అసంఘటిత కార్మికులు నమోదు కావడం విశేషం. 2024-25లో 4.33 లక్షల మంది, 2025-26లో 3.59 లక్షల మంది కొత్తగా నమోదయ్యారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో 18.26 లక్షల మంది కార్మికులు నమోదయ్యారు. రాష్ట్రంలో కార్మికుల సమగ్ర డేటాబేస్ రూపొందించడం ద్వారా భవిష్యత్ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం బలమైన పునాది వేసింది.

### రూ.1,408 కోట్ల సంక్షేమ సెస్-కార్మికుల కోసమే వినియోగం

2024-25లో రూ.675.39 కోట్లు, 2025-26లో రూ.733.19 కోట్లు కలిపి మొత్తం రూ.1,408.58 కోట్ల నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ వసూలు చేశారు. ఈ నిధులను కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతా కార్యక్రమాల కోసం వినియోగించే కార్యాచరణను ప్రభుత్వం సిద్ధం చేసింది.

### నైపుణ్యాభివృద్ధితో ఉపాధికి కొత్త అవకాశాలు

2019-24 మధ్య నిలిచిపోయిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మళ్లీ ప్రారంభించి 85వేల మంది కార్మికులకు శిక్షణ అందించే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. నేషనల్ అప్రెంటిస్‌షిప్ కౌన్సిల్ ద్వారా 25 వేల మందికి, APTS ద్వారా 60వేల మంది కుటుంబ సభ్యులకు మొత్తం 41 ట్రేడ్లలో శిక్షణ అందిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు కల్పించడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారు.

### ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఊతమిచ్చిన సంస్కరణలు

మహిళలకు భద్రతా ప్రమాణాలతో నైట్ షిఫ్ట్‌ల్లో పని చేసే అవకాశం, పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచడం, దుకాణాలు, సంస్థలకు జీవితకాల నమోదు, పెద్ద పట్టణాల్లో 24 గంటల కార్యకలాపాలకు అనుమతి వంటి కీలక సంస్కరణలను ప్రభుత్వం అమలు చేసింది. ఈ చర్యలు పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడంతో పాటు ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదపడుతున్నాయి.

### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో గణనీయ పురోగతి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి 1,399 మంది బాల కార్మికులను రక్షించారు. 963 కనీస వేతనాల క్లెయిమ్స్ దాఖలు చేసి రూ.24.32 లక్షల పరిహారం సాధించారు. 19 మంది చిన్నారుల కోసం రూ.3.80 లక్షల రికవరీ చేయడం ద్వారా ప్రభుత్వం కార్మిక హక్కుల పరిరక్షణలో తన నిబద్ధతను చాటింది.

### ఈఎస్ఐ సేవల విస్తరణ-కార్మిక కుటుంబాలకు మెరుగైన ఆరోగ్య భద్రత

ప్రస్తుతం 15.32 లక్షల మంది ఈఎస్ఐ బీమా సభ్యులు, దాదాపు 60 లక్షల మంది లబ్ధిదారులకు వైద్య సేవలు అందుతున్నాయి. గత రెండేళ్లలో 8,036 శస్త్ర చికిత్సలు, 178 ప్రసవాలను విజయవంతంగా నిర్వహించారు. తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి 191 అదనపు పోస్టులు మంజూరు చేశారు. భవిష్యత్తులో 30 కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీలు, 57 డిస్పెన్సరీల అప్‌గ్రేడేషన్, విశాఖపట్నం, అమరావతిల్లో రెండు ESIC మెడికల్ కాలేజీల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి. డిజిటల్ హెల్త్ గవర్నెన్స్ ద్వారా మరింత పారదర్శక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

### పారిశ్రామిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత

"జీరో యాక్సిడెంట్స్" లక్ష్యంతో ప్రభుత్వం పరిశ్రమల్లో భద్రతా సంస్కృతిని బలోపేతం చేసింది. సేఫ్టీ ఆడిట్లు, మాక్ డ్రిల్స్, భద్రతా అధికారుల శిక్షణ, జిల్లా సంక్షోభ నిర్వహణ బృందాల ఏర్పాటు, డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థలు, సేఫ్టీ అలర్టులు వంటి చర్యలు చేపట్టింది. ఈ చర్యల ఫలితంగా పారిశ్రామిక ప్రమాదాలు, మరణాలు గణనీయంగా తగ్గాయి. కార్మికుల ప్రాణ భద్రత, పరిశ్రమల స్థిరాభివృద్ధి, పెట్టుబడిదారుల విశ్వాసం అనే మూడు లక్ష్యాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.



### శ్రమశక్తి అవార్డుల పునరుద్ధరణ

2018 తర్వాత నిలిచిపోయిన శ్రమశక్తి అవార్డులను ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. 46 మంది కార్మికులకు శ్రమశక్తి అవార్డులు, 28 యాజమాన్యాలకు ఉత్తమ యాజమాన్య అవార్డులు ప్రదానం చేసి కార్మికుల సేవలను గౌరవించింది.

### స్వర్ణాంధ్ర దిశగా కార్మిక సంక్షేమమే బలమైన పునాది

గత రెండేళ్లలో కార్మిక శాఖ చేపట్టిన సంస్కరణలు కేవలం పథకాల అమలుకే పరిమితం కాలేదు. కార్మికుల గౌరవం, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య రక్షణ, డిజిటల్ సేవలు, పారిశ్రామిక భద్రతలను సమగ్రంగా బలోపేతం చేస్తూ కార్మిక కేంద్రిత పరిపాలనకు ప్రభుత్వం నాంది పలికింది. కార్మికుడు బలపడితేనే పరిశ్రమ బలపడుతుంది, పరిశ్రమ బలపడితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందనే దృక్పథంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. "స్వర్ణాంధ్రప్రదేశ్-2047" లక్ష్య సాధనలో కార్మిక సంక్షేమాన్ని కీలక స్తంభంగా మార్చింది. ప్రతి కార్మిక కుటుంబానికి భద్రత, గౌరవం, అభివృద్ధి అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు



# తాగునీటి సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కూన



ఆమదాలవలస (చైతన్యరథం): ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం అని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మెట్టక్కివలస వాంబే కాలనీ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ. 81.52 లక్షల ఏఐబీ నిధులతో చేపట్టనున్న తాగునీటి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టులో భాగంగా 600 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ ఓవర్హెడ్ ట్యాంక్ను నిర్మించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ట్యాంకు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే కాలనీ ప్రజలకు నిరంతరాయంగా మెరుగైన తాగునీటి సౌకర్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# రెండేళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం

**●ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి**



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గం కురుపాం మండల కేంద్రంలో గురువారం నాడు "రెండేళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఉత్తరాంధ్ర 'చిన్న కాశీ' పుణ్యగిరిని పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

**●నిస్వార్థ సేవతో క్షేత్రాభివృద్ధికి శ్రమించాలి: ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి**



శృంగవరపుకోట (చైతన్యరథం): ఎస్.కోట మండలం పుణ్యగిరిలోని శ్రీధారగంగమ్మ, శివాలయం దేవస్థానం నూతన పాలకమండలి ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించిన నూతన కమిటీ సభ్యులకు దుశ్శాలువాలు కప్పి, ఘనంగా సత్కరించారు. కూటమి ధర్మానికి పెద్దపీట వేస్తూ జనసేన, బీజేపీలకు చెందిన ఒక్కొక్క నాయకుడికి పాలకమండలిలో చోటు కల్పించారు.

**కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు లభిస్తుంది:**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్ మాట్లాడుతూ... "పదవులు శాశ్వతం కావు, ప్రజాసేవే పరమావధి అని నమ్మి పనిచేస్తున్నాం" అని పేర్కొన్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం తరపున నిస్వార్థంగా, క్రమశిక్షణతో శ్రమించే ప్రతి కార్యకర్తనూ నామినేటెడ్ పదవుల ద్వారా గౌరవించుకుంటామని స్పష్టం చేశారు. ఎక్కడా వర్గ విభేదాలకు తావులేకుండా, కులమతాలకు అతీతంగా పాలకమండలి ఎంపికలు జరిగాయని తెలిపారు.

# పాచిపెంటలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి



పాచిపెంట (చైతన్యరథం): పాచిపెంట మండలం పద్మాపురం పంచాయితీ బడ్నాయకవలస గ్రామంలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్నారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై పాదయాత్రగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు సంధ్యమ్మ మా ఇంటికి రామ్మా.. అని ఆప్యాయంగా పిలిచి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం కూటమి రెండేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పార్టీ నాయకులతో కలిసి ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నుంచి పద్మాపురం పంచాయతీలో రూ.8 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, గొడ్డలి పార్టీ మాటలను నమ్మొద్దని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలను మంత్రి గుమ్మడి సంధ్యారాణి కోరారు.

# విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఘనంగా 'తిరంగా యాత్ర' బైక్ ర్యాలీ!



విశాఖపట్నం పశ్చిమ (చైతన్యరథం): 80వ స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలు మరియు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా నేడు విశాఖపశ్చిమ నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ అత్యంత ఉత్సాహంగా విశాఖ పశ్చిమ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. గోపాలపట్నం నుండి ప్రారంభమైన ఈ తిరంగా యాత్ర బైక్ ర్యాలీ, ఎన్.ఎ.డి. (NAD) జంక్షన్ మీదుగా కరస వరకు కోలాహలంగా సాగింది. ఈ ర్యాలీలో మాజీ సైనికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండాలను చేతబూని దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

# నేరస్థులకు కొమ్ముకాయడం.. పోలీసులను బెదిరించడమే జగన్ నైజం

**● వైసీపీ తీరుపై మండిపడ్డ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



విజయనగరం (చైతన్యరథం): కర్నూలు జిల్లా పంచలింగాల జైలు వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం, పోలీసు వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలను విజయనగరం ఎంపీ, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కలిశెట్టి అప్పలనాయుడు తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఘటనలు, ఆ తర్వాత జగన్ రెడ్డి చేస్తున్న ఆర్టిఫిషియల్ పరామర్శల పర్యటనలు చూస్తుంటే ప్రజలకు అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలను ప్రశాంతమైన ప్రాంతాల్లో ఘర్షణలకు, గొడవలకు పురికొల్పుతున్నారా? తన పర్యటనల డ్రామాల కోసం, పొలిటికల్ మైలేజ్ కోసం సొంత పార్టీ నేతలతోనే ఈ అల్లర్లు చేయిస్తున్నారా? అనే సందేహం స్పష్టంగా వ్యక్తమవుతోంది. అధికారం పోయాక ప్రజల్లో ఆదరణ కరువై, పార్టీ ఉనికి కోల్పోతున్న తరుణంలో.. రోజూ ఏదో ఒక వివాదాన్ని సృష్టించడం జగన్‌కు అలవాటుగా మారింది. ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నేతలతో అలజడులు రేపడం, ఆ తర్వాత చట్టం తన పని తాను చేసుకుపోతూ అరెస్టులు చేస్తే.. 'రాజకీయ కక్షసాధింపు' అని బోర్డు తగిలించి జైళ్ల చుట్టూ తిరగడం ఒక పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతోంది.

**చట్టం ముందు అందరూ సమానమే**

కర్నూలు జిల్లా పంచలింగాల జైలు ముందర నిలబడి వైఎస్ జగన్ రెడ్డి రాజ్యాంగం గురించి, ప్రజాస్వామ్య సూత్రాల గురించి మాట్లాడటం ఈ శతాబ్దపు అతిపెద్ద విడ్డూరమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. చట్టాన్ని ధిక్కరించి, స్థానికంగా అలజడులు సృష్టించిన వ్యక్తులను పరామర్శించేందుకు జైలు బాట పట్టడమే జగన్ అసలు నైజానికి నిదర్శనమని మండిపడ్డారు. గడిచిన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అరాచకానికి నిలయంగా మార్చి, విపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించి అర్థరాత్రి అరెస్టులు చేయించిన చరిత్ర జగన్ రెడ్డిదని, అలాంటి వ్యక్తి ఈరోజు చట్టం, ప్రోటోకాల్ గురించి మాట్లాడటం వింతగా ఉందన్నారు. ఎమ్మెల్యే అయినా, మరే ఇతర ప్రజాప్రతినిధి అయినా చట్టం ముందు అందరూ సమానులేనని ఎంపీ స్పష్టం చేశారు. ఆలూరులో చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే పోలీసులు చట్టప్రకారమే చర్యలు తీసుకున్నారని తెలిపారు. జగన్ తన హయాంలో పోలీసులను రాజకీయ ఆయుధంగా వాడుకుని, వ్యవస్థలను ఎలా నిర్వీర్యం చేశారో రాష్ట్ర ప్రజలందరికీ బాగా తెలుసన్నారు. తమ కూటమి ప్రభుత్వంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం లేదని, కేవలం చట్టాన్ని అతిక్రమించిన వారిపైనే విధి నిర్వహణలో భాగంగా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. చట్టబద్ధమైన అరెస్టులకు రాజకీయ రంగు పూసి సానుభూతి పొందాలని జగన్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. పోలీసు అధికారులను ఉద్దేశించి జగన్ రెడ్డి బహిరంగంగా బెదిరింపులకు దిగడం ఆయన అహంకార ధోరణికి మరియు రాజ్యాంగ వ్యతిరేక మనస్తత్వానికి ప్రత్యక్ష నిదర్శనమని కలిశెట్టి ఆరోపించారు. భవిష్యత్తులో చర్యలు ఉంటాయని పోలీసులను భయపెట్టాలని చూస్తే ఏ ఒక్క అధికారీ భయపడే పరిస్థితి లేదని, కూటమి ప్రభుత్వంలో అధికారులకు పూర్తి రక్షణ, స్వేచ్ఛ ఉన్నాయని స్పష్టం చేశారు. బాధ్యతాయుతంగా పనిచేస్తున్న పోలీసుల స్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు.

# టెక్కలి నియోజకవర్గంలో నేడు రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన

**●నందిగాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ**



టెక్కలి (చైతన్యరథం): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం టెక్కలి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నందిగాం మండలంలోని కొత్తగ్రహారం పంచాయతీ, జడ్యాడ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయనున్నారు. పర్యటనలో భాగంగా సాయంత్రం 4.30 గంటలకు నందిగాం మండలం కొత్తగ్రహారం పంచాయతీ పరిధిలో ఎన్‌హెచ్ -16 నుంచి జడ్యాడ గ్రామం వరకు నిర్మించిన సీసీ, బీటీ రహదారిని మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించనున్నారు. అనంతరం 5.15 గంటలకు జడ్యాడ జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు నిర్మించిన సీసీ రహదారిని, 5.20 గంటలకు ఎస్సీ కాలనీ నుంచి హనుమాన్ ఆలయం వరకు నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు జడ్యాడ గ్రామంలో "రాజముద్ర"తో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొని లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు మెరుగైన రహదారులు, రవాణా సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా జడ్యాడ గ్రామ ప్రజలకు రహదారి సౌకర్యం మరింత మెరుగుపడనుంది.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## 'హర్ ఘర్ తిరంగా'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



న్యూఢిల్లీ / కాకినాడ (చైతన్యరథం): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలంతా చురుగ్గా పాల్గొనాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి త్రివర్ణ పతాకంతో ఆయన ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఆగస్టు 15న ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులకు ఘన నివాళు లర్పించాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడేలా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని ఎంపీ సానా సతీష్ బాబు అన్నారు. "హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా" అంటూ దేశభక్తి, జాతీయ ఐక్యత, దేశం పట్ల గర్వభావాన్ని ప్రతి ఒక్కరిలో నింపాలని ఆయన పిలుపునిచ్చారు.

## కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : బూరుగుపల్లి శేషారావు



నిడదవోలు (చైతన్యరథం): నియోజకవర్గం నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలో "2 ఏళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి" ఇంటింటికి ప్రచార కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు చేపట్టారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ విజయాలను తెలియచేసి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల,గ్రామ,వార్డు అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి - సంక్షేమంలో గోపాలపురం



గోపాలపురం (చైతన్యరథం): నియోజకవర్గంలో నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం – ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని 100% పూర్తి చేసిన దేవరపల్లి మండలం రామన్నపాలెం గ్రామ బూత్ ఇన్‌చార్జ్‌లను, గ్రామశాఖ అధ్యక్షులను గోపాలపురం నియోజకవర్గ శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి శాలువా మరియు ప్రసాదంతో ఘనంగా సన్మానించారు. ప్రజలతో మమేకమై, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేస్తున్న పార్టీ శ్రేణుల కృషికి ఇది అభినందనీయమైన గుర్తింపు అని అన్నారు.

## గుంటూరు జీజీ హెచ్, తాడికొండ గురుకులం హాస్టల్ అభివృద్ధికి నిధులు మంజూరు

- రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు (చైతన్యరథం): నగరంలో విద్య, వైద్య మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తాడికొండలోని గురుకులం హాస్టల్ నిర్మాణానికి రూ.5 కోట్లు, గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పాత భవనం పునరుద్ధరణ పనులకు రూ.5.20 కోట్లు కలిపి మొత్తం రూ.10.20 కోట్ల నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. జిల్లా అభివృద్ధికి కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పనిచేస్తున్న ఫలితమే ఈ నిధుల మంజూరని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు, గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పాత భవనాన్ని ఆధునీకరించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి పెమ్మసాని చంద్రశేఖర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "గుంటూరు ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. తాడికొండ గురుకులం, జీజీహెచ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ నిధుల సాధనలో జిల్లా కలెక్టర్ ఏ.వీ సాయి కాంత్ వర్మ అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ నిరంతరం ఫాలోఅప్ చేయడం అభినందనీయం. గుంటూరు అభివృద్ధికి ఇదే సమన్వయంతో మరిన్ని ప్రాజెక్టులను తీసుకువస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా టీడీపీ... రూ.5 లక్షల ప్రమాద బీమా



రాజమహేంద్రవరం (చైతన్యరథం): విషాదకర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన టీడీపీ కార్యకర్త, చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి చెందిన గెద్దం మునీశ్వరరావు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలిచింది. వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి దేవరపల్లి పర్యటన నేపథ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన మునీశ్వరరావు కుటుంబాన్ని గురువారం రాజమహేంద్రవరం పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ తరపున అందించే రూ.5,00,000/- ప్రమాద బీమా సహాయాన్ని అందజేశారు. కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మునీశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత విషాదకరం. మద్యం సేవించి అతి వేగంగా వాహనం నడిపిన వైసీపీ కార్యకర్తలు ఖండవల్లి అనిల్ కుమార్ మరియు అతని స్నేహితుల కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. కష్టకాలంలో కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవడం.. టీడీపీకి కార్యకర్తల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు,కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ సంక్షేమం.. ప్రతి ప్రాంతానికీ అభివృద్ధి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు నగరంలోని ప్రతి ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ టీడీపీ – ఇంటింటికీ సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా 42వ డివిజన్‌లో గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. 'సూపర్ సిక్స్' హామీల అమలుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి వేగం పెంచామని తెలిపారు. సామాజిక భద్రతా పింఛన్ల పెంపు, 'తల్లికి వందనం', 'దీపం–2', 'స్త్రీ శక్తి', ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, 'అన్నదాత సుఖీభవ' వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా వివిధ వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామని, రైతుల హక్కులను పరిరక్షించే చర్యల్లో భాగంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని వివరించారు.

## నవ్యాంధ్రలో సూక్ష్మ పరిశ్రమలకు కేంద్రం భారీ ఊతం : ఎంపీ కేశినేని

న్యూ ఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం) : ఆంధ్రప్రదేశ్‌లో సూక్ష్మ, చిన్న పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధి, మహిళా పారిశ్రామికవేత్తలకు అందుతున్న శిక్షణపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలను వెల్లడించింది. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే గురువారం లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎంపీ కేశినేని చిన్ని ప్రాతినిధ్యం వహిస్తున్న విజయవాడ పార్లమెంట్ పరిధితో పాటు కృష్ణా ప్రాంతంలోని సూక్ష్మ పరిశ్రమలకు కేంద్ర ప్రోత్సాహం లభిస్తోందని ఈ సమాధానంతో స్పష్టమైంది. విజయవాడలో గోల్డ్ ఆర్నమెంట్ క్లస్టర్, జగ్గయ్యపేటలో గోల్డ్ ఆర్నమెంట్ క్లస్టర్ ఇప్పటికే పూర్తయ్యాయి. అదేవిధంగా మచిలీపట్నంలోని ఇమిటేషన్ జ్యువెలరీ ఇండస్ట్రీ క్లస్టర్ కూడా పూర్తయిన ప్రాజెక్టుల జాబితాలో ఉంది. బంగారు ఆభరణాల తయారీ, ఇమిటేషన్ జ్యువెలరీ వంటి సంప్రదాయ వృత్తులు, సూక్ష్మ పరిశ్రమలకు క్లస్టర్ విధానంలో మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి సామర్థ్యం, మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది.

## కార్యకర్తకు ఆర్థిక భరోసానిచ్చిన కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు వీరంకి



కృష్ణా జిల్లా (చైతన్యరథం): మండల కేంద్రమైన తోట్లవల్లూరులోని మల్లాపురంకు చెందిన షేక్ అసదుల్లా ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో వెన్నుపూస వైద్యానికి సంబంధించి వైద్యం పొంది ఇటీవల ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని అసదుల్లాను కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి గురువారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అనంతరం అసదుల్లా కుటుంబానికి 25 వేలు పేదలకు మరో 25 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని గురుమూర్తి అందించారు. ఎటువంటి అధైర్యం పడవద్దని బాధిత కుటుంబలకు ఆయన భరోసా ఇచ్చారు. మండలంలోని తోట్లవల్లూరు గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి ఆధ్వర్యంలో గ్రామ తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు.

### వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎల్.వో.సి పత్రాలు అందజేత

గురువారం అత్యవసర వైద్య సహాయం కోరుతూ దరఖాస్తు చేసుకున్న పలువురికి ఆరు లక్షల 46వేల 377 రూపాయల విలువైన ఎల్వోసి పత్రాలను గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి అందించారు. కిలారపు నాంచారమ్మకు 1,53,796 రూపాయలు, కొల్ల సాంబశివరావుకు 2, 92,149 రూపాయలు,కొక్కిలిగడ్డ లలితకు 1,00,432 రూపాయలు, గోరిపర్తి పవన్ కార్తీక్‌కు లక్ష రూపాయలు విలువైన ఎల్‌ఓసి పత్రాలను ఆయన స్వయంగా అందించారు.

## తల్లికి వందనం విద్యార్థుల భవితకు భరోసా : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (చైతన్యరథం): తల్లికి వందనంతో విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం రాజీవ్ గాంధీ నగర్ 6వ లైన్ శ్రీ వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్‌లో తల్లికి వందనం కృతజ్ఞత సభ కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బడిలో ఉపాధ్యాయుడు మార్గదర్శి, ఇంట్లో తల్లిదండ్రులే ప్రథమ గురువులు ఈ ఇద్దరూ కలిసి విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే వేదిక పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ అని, ఇదొక నూతన అధ్యాయమని అన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారని, విద్యార్థులకు పోటీతత్వాన్ని అలవర్చుతున్నారని చెప్పారు

## ఇంటింటికి టీడీపీ కార్యక్రమ నిర్వహణలో రాష్ట్రంలోనే విజయవాడ పశ్చిమ మూడో స్థానం ఉండటం అభినందనీయం : మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం, ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్ధా వెంకన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని డివిజన్ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, బూత్ ఇన్‌ఛార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలకు బుద్ధా వెంకన్న హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజలకు తెలుగుదేశం పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు చేరువ చేయడంలో నాయకులు, కార్యకర్తలు చూపిన అంకితభావం, సమన్వయం, క్షేత్రస్థాయి కృషి వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. బుద్ధా వెంకన్న మాట్లాడుతూ... "ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం రాష్ట్రంలో 3వ స్థానం, జిల్లాలో ప్రథమ స్థానం సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ విజయం ప్రతి డివిజన్ అధ్యక్షుడు, క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జ్, బూత్ ఇన్‌ఛార్జ్, నాయకుడు, కార్యకర్త సమిష్టి కృషికి నిదర్శనం. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి వెళ్లి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్ కార్యక్రమాల్లోనూ ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## గన్నవరం విమానాశ్రయ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి

**● గన్నవరం విమానాశ్రయం నుంచి వారణాసి, కోల్‌కతాకు ఇండిగో నూతన విమాన సర్వీసుల ప్రారంభం**




గన్నవరం (చైతన్యరథం): అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వారణాసి, కోల్‌కతా నగరాలకు ఇండిగో నూతన విమాన సర్వీసులను ప్రారంభించింది. ఈ సర్వీసులను ఢిల్లీ నుంచి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వర్చువల్‌గా ప్రారంభించారు. గన్నవరం విమానాశ్రయంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి విమాన సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వారణాసి తొలి విమాన సర్వీసుకే సుమారు 130 మంది ప్రయాణికులు బుక్ చేసుకోవడం విజయవాడకు ఉన్న విమానయాన సామర్థ్యాన్ని చాటుతుందన్నారు. శబరిమల యాత్రికుల సౌకర్యార్థం విజయవాడ నుంచి కొచ్చిన్‌కు నేరుగా విమాన సర్వీసు ప్రారంభించాలని ఇండిగో ప్రతినిధులు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరినట్లు తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ ఏడాదిలోనే గన్నవరం విమానాశ్రయం నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభించి మరిన్ని నగరాలకు విమాన అనుసంధానం కల్పించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. వారణాసికి నేరుగా విమాన సర్వీసు ప్రారంభించడం వల్ల భక్తులకు ప్రయాణ సమయం, ఖర్చు తగ్గి మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఇండిగో సంస్థ షెడ్యూల్ ప్రకారం వారణాసి నుంచి మధ్యాహ్నం 3.55 గంటలకు బయలుదేరే విమానం సాయంత్రం 5.50 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 6.20 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి రాత్రి 8.15 గంటలకు వారణాసి చేరుకుంటుంది. వారానికి మూడు రోజుల పాటు ఈ సర్వీసులు నడవనున్నాయి. అదే విమానం వారణాసి--కోల్‌కతా మార్గంలో కూడా సేవలు అందించనుంది. టికెట్ ధరలు సుమారు రూ.6,500 నుంచి రూ.8,000 మధ్య ఉండనున్నట్లు ఇండిగో సంస్థ వెల్లడించింది. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీ కాంత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ రామ చారి తదితరులు పాల్గొన్నారు.

## కన్నా రాజకీయ స్వర్ణోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



గుంటూరు (చైతన్యరథం): మాజీ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి గుర్తుగా గుంటూరు శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించిన 50 ఏళ్ల రాజకీయ స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానంపై రచించిన పుస్తకాన్ని స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ... కన్నా ఐదు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో కొనసాగుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన సీనియర్ రాజకీయ నాయకుడని కొనియాడారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి వివిధ పదవులను అలంకరించి మంత్రిగా రాష్ట్రానికి సేవలందించడంతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు సత్తెనపల్లి ప్రాంత అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. రాజకీయాల్లో ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానం పూర్తి చేసుకోవడం సాధారణ విషయం కాదని ప్రజలతో మమేకమై వారి నమ్మకాన్ని సంపాదించుకున్న నాయకుడికే ఇలాంటి అరుదైన గౌరవం దక్కుతుందని జీవీ పేర్కొన్నారు.

## జనం మెచ్చిన జననాయకుడు - కొత్త తరానికి స్ఫూర్తి కన్నా లక్ష్మీనారాయణ

**●కన్నా సేవలు రాజకీయాలకు ఎన్సైక్లోపీడియా లాంటివి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): జనం మెచ్చిన జననాయకుడు, కొత్త తరానికి స్ఫూర్తి కన్నా లక్ష్మీనారాయణ అని, ఆయన సేవలు రాజకీయాలకు ఎన్సైక్లోపీడియా లాంటివని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యారు. తొలుత కన్నవారితోటలోని కన్నా లక్ష్మీనారాయణ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను బహుకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జన్మదిన వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... కన్నా లక్ష్మీనారాయణ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన జననాయకుడని పేర్కొన్నారు. పాత తరానికి చెందిన నాయకుల అనుభవ సంపదను కొత్త తరానికి అందిస్తున్న ఎన్సైక్లోపీడియా లాంటి నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ అని గళ్ళా మాధవి అభివర్ణించారు. ఆయన రాజకీయ ప్రస్థానం, ప్రజా సేవా దృక్పథం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.

## అపోహలు వీడండి... అవయవదానం చేయండి

**● ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా అవయవదానంపై అవగాహన ర్యాలీ చేపట్టిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్**




విజయవాడ (చైతన్యరథం): అవయవదానంపై ఉన్న అపోహలు, మూఢ నమ్మకాలను వీడి అవకాశమున్నవారు అవయవదానం చేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సూచించారు. గురువారం సాయంత్రం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్‌లోని ఆయుష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 'ప్రపంచ అవయవ దాన దినోత్సవం' సందర్భంగా 'వాక్‌థాన్' జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... 'ప్రపంచ అవయవ దాన దినోత్సవం' సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. శరీరంలోని అవయవాలను దానం చేయాలనే ఆలోచన ప్రజలలో కలిగించేందుకు ఈ వాక్‌థాన్ నిర్వహిస్తున్నారన్నారు. అవయవ దానం చేయడం వల్ల కొంత మందికి జీవనాన్ని పొడిగించవచ్చని వివరించారు. అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించడానికి ఆయుష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ...** 'ప్రపంచ అవయవ దాన దినోత్సవం' సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. శరీరంలోని అవయవాలను దానం చేయాలనే ఆలోచన ప్రజలలో కలిగించేందుకు ఈ వాక్‌థాన్ నిర్వహిస్తున్నారన్నారు. అవయవదానం చేయడం వల్ల కొంత మందికి జీవనాన్ని పొడిగించవచ్చని వివరించారు. అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించడానికి ఆయుష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అవయవదానం చేయడం మన ధర్మమని చెప్పారు. బ్రెయిన్ డెడ్ అయి మరణించిన వారి శరీరంలోని అన్ని అవయవాలను అమర్చడం ద్వారా మరి కొంతమందికి పునర్జన్మను అందివచ్చునని చెప్పారు.

**గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ...** అభివృద్ధి చెందిన దేశాల్లో 50 శాతం మంది రిజిస్టర్డ్ ఆర్గాన్ డోనర్స్ ఉంటారని చెప్పారు. కాని మన దేశంలో రిజిస్టర్డ్ ఆర్గాన్ డోనర్స్ చాలా తక్కువ మంది ఉన్నారన్నారు. మన దేశంలో అపోహలు, మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉంటాయని, అవయవదానంపై ఉన్న మూఢ నమ్మకాలను తొలగించుకుని అవయవాలను దానం చేయాలని సూచించారు. మరణించిన ఒక వ్యక్తి శరీరంలోని అవయవాలను 9 మందికి అమర్చవచ్చునని తెలిపారు. మన దేశంలో వేలాది మంది అవయవ దానం కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమములో గద్దె రమేష్, డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు, డాక్టర్ పి.శ్రీమన్నారాయణ, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ కె.ఎల్.వి.ప్రసాద్, జయలక్ష్మి, పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విజయాలను 50 లక్షల కుటుంబాలకు చేర్చిన ఘనత కార్యకర్తలదే

**●కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి: దేవినేని ఉమా**



మంగళగిరి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు అందించిన భరోసా, సంక్షేమం, అభివృద్ధి ఫలాలను 50 లక్షల కుటుంబాలకు చేర్చడంలో కార్యకర్తల పాత్ర కీలకమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన యూనిట్ ఇన్‌ఛార్జిల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ బలోపేతం, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. "ఇంటింటికీ తెలుగుదేశం -- 2 ఏళ్ల నమ్మకం" కార్యక్రమాన్ని విజయవంతం చేసి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వివరించాలని దేవినేని ఉమా సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశాన్ని ప్రజలకు సూటిగా వివరించడంతో పాటు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని అన్నారు. ప్రత్యర్థుల విమర్శలకు భావోద్వేగాలకు లోనుకాకుండా వాస్తవాలు, గణాంకాలు, గత అనుభవాల ఆధారంగా సమర్థవంతంగా సమాధానం ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి ప్రభుత్వంపై మరింత విశ్వాసాన్ని పెంచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలమని పేర్కొన్న దేవినేని ఉమా, ప్రతి కార్యకర్త నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వారధిగా నిలవాలని అన్నారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా రాజకీయ అవగాహన, నాయకత్వ సామర్థ్యం, ప్రజలతో మమేకమయ్యే నైపుణ్యాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు.

## ప్రతి పౌరుడు సమాజం కోసం తనవంతు బాధ్యత నిర్వర్తిస్తే సరిహద్దులోని సైనికుడితో సమానమే

- స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా దర్శిలో తిరంగా యాత్ర...

**పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ**



దర్శి (చైతన్యరథం): సమాజం కోసం చిన్న బాధ్యత అయినా, నిర్వర్తించే ప్రతి ఒక్కరూ దేశ సేవలో ఉన్న సైనికుల్లాంటి వారేనని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ వ్యాఖ్యానించారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా దర్శి పట్టణంలో గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్ర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ... దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాలను జరుపుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని, ఎన్నో సంక్షోభాలు, యుద్ధాలు, సవాళ్లను అధిగమించి భారతదేశం నేడు ప్రపంచ పటంలో ఒక ఐకానిక్ దేశంగా నిలవడం వెనుక ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, వీరుల త్యాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. వారి త్యాగఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులను ఆస్వాదిస్తున్నామని తెలిపారు. భారతదేశం ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సి ఉందని, దేశ అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్న సైనికులు, దేశంలో శాంతి భద్రతలను కాపాడుతున్న పోలీసుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఒక మొక్క నాటడం నుండి సమాజ అభివృద్ధికి దోహదపడే ప్రతి చర్య దేశభక్తికి నిదర్శనమని చెప్పారు. భావితరం దేశ గౌరవాన్ని మరింత పెంచే విధంగా చైతన్యవంతంగా, బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని కోరారు.

## కలిగిరిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' వేడుకలు!

- బైక్ ర్యాలీతో మార్మోగిన దేశభక్తి నినాదాలు.. జాతీయ జెండాతో

**ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సందడి..!**



ఉదయగిరి (చైతన్యరథం): నియోజకవర్గంలోని కలిగిరి మండల కేంద్రంలో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని పురస్కరించుకుని దేశభక్తి, జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిర్రావారిపాలెం నుంచి కలిగిరి ఎమ్మార్వో కార్యాలయ సెంటర్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని, సైకిల్‌పై ర్యాలీకి నాయకత్వం వహిస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యేకి ప్రజలు, యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ర్యాలీ సాగిన మార్గమంతా జాతీయ జెండాలు రెపరెపలాడుతూ, దేశభక్తి నినాదాలతో కలిగిరి వీధులు మార్మోగాయి. "భారత్ మాతాకీ జై.. వందే మాతరం.. జై హింద్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో కలిగిరి మండల కేంద్రం దేశభక్తి నినాదాలతో హోరెత్తింది. చిన్నారులు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండాలను చేతబూని దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. జాతీయ జెండా మన దేశ గౌరవానికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయడం ద్వారా దేశం పట్ల మనకున్న గౌరవాన్ని, బాధ్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని అన్నారు. "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం కేవలం జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమం మాత్రమే కాదని, దేశభక్తి భావనను ప్రతి కుటుంబానికి, ప్రతి పౌరుడికి చేరువ చేసే మహత్తర ఉద్యమమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## మీ నమ్మకం... మా బాధ్యత... మీ సంక్షేమమే మా లక్ష్యం!



డోన్ (చైతన్యరథం): మీ నమ్మకం, మా బాధ్యత మీ సంక్షేమమే మా లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 18వ రోజు విజయవంతం... పాతపేటలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను తెలియజేశారు. అలాగే వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. సూపర్-6 హామీల అమలు, మహిళలు, రైతులు, యువతకు అందిన లబ్ధిని తెలియజేశారు. ప్రజల నుంచి సమస్యలు, సూచనలను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 17 రోజుల్లో 50 లక్షల ఇళ్ల సందర్శన మైలురాయిని అధిగమించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య పేర్కొన్నారు.

## మీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నా... పనులు చేశాకే మీ ముందుకు వచ్చా

- ఆలూరుపాడులో 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారం : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు (చైతన్యరథం): ఎన్నికల ముందు ఆలూరుపాడు గ్రామానికి వచ్చినప్పుడు ప్రజలు తమ ముందుంచిన సమస్యల్లో సగానికి పైగా రెండేళ్లలో పరిష్కరించిన తర్వాతే మళ్లీ గ్రామానికి వచ్చానని, తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని కోవూరు శాసనసభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కొడవలూరు మండలం ఆలూరుపాడు పంచాయతీలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ, రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 'ఎన్నికల ముందు మీ గ్రామానికి వచ్చాను. మళ్లీ రెండేళ్ల సుపరిపాలన పూర్తయిన సందర్భంగా ఇప్పుడు మీ ముందుకు వచ్చాను. అప్పట్లో నేను రాజకీయ నాయకురాలిగా కాకుండా ప్రజలకు సేవ చేయడానికి వచ్చానని చెప్పాను. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పి మీ ఆశీర్వాదం కోరాను. నా మాటలను నమ్మి భారీ మెజారిటీతో నన్ను గెలిపించారు. ఎన్నికల ముందు మీరు చెప్పిన సమస్యల్లో సగానికి పైగా పరిష్కరించిన తర్వాతే ఈ రోజు మీ ఊరికి వచ్చాను. మీరు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దాదాపు 99 శాతం అమలు చేసిందని తెలిపారు.

**ఆలూరుపాడులో రూ.2.30 కోట్ల అభివృద్ధి పనులు**

ఆలూరుపాడులో గడిచిన రెండేళ్లలో వివిధ శాఖల ద్వారా మొత్తం రూ.2.30 కోట్ల (రూ.2,30,68,000) విలువైన అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.97.30 లక్షలతో అడ్డవాగు, రేవళ్ల వాగు, లంకా వాగు కాలువల్లో పూడికతీత, రెడ్డిపాలెం–యేగర్ల సైడ్ తూము పునరుద్ధరణ, ఆలూరుపాడు కాలువ వాల్స్ మరమ్మతులు, మోదెగుంట–విడవలూరు కాలువ పునరుద్ధరణ వంటి పనులు చేపట్టినట్లు వివరించారు. అలాగే ఆలూరుపాడు కాలువపై బ్రిడ్జి, మోదెగుంట–విడవలూరు కాలువపై శ్లాబు, కల్వర్టు, రక్షణ గోడల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు.

**తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి**

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా చేపట్టిన పనులను ప్రత్యేకంగా ప్రస్తావించిన ఎమ్మెల్యే, 'నేను ఎన్నికల ముందు ఆలూరుపాడుకు వచ్చినప్పుడు తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాం' అని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ.33 లక్షలతో రెడ్డిపాలెం, ఆలూరుపాడులో సీసీ డ్రెయిన్లు, జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సదుపాయాలు కల్పించడంతో పాటు, పీఎంఏజీవై గ్రాంట్ కింద నిర్మించిన సీసీ డ్రెయిన్లను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబానికి అండగా ఎమ్మెల్యే దగుమాటి

- చికిత్స కోసం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేత



కావలి (చైతన్యరథం): కావలి నియోజకవర్గం, బోగోలు మండలం, నాగులవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి తిరుమల రాజు ఇటీవల అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆయనను మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కిమ్స్ హాస్పిటల్‌లో వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వహించి, తిరుమల రాజుకు మరింత చికిత్స అవసరమని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అయితే చికిత్సకు అయ్యే ఖర్చు అధికంగా ఉండటంతో, ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. వైద్య ఖర్చులను భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు సహాయం కోసం ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని ఆశ్రయించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేని కలిసి తమ్మిశెట్టి తిరుమల రాజు ఆరోగ్య పరిస్థితి, ఆసుపత్రిలో కొనసాగుతున్న చికిత్స, కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి వివరించారు. కుటుంబ సభ్యుల సమస్యను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి వెంటనే స్పందించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో చికిత్స కోసం రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎల్‌ఓసీ ద్వారా మంజూరు చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన రూ.2 లక్షల మొత్తాన్ని ఈరోజు ఎమ్మెల్యే కార్యాలయంలో కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి స్వయంగా అందజేశారు.

## ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరాల కృషి : ఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు (చైతన్యరథం): నియోజకవర్గంలోని పోదలకొండపల్లి గ్రామం నందు "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం – సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ, గ్రామ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేకి సాగర స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పట్టణం, గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మండలం తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నిబద్ధత కలిగిన నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ... కొనియాడిన నేతలు

గుంటూరు (చైతన్యరథం): మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నిబద్ధత కలిగిన నాయకుడని పలువురు నేతలు కొనియాడారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన కన్నా లక్ష్మీనారాయణ ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అనేక కీలక బాధ్యతలు చేపట్టి ప్రజాసేవకు అంకితమయ్యారని అన్నారు. కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలతో పాటు ఆయన 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని పురస్కరించుకుని గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు కూటమి నాయకులు హాజరయ్యారు. యువకుడిగా ఉన్న సమయంలో పోలీసు అధికారి కావాలని కన్నా లక్ష్మీనారాయణ భావించారని, అనంతరం ప్రజాప్రతినిధిగా రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ జీవితంలో అనేక కీలక శాఖలకు మంత్రిగా పనిచేసి తనదైన ముద్ర వేశారని అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలకు కన్నా లక్ష్మీనారాయణ లాంటి నేత ఎమ్మెల్యేగా రావడం ఎంతో శుభసూచికమన్నారు.

# రైతుల ప్రయోజనాల కోసం 'కర్షక' యాప్ : ఎమ్మెల్యే కందికుంట

కదిరి (చైతన్యరథం): కదిరి పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న వాయిస్ ఆఫ్ సిటిజన్ కార్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగిస్తూ రైతుల ప్రయోజనాల కోసం అందుబాటులోకి తీసుకురానున్న 'కర్షక' యాప్‌పై కదిరి నియోజకవర్గ వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని 'కర్షక' యాప్ ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడం, పంటలకు వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించడం, పంట నష్టాలను నివారించేందుకు అవసరమైన సూచనలు అందించడం, పంట దిగుబడిని పెంచే విధంగా రైతులకు శాస్త్రీయ సలహాలు అందించడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం ద్వారా రైతులకు మరింత



మెరుగైన సేవలు అందించడంతో పాటు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# బద్వేలులో ఉత్సాహభరితంగా సాగిన హర్ ఘర్ తిరంగా

బద్వేలు (చైతన్యరథం): నియోజకవర్గం, బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సుమారు 300 మోటార్ సైకిళ్లతో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం సాయంత్రం 4:30 గంటలకు బద్వేలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జ్ మంచూరు సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని ఉత్సాహంగా సాగిన ర్యాలీ నెల్లూరు రోడ్డు మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు చేరుకుని, అక్కడి నుంచి తిరిగి బద్వేలు మున్సిపల్ కార్యాలయం వరకు కొనసాగి ముగిసింది. ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మంచూరు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ... హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాలను చాటాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, యువతలో దేశభక్తి స్ఫూర్తిని మరింతగా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ జెండా పట్ల గౌరవాన్ని చాటాలని స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రజలను కోరారు. సుమారు 300 మోటార్




సైకిళ్లతో జాతీయ జెండాలను చేతబూని నిర్వహించిన ఈ బైక్ ర్యాలీ బద్వేల్ పట్టణంలో దేశభక్తి స్ఫూర్తిని చాటింది. యువత, అధికారులు, ప్రజల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎ.చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ పాల్గొన్నారు.

# స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీని సందర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

మడకశిర (చైతన్యరథం): నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు సొంత నిధులతో 10 వాటర్ ట్యాంకర్ల పంపిణీ మడకశిర నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు తన సొంత నిధుల నుండి రూ.27,00,000 వ్యయంతో 10 వాటర్ ట్యాంకర్లను అందించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి 2 చొప్పున మొత్తం 10 వాటర్ ట్యాంకర్లను కేటాయించారు. ఈ ట్యాంకర్ల ద్వారా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన తాగునీటి సేవలు అందించనున్నారు. పీ-4 స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమ స్ఫూర్తితో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా, వాల్మీకి సర్కిల్ నుండి యోగివేమన సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సతీష్ కుమార్, ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు హాజరయ్యారు. ప్రజా అవసరాలను గుర్తించి, సొంత నిధులతో తాగునీటి




సదుపాయాల కోసం 10 వాటర్ ట్యాంకర్లను అందించడం మడకశిర నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగుగా నిలిచింది.

# స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీని సందర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

●మంత్రి నారా లోకేష్‌తో వర్శిటీ విశేషాలు పంచుకున్న సునీత

●అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ ఒక అద్భుతమని వెల్లడి



అమెరికా / రాప్తాడు (చైతన్యరథం): అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ ఒక అద్భుతం అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆమె బుధవారం స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీని సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే చదివిన నేపథ్యంలో యూనివర్శిటీ విశేషాలను ఎమ్మెల్యే సునీత పంచుకున్నారు. మీరు ఎంబిఏ చదివిన, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థల్లో ఒకటిగా ఉన్న అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీని సందర్శించానని.. ఈ ఫోటోలను తమకి పంపుతున్నట్లు చెప్పారు. ప్రపంచంలోనే 3వ స్థానంలో ఉన్న ఈ యూనివర్శిటీలో మీరు చదవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా స్టాన్‌ఫోర్డ్ ఎంబిఏ ప్రోగ్రామ్, ప్రపంచవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అగ్రశ్రేణిలో కొనసాగుతోందని తెలుసుకున్నానన్నారు. ఇక్కడ సీటు సాధించడం అత్యంత కఠినమైన విషయమని.. అలాంటిది మీరు ఇక్కడ చదవడం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే ప్రపంచాన్ని శాసిస్తున్న అనేక దిగ్గజ కంపెనీల వ్యవస్థాపకులు ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకుల్లో ఉన్నారని, దాదాపు 21 మందికి పైగా నోబెల్ బహుమతి గ్రహీతలు ఇక్కడ చదివిన వారు ఉన్నారని తెలుసుకున్నట్లు చెప్పారు. ఇంత గొప్ప యూనివర్శిటీలో చదువుకున్నారు కాబట్టే.. మీరు రాష్ట్రానికి ఇలా అత్యుత్తమ సేవలు అందించగలుగుతున్నారన్నారు. ఈరోజు రాష్ట్రానికి లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకురావడం, విద్యాశాఖలో వినూత్నమైన సంస్కరణలు తీసుకొస్తున్నారంటే ఇక్కడ మీరు పొందిన విజ్ఞానం అని అర్థమవుతోందన్నారు. ఇలాంటి యూనివర్శిటీలో మీరు చదివినందుకు, అలాగే మీరు మన రాష్ట్ర మంత్రి అయినందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. అయితే రాయలసీమ ప్రాంతంలో ఎస్వీయూనివర్శిటీ, జేఎన్టీయూలు తప్ప పెద్దగా చెప్పుకోదగ్గ యూనివర్శిటీలు లేవని.. మీరు ప్రత్యేకంగా చొరవ చూపి స్టాన్ ఫోర్డ్ లాంటి ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థల్ని నెలకొల్పాలని మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు.

# అర్హత ఉన్న ప్రతి చేనేతకు నేతన్నసేవ అందుతుంది

●వైసీపీ ట్రాప్‌లో పడి.. గందరగోళానికి గురి కావద్దు

●చేనేత కార్మికులకు ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ సూచన

ధర్మవరం (చైతన్యరథం): అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికునికి.. నేతన్న సేవ పథకం ద్వారా 25వేల సాయం అందుతుందని.. ఈవిషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. గత నాలుగైదు రోజులుగా నేతన్న సేవపై నెలకొన్న ఆందోళనపై శ్రీరామ్ స్పష్టతనివ్వడమే కాకుండా.. వైసీపీ నాయకుల విమర్శలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ధర్మవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులు చూసి.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, సవిత చొరవ తీసుకుని నేతన్న సేవ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈనెల 7న చేనేత దినోత్సవం సందర్భంగా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారన్నారు. పథకం ప్రారంభం రోజున కొంతమంది చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లోకి 25వేల రూపాయలు జమ అయిందన్నారు. వారాంతపు సెలవులు, సాంకేతిక సమస్యల కారణంగా డబ్బు జమ చేయడంలో కొంత మేర ఆలస్యం జరిగిందన్నారు. అయితే ఇప్పటికే దాదాపు 90 శాతం మంది చేనేత కార్మికులకు పథకం అందిందన్నారు. మిగిలిన 10శాతం మందికి కూడా వారం పదిరోజుల్లో కచ్చితంగా నగదు జమ అవుతుందన్నారు. గతంలో అమలు చేసిన సిక్స్ స్టెప్ వాల్యుయేషన్ కారణంగా, బ్యాంక్ అకౌంట్ కు ఆధార్ అనుసంధానం కాని అకౌంట్స్ వంటి కారణాలతో నగదు జమ కాలేదన్నారు. వాటిని పరిష్కరించే విధంగా తాము చొరవ తీసుకుంటున్నామన్నారు...



**వైసీపీ ట్రాప్‌లో పడి ఎవరూ ఆందోళన చెందవద్దు.. శ్రీరామ్**

గత ప్రభుత్వం కంటే ఎంతో పారదర్శకంగా నేతన్న సేవ పథకాన్ని అమలు చేస్తుంటే.. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డితో పాటు మరికొందరు ప్రభుత్వంపై బురద జల్లాలని చూస్తున్నారని శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతన్న సేవ పథకం రాష్ట్రంలో 71,536 మంది నేత కార్మికులకు అందుతుంటే.. అందులో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన కార్మికులే 12వేల మంది ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని చేనేతలపై ఎక్కడా లేని ప్రేమను చూపిస్తూ.. మాజీ ఎమ్మెల్యే నిరసనలు చేస్తున్నారన్నారు. వాస్తవంగా తన వద్దకు కూడా కొందరు కార్మికులు డబ్బు పడలేదని వచ్చారని.. అయితే అదే రోజు రాత్రే వారికి డబ్బు పడిందన్నారు. ఇది నా వల్లనో, మంత్రి సత్యకుమార్ వల్లనో జరగలేదని.. కేవలం వారికి అర్హత ఉంది కాబట్టే పడిందన్నారు. చివరకు కేతిరెడ్డి నిరసన సమయంలో ఆయన చుట్టూ ఉన్న వారికి కూడా డబ్బు పడిందన్నారు. ఇంకా పది రోజుల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అయితే మగ్గాలు లేని ఊర్ల నుంచి జనాన్ని తీసుకొచ్చి ఇంత మంచి పథకంపై బురద జల్లుతున్నారన్నారు. మెగా డీఎస్సీ విషయంలో కూడా ఇలాగే రాద్ధాంతం చేస్తూ.. మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలంటున్నారన్నారు. పైగా మాజీ ఎమ్మెల్యే అధికారుల విషయంలో మాట్లాడుతున్న భాష కూడా సరైంది కాదన్నారు. గత వైసీపీ హయాంలో సచివాలయాల వద్దకు వెళ్లి సిబ్బందిని ఇష్టమొచ్చినట్టు మాట్లాడినట్టు.. ఇప్పుడు అదే దోరణిలో ఉన్నారన్నారు. ఈనెల 15వ తేదిన పురుగుల మందు డబ్బాలతో ఎందుకు వస్తారని నిలదీశారు. చేనేతలందరికీ ఈ పథకం అందిందనే బాధతో మీరేమైనా వస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇలాంటి దోరణి మానుకుని.. అర్హులకు ఎక్కడ పథకం అందలేదో ఒక్కసారి సమాధానం చెప్పాలన్నారు. పథకం అందని కార్మికులకు ఈనెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని.. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉండాలి

● పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత సమీక్ష సమావేశం

పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండ క్యాంపు కార్యాలయంలో రొద్దం మండల ముఖ్య నాయకులు, మండల అధికారులతో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలు, త్వరలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని సూచించారు.




ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మంత్రి సవిత ఆదేశించారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లవచ్చని మంత్రి సవిత పేర్కొన్నారు.

## వ్యాపార, కమ్యూనిటీ నెట్‌వర్క్

# బలోపేతమే లక్ష్యం

### ఐదుగురు ప్రాంతీయ డైరెక్టర్లను ప్రకటించిన AAA-ABC

**యూఎస్ఏ:** ఉత్తర అమెరికాలో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ వాసుల వ్యాపార, వృత్తిపరమైన, సామాజిక సంబంధాలను మరింత పటిష్టం చేసేందుకు 'ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్' (AAA), 'ఆంధ్రప్రదేశ్ బిజినెస్ కమ్యూనిటీ' (ABC) సంయుక్తంగా ముందుకు వచ్చాయి. ఇందులో భాగంగా 2028 నుంచి 2031 వరకు సేవలందించే ఐదుగురు ప్రాంతీయ డైరెక్టర్లను అధికారికంగా ప్రకటించాయి.
ఈ నూతన నాయకత్వం స్థానిక సంస్థలతో సమన్వయం చేస్తూ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించనుంది.
ఈ నియామకాల ద్వారా మొత్తం 25 అమెరికన్ రాష్ట్రాలను ఐదు ప్రాంతాలుగా విభజించి డైరెక్టర్లకు బాధ్యతలు అప్పగించారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు నూతన వ్యాపార అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ఈ బృందం పనిచేయనుంది.




**నియమితులైన ప్రాంతీయ డైరెక్టర్లు, వారి పరిధిలోని రాష్ట్రాలు:**

**బొల్లి వెంకట రామకృష్ణ (వెంకట్):** లాస్‌వేగాస్‌కు చెందిన ఐటీ నిపుణుడు, పారిశ్రామికవేత్త, రియల్ ఎస్టేట్ ఇన్వెస్టర్ అయిన వెంకట్... మెంటరింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, వ్యాపార అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఈయనకు నార్త్ కరోలినా, నెవాడా, అలబామా, టెక్సాస్, కాలిఫోర్నియా రాష్ట్రాలు కేటాయించారు.

హనుమంతు సింహబలుడు (సింహ): ఉత్తర అమెరికాలో మీడియా నిపుణుడు. విశ్వసనీయ జర్నలిజం, కమ్యూనిటీ భాగస్వామ్యం ద్వారా ఈ ప్రాంతాల మధ్య బలమైన వారధిగా నిలవనున్నారు. న్యూజెర్సీ, న్యూయార్క్, వర్జీనియా, ఇల్లినాయిస్, మిస్సోరీ రాష్ట్రాలను ఈయనకు అప్పజెప్పారు.

దొమ్మరాజు హేమంత్ వర్మ: టెక్నాలజీ, స్టార్టప్స్, కన్సల్టింగ్, రియల్ ఎస్టేట్ రంగాల్లో అనుభవం ఉన్న ఈయన ఈఆర్పీ అండ్ ఆటోమేషన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాలు, కమ్యూనిటీ వృద్ధి ఈయన ప్రాధాన్యతలు. పెన్సిల్వేనియా, మేరీల్యాండ్, ఒహాయో, మసాచుసెట్స్, ఓక్లహోమా రాష్ట్రాలు కేటాయించారు.

**గొట్టిపాటి కళ్యాణ్:** 18 ఏళ్లకు పైగా ఐటీ, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ అనుభవం కలిగిన పారిశ్రామికవేత్త. వాషింగ్టన్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పూర్తి చేసిన ఈయన ఏపీ సంస్కృతిని కాపాడుతూ తెలుగు సమాజానికి సేవ చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్న ఈయనకు అరిజోనా, వాషింగ్టన్, యూటా, కొలరాడో, న్యూ మెక్సికో రాష్ట్రాలు కేటాయించారు.

**చౌటకూరి చేతన్‌రెడ్డి:** ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ రంగంలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవమున్న టెక్ నిపుణుడు. రియల్ ఎస్టేట్ పెట్టుబడులతో పాటు సరికొత్త వ్యాపార భాగస్వామ్యాలు, సుస్థిర కమ్యూనిటీ ప్రభావాన్ని ఆశిస్తూ ముందుకు వెళ్తున్నారు. ఈయన జార్జియా, మిషిగన్, టెన్నెస్సీ, ఫ్లోరిడా, సౌత్ కరోలినా రాష్ట్రాలకు బాధ్యత వహిస్తారు.

### భవిష్యత్ కార్యాచరణ...

2028 జనవరి 1 నుంచి 2031 డిసెంబరు 31 వరకు అమల్లో ఉండే పదవీ కాలంలో డైరెక్టర్లు అందరూ కలిసికట్టుగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, పరస్పర సహకారాన్ని విస్తరించడం, విభిన్న రంగాల నిపుణులను సమన్వయం చేయడం ద్వారా ఉత్తర అమెరికాలోని ప్రవాస ఆంధ్రప్రదేశ్ సమాజానికి మరింత ప్రయోజనం చేకూర్చేలా AAA-ABC సంస్థ ఈ ప్రణాళికను రూపొందించింది.



## స్టాన్‌ఫోర్డ్ లాంటి యూనివర్సిటీలు

# ఏపీకి రావాలి

### రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

**స్టాన్‌ఫోర్డ్:** అమెరికా పర్యటనలో భాగంగా ఎంతో మంది మేధావులతో పాటు మంత్రి నారా లోకేష్ విద్యనభ్యసించిన స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సందర్శించారు.
విశ్వవిద్యాలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ప్రమాణాలతో కూడిన ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో, అందులోనూ అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసే దిశగా ఆలోచించాలని మంత్రి లోకేష్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు. స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రపంచ ప్రసిద్ధి వర్సిటీలో చదువుకున్న వారి అనుభవం ఇందుకు ఎంతో ఉపయోగపడుతుందని బలంగా నమ్ముతున్నానన్నారు. సాంకేతిక, విద్యా రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపడంలో లోకేష్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదని ఎమ్మెల్యే సునీత చెప్పారు.



## అంబరాన్నంటిన తెలుగు సాంస్కృతిక సమితి

# స్వర్ణోత్సవాలు

### వంగూరి చిట్టెన్‌రాజు దంపతులకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం




**టెక్సాస్:** అమెరికా గడ్డపై తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, భాషా వికాసానికి కృషి చేస్తున్న ప్రతిష్టాత్మక 'తెలుగు సాంస్కృతిక సమితి, హ్యూస్టన్' (TCA) 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. టెక్సాస్‌లోని రోసెన్‌బర్గ్ నగరంలో గల 'ఫోర్ట్ బెండ్ ఎపిక్ సెంటర్' వేదికగా వేడుకలు కనుల పండువగా జరిగాయి. యాభై ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పురస్కరించుకుని సంస్థ స్థాపక బృందాన్ని, పూర్వ నిర్వాహకులను వేదికపై ప్రత్యేకంగా సన్మానించారు. ప్రవాసంలో తెలుగు భాషా జెండాను ఎగురవేసిన వారి దూరదృష్టిని, సమాజానికి వారు అందించిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. స్వర్ణోత్సవ వేడుకల ప్రాంగణమంతా తెలుగు సంస్కృతి, సాహిత్య పరిమళాలతో శోభిల్లింది. ప్రధాన వేదికకు 'తెలుగు విజయం', ఉప వేదికలకు కవిత్రయం, ప్రబంధ యుగ దిగ్గజాలైన 'నన్నయ, తిక్కన, ఎర్రన, పోతన' పేర్లతో నామకరణం చేసి తెలుగు భాషా సాహిత్యాలకు పట్టాభిషేకం చేశారు. కాకతీయ, విజయనగర, శాతవాహన వైభవాలను ప్రతిబింబిస్తూ స్వాగత ద్వారాలు మన ప్రాచీన సంస్కృతిని గుర్తుకుతెచ్చాయి.




శ్రీ సీతారామ కల్యాణం, వేద పఠనం, పూర్ణకుంభ స్వాగతాలతో ఆధ్యాత్మిక, వైభవోపేత వాతావరణంలో కార్యక్రమాలు అంకురార్పణ జరుపుకున్నాయి. వంగూరి చిట్టెన్‌రాజు, శారద రాచకొండ ఆధ్వర్యంలో 50 ఏళ్ల సంస్థ చరిత్రను అక్షరబద్ధం చేస్తూ రూపొందించిన స్మారక సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ప్రముఖ సాహితీవేత్తలు పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, అవసరాల శ్రీనివాసరావు, వామరాజు సత్యమూర్తి, బలభద్రపాత్రుని రమణి, అరుణ సుబ్బారావు ప్రసంగాలు, ఆలోచనలు, ప్రవాసంలో తెలుగు భాషపై ఉన్న మమకారం స్వర్ణోత్సవాలకు మరింత వన్నె తెచ్చాయి. 'స్వర్ణ వైభవం' నృత్య రూపకం ప్రేక్షకులను ముగ్ధులనుచేసింది.

భారతదేశం నుంచి విచ్చేసిన ప్రముఖ సినీ నటులు 'పద్మశ్రీ' రాజేంద్రప్రసాద్, ఆలీ, నవీన్ పోలిశెట్టి, రీతూ వర్మ, అవసరాల శ్రీనివాస్ తమ నటన, హాస్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నేపథ్య గాయకులు సునీత, కృష్ణ చైతన్య, "ఇన్‌ఫ్యూజన్" బృందం ఆలపించిన మధురమైన పాటలు అలరించాయి.

ముఖ్య అతిథిగా ఐక్యరాజ్యసమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్, ప్రత్యేక అతిథిగా హ్యూస్టన్ కాన్సులేట్ జనరల్ డీసీ మంజునాథ్ హాజరయ్యారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా జితేందర్ రెడ్డి, సంస్థ ప్రెసిడెంట్‌గా యాదగిరి రెడ్డి కుడుముల వ్యవహరించారు.

వంగూరి చిట్టెన్‌రాజు-రత్నకుమారి పాప దంపతులకు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. తెలుగు సమాజానికి విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులను సేవా పురస్కారాలతో ఘనంగా గౌరవించారు. హ్యూస్టన్, డల్లాస్, ఆస్టిన్ వంటి పలు నగరాల నుంచి తెలుగువారు వేలాదిగా తరలివచ్చారు. వారందరినీ ఒకే వేదికపైకి చేర్చి, పరదేశంలో ఉన్నప్పటికీ మాతృభూమి సాంస్కృతిక మూలాలను భావితరాలకు పదిలంగా అందించడంలో హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి విజయవంతమైందని ప్రతినిధులు కొనియాడారు.

# 80వ స్వాతంత్ర్య వేడుకలకు ఎర్రకోట ముస్తాబు

- చరిత్రలో తొలిసారిగా 'వందేమాతరం' ఆలాపన
- 'వికసిత్ భారత్@2047 కోసం యువశక్తి' థీమ్‌తో ఏర్పాట్లు



న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని చారిత్రక ఎర్రకోట ప్రాంగణం 80వ స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబైంది. శనివారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోట బురుజులపై జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. ఈ ఏడాది 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు' 'వికసిత్ భారత్@2047 కోసం యువశక్తి' అనే ద్వంద్వ థీమ్‌లతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఎర్రకోట వేడుకల చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా తొలిసారిగా స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో 'వందేమాతరం' గీతాన్ని అధికారికంగా ఆలపించనున్నారు. పతాకావిష్కరణ సమయంలో భారత వాయుసేనకు చెందిన మిగ్-17 హెలికాప్టర్ల ద్వారా గగనతలం నుంచి పూలవర్షం కురిపిస్తారు. ఎర్రకోట ఎదురుగా ఉన్న జ్ఞానపథ్‌లో 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 'మై భారత్' వలంటీర్లు ప్రత్యేకంగా 'వందేమాతరం' అక్షరాల ఆకృతిలో కూర్చుంటారు. ఈసారి వీఐపీ సంస్కృతికి స్వస్తి పలుకుతూ వివిధ ఎన్‌క్లోజర్లకు దేశంలోని ప్రముఖ సరస్సుల పేర్లను ఖరారు చేశారు. దేశం నలుమూలల నుంచి వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన దాదాపు 5వేల మంది ప్రముఖులకు ప్రభుత్వం ప్రత్యేక ఆహ్వానాలు పంపింది. సందర్శకులు, పర్యాటకుల సౌకర్యార్థం ఉచిత మెట్రో ప్రయాణ సదుపాయంతో పాటు క్యూఆర్ కోడ్ ఈ - ఆహ్వాన పత్రికలను అందుబాటులోకి తెచ్చారు. వేడుకలు పూర్తయిన వెంటనే ఎర్రకోట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా 'స్వచ్ఛత ప్రచారం' పేరిట ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

మరోవైపు ఢిల్లీలో ముందెన్నడూ లేని రీతిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. చారిత్రక ఎర్రకోట ప్రాంగణాన్ని భద్రతా దళాలు తమ ఆధీనంలోకి తీసుకుని బహుళ అంచెల భద్రతా వలయాన్ని నిర్మించాయి. స్వాతంత్ర్య వేడుకకు వీఐపీలు, వివిధ రంగాల ప్రతినిధులు సహా దాదాపు 25వేల మంది హాజరవుతారని అధికారుల అంచనా. ఈ నేపథ్యంలో ఎర్రకోట పరిసర ప్రాంతాలతో పాటు వచ్చిపోయే రహదారులను నిరంతరం పర్యవేక్షించేందుకు వెయ్యికి పైగా సీసీటీవీ కెమెరాలను అమర్చారు. అనుమానితులు, నేరస్థుల కదలికలను క్షణాల్లో గుర్తించేందుకు అత్యాధునిక ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో కూడిన ప్రత్యేక నిఘా వాహనాలను రంగంలోకి దించారు. అనుమానితులను తనిఖీ చేసేందుకు ఢిల్లీ పోలీసులు తొలిసారిగా 'అభిజ్ఞాన్' మొబైల్ యాప్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ స్కానర్ ద్వారా పట్టుబడిన వ్యక్తి వేలిముద్ర తీయగానే, దాదాపు 1.32 కోట్ల మంది నేరస్థుల డేటాబేస్‌తో అనుసంధానమై కేవలం కొన్ని సెకన్లలోనే వారి నేర చరిత్రను ఈ యాప్ బయటపెడుతుంది.

జంతర్ మంతర్ వద్ద సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ నిరసనల నేపథ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని రాజధానివ్యాప్తంగా తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. ఎర్రకోటకు వచ్చే అన్ని మార్గాల్లోని చెక్‌పోస్టుల వద్ద కఠిన తనిఖీలు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు భద్రతా సంస్థలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయని ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

---

## ఆస్తుల వివాదానికి స్వస్తి పలకండి

**విజయ్ మాల్యాకు, బ్యాంకులకు బాంబే హైకోర్టు సూచన**

ముంబయి: పరారీలో ఉన్న పారిశ్రామిక వేత్త విజయ్ మాల్యా, బ్యాంకుల మధ్య ఆస్తుల వివాదానికి ఇక స్వస్తి పలకాలని బాంబే హైకోర్టు సూచించింది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఈ వ్యవహారా నికి ఒక ముగింపు తీసుకురావాలని తెలిపింది. వివాదాన్ని ఇలాగే కొనసాగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం తన ఆస్తులను వినియోగించుకునేందుకు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు ఇచ్చిన



అనుమతిని తప్పుబడుతూ విజయ్ మాల్యా 2020లో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ మిలింద్‌జాదవ్ విచారించారు. ఈడీ జప్తు చేసిన ఆస్తుల ప్రస్తుత పరిస్థితి, దర్యాప్తు పురోగతిపై వివరాలు ఇవ్వాలని ఆదేశం చారు. ఇంకా దీనిని పట్టుకుని కూర్చో కుండా ముందుకు సాగాలని జడ్జి స్పష్టం చేశారు. ఇరుపక్షాలు కూర్చుని ఆచరణా త్మకమైన పరిష్కారం వైపు అడుగులు వేయాలని సూచించారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం పలుబ్యాంకుల నుంచి మాల్యా దాదాపు రూ.9వేల కోట్ల రుణం తీసుకున్నారు. వాటిని చెల్లించకపోవడం తో ఆయనపై కేసులు నమోదయ్యాయి. 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి విదేశాలకు పరారయ్యారు. దాంతో 2019లో ఆయన్ను 'పరారైన ఆర్థిక నేరస్తుడిగా' ప్రకటించారు. చట్టప్రకారం మాల్యా ఆస్తులను జప్తుచేసి రుణాల రిక వరీకి చర్యలుచేపట్టారు. దాంతో ఆయన హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు.

పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించడాన్ని 2018 ఎఫ్ఈఓ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును తన పిటిషన్లలో ప్రశ్నించారు. ఈ రెండు పిటిషన్లను విచారించాలంటే మాల్యా ముందుగా భారత న్యాయ వ్యవస్థ పరిధిలోకి రావాలని కోర్టు సూచించింది. అయితే బ్రిటన్ కోర్టుల ఆంక్షల కారణంగా మాల్యా భారత్‌కు ఎప్పుడు వస్తారో చెప్పలేమని ఆయన తరపు న్యాయవాది తెలిపారు. మరోవైపు మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు వీలుగా బ్రిటన్‌తో కేంద్రం సంప్రదింపులు కొనసాగిస్తోంది.

---

## నా మాటకు విలువ లేదు... అందుకే పార్టీ మారా

**రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్**

ఆమ్ ఆద్మీ పార్టీలో తనమాటకు విలువ లేకపోవడంతోనే బీజేపీలో చేరినట్టు మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్‌సింగ్ తెలిపారు. క్రీడల అభి వృద్ధి కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే 'ఆప్'లో చేరానని... తన సూచనలను పార్టీ పెద్దలు పట్టించుకోకపోవడంతో బయటకు రావాల్సి వచ్చిందని ఓ పాడ్ కాస్ట్‌లో చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో హర్భజన్‌తోపాటు మరో ఆరుగురు ఆప్ ఎంపీలు బీజేపీలో చేరారు. ఈ నేపథ్యం లో హర్భజన్ తాజాగావివరణ ఇచ్చారు. 'రాజ్యసభలో ఆప్ తరపున ప్రాతినిధ్యం వహించేందుకుపంజాబ్ సీఎం భగవంత్ మాన్ నన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఆ సమయంలో క్రీడలకు సంబంధించిన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తానని ఆయనతో చెప్పాను. రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశా' అని చెప్పారు. పంజాబ్‌లోనే కాకుండా దేశ వ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించేందుకు అవకాశం రావడంతోనే ఆప్‌లో చేరాన న్నారు. కానీ నా ఆలోచనలను ఎవరూ పట్టించుకోలేదని, కనీసం ఒక్క సూచన నైనా అమలుచేసి ఉంటే పార్టీని వీడే వాడిని కాదని హర్భజన్ చెప్పారు.

పార్టీని వీడిన తర్వాత ఆప్ తనను విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. తన ఇంటి వద్ద నిరసనలు చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేయడంపై స్పందిస్తూ.. 'నేను ఎవరిని మోసం చేశాను..? దేశ ప్రజలు నన్ను క్రికెట్ కారణంగా ప్రేమించారు. పంజాబ్ కోసం మీరు ఏం చేశారో చెప్పాలి. నన్ను ద్రోహి అని పిలిచినంత మాత్రాన నేను ద్రోహిని కాను' అన్నారు. పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య తీవ్రంగా ఉందని హర్భజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు క్రీడల్లో పంజాబ్ అగ్రస్థానంలో ఉండేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పంజాబ్‌లోని ఓ చిన్న గ్రామం నుంచి



ఒకప్పుడు తొమ్మిది మంది హాకీ ఆటగాళ్లు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాలు విపరీతంగా పెరగడంతో యువత తీవ్రంగా నష్టపోతోందన్నారు.

---

## దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే రకమైన ధర అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా త్వరలోనే 'కోల్ ఎక్స్ఛేంజ్' ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. తద్వారా బొగ్గు కొనుగోలు ప్రక్రియ మరింత సులభతరమై, విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల తుది వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. అంతే కాకుండా మౌలిక రంగానికి కీలకమైన



సిమెంట్, స్టీల్ వంటి రంగాల ఉత్పత్తుల ధరల్లో పెరుగుదలను నిరోధించేందుకు కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని వివరించారు.

ఖనిజాలు (మినరల్స్) విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలపై కేంద్రం ఎలాంటి పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాలు విధించే పన్నులు, సెస్‌ల వ్యవహారాల్లో కేంద్రం జోక్యం చేసుకోదని హామీ ఇచ్చారు. రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగా ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే దేశంలో ఖనిజ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రస్తుతం దేశీయంగా ఖనిజాల ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం బహుముఖ వ్యూహాలతో పలు చర్యలు చేపడుతోందని మంత్రి వెల్లడించారు.

# చీకట్లో బంగ్లాదేశ్

### తీవ్ర విద్యుత్ సంక్షోభంలో దేశం - సాయం చేయాలంటూ ఇండియాకు వినతి



బంగ్లాదేశ్ కొద్ది రోజులుగా చీకట్లో మగ్గుతోంది. దేశం ఎప్పుడూ లేని విధంగా తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏకంగా 9-10 గంటల విద్యుత్ కోతలు నమోదవుతున్నాయి. తారిక్ రహమాన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఈ విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కోలేకపోతోంది. చివరకు సాయం కావాలని భారత్‌ను కోరింది. దేశంలో 18వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా ఉత్పత్తి మాత్రం 13వేల వాట్లకు తక్కువగానే ఉంది. అసలే అక్కడి ప్రజలు ప్రస్తుతం తీవ్రమైన ఎండ, ఉక్కపోతలతో అల్లాడుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ క్రమంలో స్థానిక విద్యుత్ పంపిణీ కేంద్రాలైన పవర్ స్టేషన్లపై, అధికారులపై ప్రజలు దాడులు చేస్తున్నారు. దీంతో పవర్ స్టేషన్ల వద్ద రక్షణ కల్పించాల్సిందిగా పోలీసుల్ని ప్రభుత్వం ఆదేశించింది. విద్యుత్ కోతను ఎదుర్కొనేందుకు పరిశ్రమలకు విద్యుత్ సరఫరా తగ్గించివేసింది. రాజధాని ఢాకాతో పాటు అనేక నగరాల్లో షాపులు, ఇతర వాణిజ్య, వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్‌ను రాత్రి ఎనిమిది గంటలకే మూసేయాలని ఆదేశించింది. రైతులు కూడా తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రైతులు, వ్యాపార సంస్థల యజమానులు, పరిశ్రమలు విద్యుత్ కొరత ప్రభావానికి గురవుతున్నాయి.

ఈ విద్యుత్ సంక్షోభానికి కారణం చమురు కొరత. తగినంత చమురు లేకపోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతోంది. బంగ్లాదేశ్ 90 శాతం చమురును, 30 శాతం గ్యాస్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. అయితే విదేశాల నుంచి తగినంత చమురు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో సాయం చేయాల్సిందిగా ఇండియాను బంగ్లాదేశ్ కోరింది. తమకు భారీగా డీజిల్ కావాలని కోరగా ఇండియా ఇంకా స్పందించలేదు. నిజానికి రెండు దేశాల మధ్య సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ.. బంగ్లాదేశ్‌కు గతంలో ఇండియా డీజిల్ సరఫరా చేసింది.

# టీకాలతో ట్రంప్ ఆటలు



### ఎంఎంఆర్ వ్యాక్సిన్‌ను ముక్కలు చేయాలని వివాదాస్పద ఉత్తర్వులు

వాషింగ్టన్: భారీ సుంకాల విధింపు, అంతర్జాతీయ వివాదాలతో ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో తీవ్ర వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో పిల్లల టీకాల (వ్యాక్సిన్లు) సిఫార్సులు, షెడ్యూళ్లలో కీలక మార్పులు చేస్తూ ఆయన ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) సంతకం చేశారు. అయితే ఈ కొత్త విధానం పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని, వారిని ఇన్ఫెక్షన్ల ప్రమాదంలోకి నెడుతుందని వైద్య నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

పాత విధానం ప్రకారం పిల్లలకు వేర్వేరు వ్యాక్సిన్లను ఒకేసారి కాంబినేషన్ మోతాదుగా ఇచ్చేవారు. దీనివల్ల పిల్లలను మాటిమాటికీ ఆసుపత్రులకు తీసుకెళ్లే ఇబ్బంది తగ్గేది. దీనికి భిన్నంగా, వ్యాక్సిన్లను వేర్వేరు విభాగాలుగా విభజించి ఒక్కో మోతాదును వేర్వేరు ఆసుపత్రి సందర్శనల్లో ఇవ్వాలని ట్రంప్ నూతన విధానంలో ప్రతిపాదించారు. అలాగే అందరూ పిల్లలకు అన్ని వ్యాక్సిన్లు వేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.

నూతన నిబంధనల ప్రకారం.. తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా, డిఫ్తీరియా, టెటానస్, పెర్టుసిస్, పోలియో, హిబ్, న్యుమోకోకల్ వ్యాధి, హెచ్‌పీవీ, ఆటలమ్మ వ్యాక్సిన్లను అందరికీ ఉచితంగా/సాధారణంగా అందిస్తారు. కానీ హెపటైటిస్-ఎ, హెపటైటిస్-బి, ఆర్ఎస్‌వీ, మెనింగోకోకల్ వంటి టీకాలను మాత్రం కేవలం వ్యాధి ముప్పు ఎక్కువగా ఉన్న పిల్లలకే ఇస్తారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పిల్లలకు తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా నివారణకు 'ఎంఎంఆర్' వ్యాక్సిన్‌ను ఒకే డోసుగా ఇస్తున్నారు. కానీ దీనిని మూడు వేర్వేరు వ్యాక్సిన్లుగా విడదీసి ఇవ్వాలని ట్రంప్ తాజాగా ఆదేశించారు. ప్రస్తుతం అమెరికా మార్కెట్లో ఇలా వేర్వేరు వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడంతో వాటిని తయారుచేసి అందుబాటులోకి తెచ్చేందుకు 90 రోజుల గడువు ఇస్తున్నట్లు ప్రెసిడెంట్ ట్రంప్ వెల్లడించారు.

మూడు వ్యాధులకు కలిపి ఒకేసారి టీకా వేయడం వల్ల ప్రమాదమని, వ్యాక్సిన్లే ఆటిజమ్‌కు కారణమవుతున్నాయని ట్రంప్ గతంలో వ్యాఖ్యానించారు. అయితే ఆయన వ్యాఖ్యలకు ఎటువంటి శాస్త్రీయ ఆధారం లేదని వైద్య నిపుణులు కొట్టిపారేశారు. అయినప్పటికీ ట్రంప్ తన మొండిపట్టు వీడకపోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాలో టీకాల శాతం పడిపోతూ తట్టు వ్యాధి విజృంభిస్తున్న సమయంలో ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం తల్లిదండ్రుల్లో తీవ్ర భయాందోళన, గందరగోళం సృష్టిస్తుందని అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొవిడ్ సమయం నుంచీ టీకాల వ్యతిరేక ఉద్యమాన్ని నడుపుతున్న అమెరికా ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ అభిప్రాయం మేరకే ట్రంప్ ఈ వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలుస్తోంది.

# 'బర్త్ టూరిజం'పై అమెరికా ఉక్కుపాదం

### ఏకంగా 600 మంది వీసాలు రద్దు!



వాషింగ్టన్: అమెరికా పౌరసత్వం కోసం జరుగుతున్న 'బర్త్ టూరిజం'పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కార్ తీవ్రస్థాయిలో ఉక్కుపాదం మోపుతోంది. కేవలం పిల్లలకు జన్మనివ్వడం ద్వారా యుఎస్ పౌరసత్వం పొందేందుకు ఇక్కడికి వస్తున్న వారిని అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఒక్క జులై నెలలోనే 9వ నెల గర్భంతో అమెరికాకు వచ్చిన 600 మంది విదేశీయుల వీసాలను రద్దు చేసినట్టు అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'బర్త్ టూరిజం నిరోధక టాస్క్‌ఫోర్స్' ద్వారా వీసాలను నిశితంగా పరిశీలించి ఈ రద్దు నిర్ణయం తీసుకున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు అమెరికా అమలు చేస్తున్న కఠినమైన వీసా నిబంధనల ప్రభావం విదేశీ విద్యార్థులపై కూడా పడింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫాల్ సీజన్‌లో అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈసారి ఏకంగా 1.12 లక్షల మంది విద్యార్థులు తగ్గినట్టు అధికారిక గణాంకాలు చెప్తున్నాయి.

# ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా కుట్ర

### ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడి



ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారులో జరిగిన పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ 'అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. 2025 నవంబరులో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. AQISను ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్టు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి AQISకు మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్టు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి తన నివేదికలో ప్రస్తావించినట్టు సమాచారం. దాంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు AQIS ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతావర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబరులో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. AQIS తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో AQIS కు పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# ఉగ్రవాది హఫీజ్ సయీద్‌కు నేను దాసుడిని

### పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని రాజకీయ నాయకులు, ఉగ్రవాద సంస్థల మధ్య ఉన్న అపవిత్ర బంధం మరోసారి బహిర్గతమైంది. లష్కరే తొయిబా = వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ మహమ్మద్ సయీద్‌కు తాను "దాసుడిని" (గులామ్‌ను) అంటూ పాకిస్తాన్ మాజీ హోం మంత్రి, అవామీ ముస్లిం లీగ్ అధినేత షేక్ రషీద్ అహ్మద్ చేసిన బహిరంగ వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. లష్కరే కమాండర్లు, ఇతర ఉగ్ర సంస్థల ప్రతినిధులతో కలిసి ఆయన ఒకే వేదికపై ప్రసంగించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

"నేను హఫీజ్ సయీద్ దాసుడను. గతంలో నా ఫోన్‌లో హఫీజ్ ఫోన్ నంబర్ దొరకడం వల్లే అమెరికా నన్ను దేశం నుంచి బహిష్కరించింది" అని షేక్ రషీద్ ఆ వేదికపై స్పష్టం చేశారు. హఫీజ్ సయీద్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించడమే కాకుండా, భారత వ్యతిరేక వ్యాఖ్యలతో విషం చిమ్మారు. 2020 నుంచి 2022 మధ్య ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో షేక్ రషీద్ హోం శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భారత వ్యతిరేక ఉగ్ర కార్యకలాపాలు, ఉగ్రవాదుల గురించిన అంశాలను రషీద్ ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. గతంలో 26/11 ముంబై ఉగ్ర దాడికి పాల్పడిన పాకిస్తానీ ఉగ్రవాది అజ్మల్ కసబ్ అడ్రస్ (చిరునామా)ను భారత్‌కు చెప్పింది పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫేనంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ముంబై దాడుల కుట్రదారుడైన హఫీజ్ సయీద్‌ను ఐక్యరాజ్యసమితి ఇప్పటికే అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అటువంటి వ్యక్తితో పాకిస్తాన్ మాజీ హోం మంత్రికి ఉన్న ప్రత్యక్ష సంబంధాలు ఆ దేశ ఉగ్రవాద అనుకూల ధోరణిని మరోసారి ప్రపంచం ముందు ఉంచాయి.

# నార్తర్న్ సీ రూట్‌పై భారత్ ఆసక్తి

### - రష్యా అధ్యక్షుడు పుతిన్



మాస్కో: ఆర్కిటిక్ సముద్ర మార్గానికి చెందిన 'నార్తర్న్ సీ రూట్' ప్రాజెక్టుపై భారత్ తీవ్ర ఆసక్తి చూపుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వెల్లడించారు. భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, పాశ్చాత్య దేశాల ఆంక్షల వేళ రష్యాతో వాణిజ్యాన్ని మరింత పెంపొందించుకోవడానికి భారత్ ఉత్సాహంగా ఉందన్నారు. ఈశాన్య రష్యాలో జరుగుతున్న సైనిక విన్యాసాలను వీక్షించేందుకు జపాన్ సమీపంలోని దీవులను సందర్శించిన ఆయన... 'ఆర్కిటిక్ రీజియన్స్ ఫోరమ్'లో భారత్ కీలక భాగస్వామిగా మారిందని స్పష్టం చేశారు. తూర్పు ఆసియా, యూరప్‌ల మధ్య అత్యంత సమీప షిప్పింగ్ మార్గంగా 'ఎన్ఎస్ఆర్'ను భావిస్తున్నారు. ఇందులో భాగంగానే చెన్నై-వ్లాదివోస్తోక్ నౌకా దళ కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నారు. సుమారు 10,380 కిలోమీటర్లు (5,647 నాటికల్ మైళ్లు) ఉన్న ఈ మార్గం ద్వారా ప్రయాణిస్తే కేవలం 12 రోజుల్లోనే గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు. గతంలో ముంబై నుంచి సెంట్ పీటర్స్‌బర్గ్ మార్గానికి 32 రోజులు (8,675 నాటికల్ మైళ్లు) పట్టగా... నూతన ఎన్ఎస్ఆర్ మార్గం ద్వారా రవాణా సమయం భారీగా ఆదా అవుతుందని భారత్ భావిస్తోంది.

**చైనాకు చెక్.. భారత్ వ్యూహాత్మక అడుగు**

ఇటీవలి కాలంలో చైనా, పాకిస్తాన్‌లతో సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో 'ఎన్ఎస్ఆర్' మార్గం ద్వారా భారత్ వ్యూహాత్మకంగా ప్రయోజనం పొందాలని చూస్తున్నట్లు రష్యా విశ్లేషిస్తోంది. ప్రాంతీయంగా చైనా ప్రభావాన్ని తట్టుకునేందుకు ఈ ప్రాజెక్ట్ భారత్‌కు కీలకమైనదిగా మారింది. మరోవైపు అమెరికా హెచ్చరికలను సైతం పక్కనపెట్టి రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేస్తున్న భారత్‌కు.. రాబోయే రోజుల్లో ఈ ప్రతిపాదిత సముద్ర వాణిజ్య మార్గం మరింత కీలకంగా మారనుంది. ఈ నౌకా రవాణా సీ ఆఫ్ జపాన్, ఈస్ట్ చైనా సీ, సౌత్ చైనా సీ, మలాకా జలసంధి మీదుగా సాగనుంది.

## క్రీడా భారత్ కోసం..

# చేతులు కలిపిన నీరజ్‌చోప్రా, గోపీచంద్



యువ క్రీడాకారులను సానబెట్టేందుకు ఇద్దరు దిగ్గజాలు చేతులు కలిపారు. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ కొత్తగా కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. గురువారం వారు ఇండియన్ స్కూల్ ఆఫ్ కోచింగ్ ఎక్సలెన్స్‌ను ఆవిష్కరించారు. భారత క్రీడా వ్యవస్థను పటిష్టం చేయడమే తమ ఉద్దేశమంటున్నారీ స్పోర్ట్స్ స్టార్స్. నూట నలభై కోట్లకుపైగా జనాభా ఉన్నా.. ఇప్పటికీ ఒలింపిక్స్ పతకాలను వేళ్లమీద లెక్కించాల్సిన పరిస్థితి మన దేశానిది. ప్రతిభావంతులున్నా.. అవకాశాలు రాక కొందరు, సరైన మార్గనిర్దేశం లేక మరొకొందరు ఆటల్లో రాణించలేకపోతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్ది.. క్రీడా భారత్‌ను సాకారం చేయాలనే లక్ష్యంతో ముందుకొచ్చారు పుల్లెల గోపిచంద్, నీరజ్‌చోప్రా. ఇండియన్ స్కూల్ ఆఫ్ కోచింగ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించిన వీరు.. క్రీడా వ్యవస్థను పటిష్టం చేయాలనుకుంటున్నారు.

ఇండియన్ స్కూల్ ఆఫ్ కోచింగ్ ఎక్సలెన్స్‌లో పలు అంశాలు ప్రాధాన్యమివ్వనున్నారు. కోచ్‌లకు పలు కార్యక్రమాలు, శారీరకంగా సిద్ధంగా ఉండడం, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ ఎడ్యుకేషన్, సాంకేతికత, కెరీర్ డెవలప్‌మెంట్... వంటివి చేపట్టనున్నారు. అథ్లెట్లకు వివిధ దశల్లో అవసరమైన శిక్షణ ఇచ్చేలా కోచ్‌లకు నైపుణ్యాలు అలవర్చడం ఈ కోచింగ్ ప్రధాన ఉద్దేశాల్లో ఒకటి. భారత క్రీడాధికార సంస్థ, స్పోర్ట్స్ సమాఖ్య, సంఘాలు, హై పెర్ఫామెన్స్ కేంద్రాలు, విద్యా సంస్థలు, ప్రైవేట్ కోచింగ్ సంస్థలతో కలిసి ఐఎస్‌సీఈ పని చేయనుంది.

'ప్రతి అథ్లెట్ కెరీర్ కోచ్‌ల సలహాలతోనే రూపొందుతుంది. క్రీడాకారులకే కాదు వ్యక్తిగతంగా ఎవరికైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. కోచ్‌లు నిరంతరం నేర్చుకునేలా, యువతలో స్ఫూర్తి రగిలించేలా ఐఎస్‌సీఈతో పాటు నీరజ్ చోప్రా ఫౌండేషన్ చేయూతనిస్తుంది'. అని నీరజ్ చోప్రా వెల్లడించాడు. 'భారతదేశం క్రీడా వ్యవస్థ పురోగతి అనేది మనం కల్పించే వనరులపై ఆధారపడి ఉంటుంది. కోచ్‌లే క్రీడాకారుల భవిష్యత్తులో కీలకం. వారు నిరంతరం నేర్చుకునేలా, తమ నైపుణ్యాలు పెంచుకునేలా మా సంస్థ సహకరిస్తుంది' అని గోపీచంద్ పేర్కొన్నాడు.

# సీఎస్‌కే హెడ్ కోచ్‌గా ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్!



ఇండియన్ ప్రీమియర్ లీగ్-2027 సీజన్‌కు సంబంధించి చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ కోచింగ్ స్టాఫ్‌లో ఒక భారీ మార్పునకు శ్రీకారం చుట్టబోతోందా అంటే అవుననే అంటున్నాయి తాజా సమీకరణాలు. సీఎస్‌కే ప్రస్తుత హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో ఇంగ్లాండ్ మాజీ వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఒక సంచలన విషయాన్ని వెల్లడించాడు. మోర్గాన్ నియామకానికి సంబంధించిన అధికారిక నిర్ణయం వచ్చే వారం రోజుల్లోనే వెలువడే అవకాశం ఉందని అశ్విన్ తెలిపాడు.

ఇయాన్ మోర్గాన్‌కు హెడ్ కోచ్‌గా ఎలాంటి ముందస్తు అనుభవం లేనప్పటికీ వైట్-బాల్ క్రికెట్‌లో అతనికున్న అపారమైన వ్యూహాత్మక చతురత తిరుగులేనిది. 2019లో ఇంగ్లాండ్‌కు మొట్టమొదటి వన్డే ప్రపంచ కప్ అందించిన మోర్గాన్, ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టును కెప్టెన్‌గా ఫైనల్స్ దాకా నడిపించాడు. అశ్విన్ అంచనా ప్రకారం... మోర్గాన్‌తో పాటు అతని నమ్మకస్తుడైన ప్రముఖ డేటా అనలిస్ట్ నాథన్ లీమన్ కూడా సీఎస్‌కే సపోర్ట్ స్టాఫ్‌లో చేరే ఛాన్స్ ఉంది.

అయితే ఈ కోచింగ్ మార్పుల టైమింగ్‌పై అశ్విన్ ఒక ఆసక్తికరమైన ట్విస్ట్‌ను తెరపైకి తెచ్చాడు. 2028లో ఐపీఎల్ మెగా వేలం జరగనుండటంతో, దానికి ఒక ఏడాది ముందు అంటే 2027 ఐపీఎల్ సీజన్ వరకు ఎమ్మెస్ ధోనీ స్వయంగా కోచింగ్ బాధ్యతలను భుజాన వేసుకునే అవకాశం ఉందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ధోనీ టీమ్‌ను ముందుండి నడిపిస్తూ ఇతర సహాయక సిబ్బందితో పనులు పూర్తి చేయించడం ప్రస్తుతానికి అత్యుత్తమ ఎంపిక అని, ఆ తర్వాతే మోర్గాన్ పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టవచ్చని అశ్విన్ తన వ్యక్తిగత విశ్లేషణను పంచుకున్నాడు. ఈ వార్తతో అటు చెన్నై ఫ్యాన్స్‌తో పాటు ఇటు క్రికెట్ వర్గాల్లో సరికొత్త చర్చ ఊపందుకుంది.

## భారత్-ఆఫ్ఘాన్ టీ20 సిరీస్ షెడ్యూల్‌లో మార్పులు

న్యూఢిల్లీ: వచ్చే సెప్టెంబరులో భారత జట్టుతో జరగనున్న మూడు టీ20ల సిరీస్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసేందుకు ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు యోచిస్తోంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా సెప్టెంబరు 13,15,17 తేదీల్లో ఈ మ్యాచ్‌లను నిర్వహించేలా గతంలో బీసీసీఐ, ఆఫ్ఘాన్ బోర్డులు సంయుక్తంగా షెడ్యూల్ ప్రకటించాయి. అయితే సిరీస్‌లోని మొదటి లేదా రెండో టీ20 మ్యాచ్‌ను సెప్టెంబరు 14న నిర్వహించాలని ఆఫ్ఘాన్ బోర్డు భావిస్తోంది. ఆ రోజు వినాయక చవితి పండుగ సెలవు దినం కావడంతో మ్యాచ్‌ను వీక్షించేందుకు మైదానానికి ప్రేక్షకులు భారీగా వచ్చే అవకాశం ఉందని బోర్డు అంచనా వేస్తోంది. అంతే కాకుండా టీవీ, డిజిటల్ వీక్షణల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుందని ఆశిస్తోంది. ఈ ప్రతిపాదనను ఆఫ్ఘాన్ క్రికెట్ బోర్డు ఇప్పటికే బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. బీసీసీఐ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపితేనే నూతన షెడ్యూల్ ఖరారవుతుంది. సొంత దేశంలో అస్థిర పరిస్థితుల కారణంగా ఆఫ్ఘనిస్తాన్ చాలాకాలంగా భారత్‌ను వేదికగా చేసుకుని హోమ్ సిరీస్‌లను ఆడుతున్న సంగతి తెలిసిందే.

## 15 ఏళ్లలో తొలిసారి..
## భారత్, పాకిస్థాన్ మధ్య ఒక్కటే మ్యాచ్!



క్రికెట్ అభిమానులకు కావాల్సినంత థ్రిల్‌ను పంచే భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజే వేరు. అంతర్జాతీయ వేదికపై 'నువ్వానేనా' అని తలపడే ఇండో-పాక్ జట్ల పోరుపై ఈసారి సందేహాలు నెలకొన్నాయి. ఐసీసీ నిర్వహించే వరల్డ్ కప్ నుంచి ఆసియా కప్ వరకూ ఒకే గ్రూప్‌లో ఉండే దాయాదులు.. ఆసియా క్రీడల్లో మాత్రం వేర్వేరు గ్రూప్‌లో నిలిచాయి. త్వరలో జపాన్ వేదికగా జరగనున్న ఈ గేమ్స్‌లో ఇరు జట్లు ప్రత్యర్థులుగా తలపడే అవకాశాలు తక్కువే. దాంతో ఎప్పటిలా చిరకాల ప్రత్యర్థుల ఆటను చూసే భాగ్యం ఈసారి దక్కేలా కనిపించడం లేదు.

ఐసీసీ ఈవెంట్లు, ఆసియా కప్ వంటి టోర్నీల్లో కనీసం రెండుసార్లైనా భారత్, పాకిస్థాన్ మ్యాచ్ చూసేవాళ్లం. అయితే.. ఈసారి మాత్రం అభిమానులకు నిరాశే ఎదురవ్వనుంది. ఎందుకంటే.. ఆసియా క్రీడల్లో దాయాదులు వేర్వేరు గ్రూప్‌లో ఉండడమే అందుకు కారణం. గురువారం తీసిన డ్రాలో.. చిరకాల ప్రత్యర్థులు చెరో గ్రూప్‌లో నిలిచాయి. పురుషుల, మహిళల విభాగంలోనూ ఇదే పరిస్థితి. దాంతో, ఇంతకుముందులా ఒకే టోర్నీలో మరోమారు బిగ్‌ఫైట్‌ను వీక్షించడం సాధ్యం కాదు.

క్రిక్ బజ్ కథనం ప్రకారం.. భారత్, పాకిస్థాన్ జట్లు వ్యతిరేక గ్రూప్‌లో ఉన్నాయి. క్వార్టర్ ఫైనల్-1లో పాక్, క్వార్టర్ ఫైనల్-2లో టీమిండియా తలపడనున్నాయి. క్వార్టర్ ఫైనల్-1లో గెలుపొందిన జట్టు సెమీఫైనల్లో.. క్వార్టర్ ఫైనల్ 3 విజేతను ఢీకొడుతుంది. క్వార్టర్ ఫైనల్-2 విజేత, క్వార్టర్ ఫైనల్-4లో గెలుపొందిన జట్టు రెండో సెమీస్‌లో అమీతుమీ తేల్చుకుంటాయి. ఈ నేపథ్యంలో భారత్, పాక్ ఫైనల్ చేరితే పసిడి పతకం కోసం.. అదీ కాదంటే కాంస్యం కోసం మాత్రమే తలపడే అవకాశముంది. చివరిసారిగా 2011 వన్డే ప్రపంచకప్‌లో ఇరుజట్లు గ్రూప్-ఎ, గ్రూప్-బిలో ఆడాయి.

ఆసియా క్రీడల్లో క్రికెట్ మ్యాచ్‌లు సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు జరుగుతాయి. పురుషుల జట్ల మ్యాచ్‌లు సెప్టెంబరు 24వ తేదీన మొదలై అక్టోబరు 1న పూర్తవుతాయి. మహిళల జట్ల మ్యాచ్‌లు ఆరు రోజుల్లోనే ముగియనున్నాయి. సెప్టెంబరు 17 నుంచి 22 వరకు జరిగే మ్యాచ్‌ల తర్వాత చాంపియన్ ఎవరో తేలిపోతుంది.

## శ్రీశాంత్‌ని రూమ్‌మేట్‌గా తీసుకుంటా: హర్భజన్ సింగ్



ముంబై: భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత సంచలనాత్మక సంఘటనల్లో ఒకటైన 2008 ఐపీఎల్ 'చెంపదెబ్బ వివాదం' (స్లాప్‌గేట్) మళ్లీ వార్తల్లోకి వచ్చింది. ఆ ఉదంతం జరిగి దాదాపు 18 ఏళ్లు దాటినా ఇప్పటికీ ఏదో ఒక రూపంలో చర్చనీయాంశమవుతూనే ఉంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

అవకాశం వస్తే ఎస్.శ్రీశాంత్‌తో ఒకే గదిని (రూమ్) పంచుకోవడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని హర్భజన్ తెలిపాడు. "మా ఇద్దరికీ అవకాశం లభించి ఒకే గదిలో ఉండే పరిస్థితి వస్తే, గతంలో ఎదురైన సమస్యలు, మనస్పర్థలన్నింటినీ కూర్చుని పరిష్కరించుకోగలమనే నమ్మకం నాకుంది. నేను ఇదే కోణంలో ఆలోచిస్తున్నాను. కాబట్టి నా రూమ్‌మేట్‌గా శ్రీశాంత్‌ను ఎంపిక చేసుకోవడానికి నాకు ఎలాంటి ఇబ్బంది లేదు" అని స్పష్టం చేశాడు. గతంలో ఓ ఇంటర్వ్యూలో శ్రీశాంత్ మాట్లాడుతూ.. హర్భజన్‌తో సమస్యను బాక్సింగ్ రింగ్‌లోనే తేల్చుకుంటానంటూ సవాల్ విసిరిన విషయం తెలిసిందే. 2008 ఐపీఎల్ ప్రారంభ సీజన్‌లో చెన్నై వేదికగా జరిగిన ఒక మ్యాచ్ ముగిసాక... మైదానంలో భావోద్వేగాన్ని ఆపుకోలేక హర్భజన్.. శ్రీశాంత్‌పై చేయి చేసుకున్నాడనే ఆరోపణలతో లీగ్ నుంచి సస్పెన్షన్‌కు గురైన సంగతి విదితమే.

# రంజీ నుంచి టీమిండియా దాకా

### భారత టెస్టు జట్టులోకి సారాంశ్ జైన్



పదేళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో శ్రమించి, చివరికి భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకోవడంపై మధ్యప్రదేశ్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్ సంతోషం వ్యక్తం చేశారు. శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ఎంపికైన సారాంశ్ జైన్... తోటి ఆటగాడు ఆకిబ్ నబీతో కలిసి బీసీసీఐ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న వీడియోలో మాట్లాడారు. గుడికి వెళ్తున్న సమయంలో తన ఫోన్‌కు వరుసగా కాల్స్, మెసేజ్‌లు రావడం ద్వారా తాను టీమిండియాకు ఎంపికైనట్లు తెలుసుకున్నానని సారాంశ్ వెల్లడించాడు. "ఇక్కడికి వచ్చాక నాకేమీ కొత్తగా అనిపించలేదు. ఎందుకంటే జట్టులోని 80 శాతం ఆటగాళ్లతో ఇప్పటికే కలిసి ఆడిన అనుభవం ఉండటంతో త్వరగానే కలిసిపోయాను" అని పేర్కొన్నాడు.

**కుటుంబానిదే కీలక పాత్ర**

"టెస్టు క్రికెట్‌లో రాణించాలన్నా, భారత జట్టులోకి అడుగుపెట్టాలన్నా ఓర్పు అత్యంత ముఖ్యం. 2014-15 సీజన్‌లో రంజీ ట్రోఫీలోకి అడుగుపెట్టినప్పటి నుంచి నిరంతరం కష్టపడి అనేక త్యాగాలు చేశాను. నా కలను నిజం చేసుకోవడంలో మా కుటుంబం వహించిన పాత్ర వెలకట్టలేనిది. మా నాన్నగారు కూడా మాజీ రంజీ ప్లేయర్ కావడంతో.. 'సహనంతో ఉంటే పరిస్థితులు మనకు అనుకూలంగా మారతాయి' అని నిరంతరం మార్గదర్శనం చేసేవారు. ఇప్పుడు ఆ మాటలు నిజమయ్యాయి" అని సారాంశ్ భావోద్వేగానికి లోనయ్యాడు.

చైతన్య రథం


# సినిమా

శుక్రవారం 14 ఆగస్టు 2026 X

# వెండి తెరపైకి శ్రీదేవి బయోపిక్!

భారతీయ చలన చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసి, అభిమానుల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అతిలోక సుందరి శ్రీదేవి జీవిత చరిత్ర (బయోపిక్) వెండి తెరపైకి రాబోతోందనే వార్తలు చిత్ర పరిశ్రమలో తీవ్ర ఆసక్తి రకెత్తిస్తున్నాయి. రూ.కోటి పారితోషికం తీసుకున్న తొలి భారతీయ కథానాయికగా ఘనత సాధించిన శ్రీదేవి స్టార్‌డమ్, ఆమె సినీ ప్రస్థానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.

తాజాగా శ్రీదేవి జయంతిని పురస్కరించుకుని ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సోషల్ మీడియా వేదికగా ఆమెకు నివాళులర్పిస్తూ... ధీరజ్ యు.కుమార్ రచించిన 'ఎంప్రెస్–ది డెఫినిటివ్ బయోగ్రఫీ ఆఫ్ శ్రీదేవి' పుస్తక ముఖచిత్రాన్ని పంచుకున్నారు. ఈ పోస్టును శ్రీదేవి భర్త, ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ రీపోస్ట్ చేయడంతో ఈ పుస్తక ఆధారంగా బయోపిక్ రూపుదిద్దుకోనుందనే ప్రచారం ఊపందుకుంది.






బాల నటిగా కెరీర్ ప్రారంభించి తెలుగు, తమిళ, హిందీ భాషల్లో అగ్ర కథానాయికగా ఏలిన శ్రీదేవి వ్యక్తిగత, సినీ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రూపొందే బయోపిక్‌కు సంబంధించి సినీ వర్గాల్లో పలు ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. శ్రీదేవి పాత్రను పోషించే నటి ఎవరు? ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి దర్శకత్వం వహించేది ఎవరు? ఆమె కెరీర్‌లో కీలకమైన ఎన్టీఆర్, ఏఎన్నార్, కమల్‌హాసన్, రజనీకాంత్, చిరంజీవి, అమితాబ్‌బచ్చన్ వంటి దిగ్గజ నటుల పాత్రల్లో ఎవరు కనిపించబోతున్నారు? 2012లో 'ఇంగ్లీష్ వింగ్లీష్' చిత్రంతో పునరాగమనం చేసి రూ.3.5 కోట్ల భారీ పారితోషికంతో తన క్రేజ్ తగ్గలేదని నిరూపించిన శ్రీదేవి జీవితాన్ని తెరపై ఎలా ఆవిష్కరిస్తారోనని ప్రేక్షకులు, అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




# ఆసుపత్రి నుంచి ఎన్టీఆర్ డిశ్చార్జ్

హైదరాబాద్: టాలీవుడ్ ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ కిమ్స్ ఆసుపత్రి నుంచి గురువారం డిశ్చార్జ్ అయ్యారు. ఇటీవల జిమ్‌లో కసరత్తులు చేస్తుండగా ఆయన కుడి భుజానికి తీవ్ర గాయమైంది. దీనిపై వైద్యులను సంప్రదించగా శస్త్ర చికిత్స అవసరమని సూచించడంతో మంగళవారం కిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైద్యుల బృందం ఆయనకు విజయవంతంగా ఆర్త్రోస్కోపిక్ సర్జరీ పూర్తి చేసింది. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో గురువారం ఉదయం వైద్యులు ఇంటికి పంపించారు. శస్త్ర చికిత్స తర్వాత వైద్యులతో ఎన్టీఆర్ దిగిన ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కాగా తన ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన అభిమానులు, శ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు సర్జరీ నుంచి కోలుకున్న ఎన్టీఆర్‌కు కొన్ని రోజుల పాటు ఫిజియోథెరపీ అవసరమని వైద్యుల బృందం స్పష్టం చేసింది. ఆయన పూర్తిగా కోలుకుని పాత స్థితికి రావడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుందని వైద్యులు వెల్లడించారు.

# సుకుమార్ కుమార్తె మరో అరుదైన ఘనత

స్టార్ డైరెక్టర్ సుకుమార్ కూతురు సుకృతి వేణి గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. చిన్న వయసులోనే నటిగా తన ప్రతిభను చాటుకున్న ఆమె.. ఇప్పుడు సంగీత రంగంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ఇటీవల సౌత్ కొరియాలో జరిగిన ఓ మ్యూజిక్ కాన్సర్ట్‌లో సుకృతి వేణి మెయిన్ సింగర్‌గా పెర్ఫార్మ్ చేసింది. ఆమె ఇంగ్లీష్ సాంగ్‌ను హాలీవుడ్ స్టైల్‌లో ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. వాయిస్, సింగింగ్ స్టైల్‌కు మంచి ప్రశంసలు దక్కినట్లు తెలుస్తోంది. ఇక తాజాగా



సుకృతి వేణి మరో అంతర్జాతీయ అవకాశాన్ని సొంతం చేసుకుంది. అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న ప్రతిష్ఠాత్మక బెర్క్లీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్‌లో నిర్వహించనున్న సమ్మర్ మ్యూజిక్ ప్రోగ్రామ్‌కు ఆమె ఎంపికైంది. ఇందుకోసం నిర్వహించిన ఆడిషన్స్‌లో మొత్తం 272 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు సమాచారం. వీరిలో కేవలం 14 మందికి మాత్రమే పూర్తి స్కాలర్‌షిప్ లభించింది. అందులో సుకృతి వేణి కూడా చోటు దక్కించుకోవడం విశేషం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. సింగర్స్ విభాగంలో ఫుల్ స్కాలర్‌షిప్ పొందిన ఏకైక విద్యార్థిని సుకృతి వేణి అని తెలుస్తోంది.

## రీల్స్, ఫోన్ మోజులో
# ప్రాణాల మీదకు తెచ్చుకున్నా: షకీలా

గంటల తరబడి స్మార్ట్‌ఫోన్ వాడే అలవాటు ఎంతటి ప్రమాదకరమైన అనారోగ్య సమస్యలకు దారితీస్తుందో చెప్పడానికి సీనియర్ నటి షకీలా ఉదా హరణగా నిలిచారు. రోజంతా ఫోన్ వాడటం, పడుకుని రీల్స్ చూడటం వంటి వ్యసనాల కారణంగా ఆమె తీవ్రమైన నరాల సమస్యను ఎదుర్కొన్నారు. ఇటీవల అత్యవసరంగా మెడ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా బయట పెట్టింది. తన అనారోగ్య సమస్య వెనుక ఉన్న అసలు కారణాలను వివరిస్తూ షకీలా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా తాను మంచంపై తప్పుడు భంగిమలో గంటల తరబడి పడుకుని మొబైల్‌లో గేమ్స్ ఆడటం, రీల్స్ చూడటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని తెలిపారు. కేవలం టీ లేదా కాఫీ తాగేందుకు మాత్రమే కొద్దిసేపు విరామం తీసుకునేదాన్నని, ఆ తర్వాత వెంటనే మళ్లీ ఫోన్‌కు అతుక్కుపోయేదానినని చెప్పారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో రీల్స్ చూస్తూ రోజులో ఎక్కువ సమయం వృథా చేసేదాన్నని, ఈ చెడు అలవాటు వల్ల తన మెడలోని ప్రధాన నరాలపై తీవ్రమైన ఒత్తిడి పడిందని పేర్కొన్నారు.



ఈ చిన్న అలవాటు చివరికి తనను ఆపరేటింగ్ టేబుల్ ఎక్కేలా చేసిందని ఆమె వాపోయారు. ఈ మేజర్ సర్జరీ కోసం ఏకంగా రూ.3 లక్షల వరకు ఖర్చు కావడమే కాకుండా, తాను శారీరక నరకాన్ని అనుభవించానని షకీలా కంటతడిపెట్టారు. ప్రస్తుతం కనీసం మంచం దిగాలన్నా, స్వయంగా తినాలన్నా ఇతరుల సహాయం తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మొబైల్ వినియోగదారులందరికీ ఆమె ఒక గట్టి హెచ్చరిక జారీ చేశారు. దయచేసి ప్రతి ఒక్కరూ స్క్రీన్ టైమ్‌ను వీలైనంతగా తగ్గించుకోవాలని, ఫోన్‌ను విపరీతంగా వాడి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని హితవు పలికారు. ముఖ్యంగా తల్లిదండ్రులు చిన్న పిల్లలను స్మార్ట్‌ఫోన్లు, గాడ్జెట్లకు దూరంగా ఉంచాలని, లేదంటే భవిష్యత్తులో వారు కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని షకీలా హెచ్చరించారు.



# రెడ్ డ్రెస్‌లో రకుల్

రకుల్ ప్రీత్ సింగ్ గురించి, ఆమె అందం గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తక్కువ టైమ్‌లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు, భారీ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకున్న రకుల్ ప్రస్తుతం బాలీవుడ్‌కు వెళ్లి అక్కడే సెటిలైపోయింది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫొటోలను నెట్టింట షేర్ చేస్తూ ఫాలోవర్లకు టచ్‌లో ఉండే రకుల్ తాజాగా ట్రెండీ లుక్‌లో దర్శనమిచ్చింది. ఈ ఫొటోల్లో రకుల్ రెడ్ కలర్ స్ట్రాప్లెస్ లెస్ కాలమ్ ఫ్రాక్ ధరించి ఎంతో అందంగా కనిపించింది. ఈ డ్రెస్‌లో రకుల్‌ను, ఆమె అందాలను చూసి కుర్రాళ్లు ఫిదా అయిపోయి వాటిని సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.

# టైమ్ మెషీన్‌తో శర్వానంద్ గేమ్ స్టార్ట్..
## శ్రీను వైట్ల భారీ ప్లాన్!

చార్మింగ్ స్టార్ శర్వానంద్ తన తర్వాతి సినిమాను సీనియర్ డైరెక్టర్ శ్రీను వైట్లతో చేయనున్నట్టు సినీ వర్గాల్లో డిస్కషన్ జరుగుతోంది. ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాకు 'జార్జ్ కృష్ణ' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్టు సమాచారం. ఈ సినిమాను ఆగస్టు 14న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా లాంచ్ చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. చాలా కాలం తర్వాత శ్రీను వైట్ల ఎంటర్టైన్మెంట్‌కు ప్రాధాన్యం ఉన్న కథతో వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాకు మెయిన్ ఎట్రాక్షన్ టైమ్ మెషీన్ కాన్సెప్ట్ అని తెలుస్తోంది. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, ఫాంటసీ అంశాలను కలిపి రూపొందిస్తున్న ఈ సినిమా షూటింగ్‌ను సెప్టెంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను షూటింగ్ ప్రారంభానికి ముందే అఫీషియల్‌గా అనౌన్స్ చేయనున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందిస్తున్నారు. జార్జ్ కృష్ణ సినిమాను సంక్రాంతి 2027 బరిలోకి తీసుకురావాలనే టార్గెట్‌తో చిత్ర బృందం ముందుకు సాగుతోంది. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారని, అందుకోసం ప్రస్తుతం స్పెషల్ మేకోవర్‌పై పనిచేస్తున్నారని తెలుస్తోంది.

